

పేదరికాన్ని తరిమికొట్టాలి అనడం సహజమైన నినాదం. ఇది ఇన్నాళ్లు ఉపన్యాసాలకే పరిమితమైన మాట. అయితే ఈ సహజమైన నినాదం ఇప్పుడు నిజమవుతోంది. ఉపన్యాసాలు చెప్పడం కాదని, చేసి చూపుతామని ప్రజా ప్రభుత్వం సంకల్పించింది. అట్టడుగున ఉన్న నిరుపేదలు సైతం గౌరవవంతమైన జీవనాన్ని పొందేలా చర్యలకు ఉపక్రమించింది. నిరుపేదల అవసరాలపై సర్వే చేసింది. జిల్లాలో 74వేలకు పైగా కుటుంబాలను గుర్తించింది. అంతటితో ఆగలేదు. వారిని ఆదుకునే దాతలను ఎంపిక చేస్తోంది. ఈ మొత్తం ప్రక్రియ ద్వారా పీ4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) పేరుతో మహత్తరమైన కార్యక్రమాన్ని చేపడుతోంది.

మార్గదర్శకుల కోసం అన్వేషణ



కెల్లంపల్లిలో అంజలి చెప్పే సమస్యలు వింటూ చలించిపోయిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



- జిల్లాలో 74,911 బంగారు కుటుంబాల గుర్తింపు
- వారి అవసరాలపై గ్రామాల్లో అధికారుల సర్వే
- ఆసరాగా నిలిచే దాతల ఎంపికపై ముమ్మర కసరత్తు
- ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ అన్సారియా
- వివిధ అసోసియేషన్లతో జేసీ సమావేశాలు
- అధికారులు కూడా దత్తత తీసుకొనేలా చర్యలు

ఒంగోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పీ4 విధానం అమలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేకదృష్టి సారించింది. ఇందులో పేదల ఆర్థికాభివృద్ధికి ఆసరాగా నిలిచే కీలకమైన మార్గదర్శకుల కోసం అధికార యంత్రాంగం అన్వేషిస్తోంది. ప్రభుత్వ ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం(పీ4) పేరుతో పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. అట్టడుగు స్థాయిలోని 20శాతం కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించి వారికి ఆసరాగా నిలిచేందుకు ముందుకు వచ్చి సాయం అందించే వారిని మార్గదర్శకులుగా పేరు పెట్టింది. ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాలుగా గుర్తించబడిన వారందరికి ఎవరో ఒకరి ద్వారా సాయం అందేలా మార్గదర్శకులను ఎంపికచేసి సాయం అందించే ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లావ్యాప్తంగా సర్వే

ఇప్పటికే ప్రభుత్వం జిల్లాలో నిర్వహించిన సర్వే ద్వారా 74,911 బంగారు కుటుంబాలను జిల్లాలో అధికారులు గుర్తించారు. సచివాలయం యూనిట్‌గా ఈ సర్వేను రెండు నెలల క్రితమే చేయగా అందులో అట్టడుగున ఉన్న 20శాతం కుటుంబాల వివరాలను ఆయా గ్రామాల్లో పేర్లతో సహా గుర్తించారు. ప్రస్తుతం ఒకవైపు ఆయా కుటుంబాలకు ఎలాంటి ఆసరా కావాలి? వారి అవసరాలు ఏమిటి? అనేదానిపై వివరాలు సేకరిస్తూనే మరోవైపు ఆయా కుటుంబాలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చే మార్గదర్శకుల ఎంపిక పైనా యంత్రాంగం దృష్టి సారించింది. ఇందుకోసం వారం రోజులుగా కలెక్టర్ తమీమ్ అన్సారియా వివిధ స్థాయి అధికారులు, విభిన్నవర్గాల వారితో విడివిడిగా, సంయుక్తంగా సమీక్షలు చేస్తున్నారు. మంగళవారం ముండ్లమూరు మండలంలో జరుగుతున్న బంగారు కుటుంబాల సర్వేను కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు.

● ఉన్నతస్థాయి వారితో అధికారుల సమావేశాలు

బంగారు కుటుంబాలుగా గుర్తించబడిన వారి అవసరాలను తెలుసుకొని ఈనెల 25లోపు పీ4పై ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించిన

మిగతా 6లో...



బోడపాడు ఎంపీపీ పాఠశాల ఫుల్

- నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు
- ఇది శుభపరిణామం : ఎంఈవోలు

వివరాలు మెయిన్‌లో..

ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో

సకల వసతులు

- ప్రభుత్వం ఆదేశం
- తప్పులతడకగా మొదటి నివేదికలు
- మళ్లీ కోరిన ఉన్నతాధికారులు

ఒంగోలు విద్య, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో సకల వసతుల కల్పనకు సంకల్పించింది. అందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు సమయంలో సౌకర్యాలకు సంబంధించి సేకరించిన నివేదికలన్నీ తప్పులతడకగా ఉన్నట్లు ఉన్నతాధికారుల పరిశీలనలో తేలింది. ప్రతి తరగతికీ ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేస్తామని ఆరంభంలో ప్రభుత్వం ప్రకటించగా అనేక చోట్ల ఆ పరిస్థితి లేదు. దీంతో వాటి భౌతిక, మౌలిక వసతులపై తాజా నివేదికలను కోరింది.

ఎంఈవోల ఆధ్వర్యంలో కమిటీలు

పాఠశాలలను స్వయంగా పరిశీలించి వసతులపై నివేదిక ఇచ్చేందుకు ఎంఈవోల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో ఎంఈవో, సంబంధిత క్లస్టర్ హెచ్‌ఎం, పాఠశాల హెచ్‌ఎం, ఇంజనీరింగ్/వెల్ఫేర్ అసిస్టెంట్లను నియమించారు. హైస్కూళ్లు, యూపీలో ఆదర్శ పాఠశాలలను సెకండరీ సెక్షన్లకు పోను తరగతి గదులు అదనంగా ఉంటే వాటిని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు వినియోగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పాఠశాల భవనం వరండా ఎనిమిది అడుగులపైన ఉంటే దానిని తరగతి గదిగా మార్చాలని సూచించారు. అవసరమైతే ప్రస్తుతం ఉన్న తరగతి గదులను విభజించి వినియోగించు కోవాల్సి ఉంటుంది. ఆదర్శ పాఠశాలల్లోని తరగతి గదులన్నింటికీ పెయింటింగ్‌లు వేయించమన్నారు. క్లస్టర్, మండల, జిల్లాస్థాయిలో మిగిలి ఉన్న సామగ్రిని సర్దుబాటు చేసి వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు.



ముగ్గురు పీఎస్ హెచ్‌ఎంల ప్రమోషన్లు రద్దు

- ఎస్‌జీటీ ఉర్దూ టీచర్లుగా రివర్షన్
- ఉత్తర్వులు జారీచేసిన డీఈవో

7

మరో 'సారీ'

రేషన్ కార్డుదారులకు కందిపప్పు లేనట్లే!

- కేవలం బియ్యం, పంచదార మాత్రమే సరఫరా
- ఏడు నెలలుగా ఇదే పరిస్థితి
- గత వైసీపీ నిర్వాకమే కారణం
- మూడు రోజుల్లోపు దివ్యాంగులు, వృద్ధులకు ముందస్తుగా పంపిణీ



ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెల్లరేషన్ కార్డుదారులకు ఆగస్టులో కూడా కందిపప్పు లేనట్లే. కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇవ్వనున్నారు. ఈ రెండింటినే పౌరసరఫరాల గిడ్డంగుల నుంచి రేషన్ దుకాణాలకు అధికారులు సరఫరా చేస్తున్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభించనున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం మరో రెండు మూడురోజుల్లో అందజేయనున్నారు. జూలై నెలకు సంబంధించిన రేషన్‌ను జూన్ 25వతేదీ నుంచి పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 1,392 రేషన్ దుకాణాల పరిధిలో 6,61,206 కార్డుదారులు ఉన్నారు. వారికి ప్రభుత్వం ప్రతినెలా 10,391 మెట్రిక్ టన్నుల బియ్యం, 346 మెట్రిక్ టన్నుల పంచదార, 661 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయిస్తోంది. అయితే బియ్యం, పంచదార పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండగా కందిపప్పును మాత్రం ప్రభుత్వం కేటాయించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం కందిపప్పు టెండర్‌దారులకు భారీగా బకాయిలను పెండింగ్‌లో పెట్టింది. దీంతో సరఫరా చేసేందుకు వారు ముందుకు రాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నా రాష్ట్రస్థాయిలో కొన్ని పరిణామాలతో ఏడు నెలలుగా కార్డుదారులకు కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర అధికంగా ఉండటంతో పేదలు రేషన్ షాపుల ద్వారా ఇచ్చే వాటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే రాష్ట్రస్థాయి నుంచే జిల్లాకు కేటాయింపు నిలిచిపోయింది. దీంతో ఆగస్టులో కూడా కందిపప్పు లేదన్న విషయం స్పష్టమవుతోంది. కేవలం బియ్యం, పంచదారను మాత్రమే పంపిణీ చేయనున్నారు.



ఒంగోలు-2లో రైతులతో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్

పంట ఉత్పత్తిని తగ్గించకపోతే ప్రమాదం

- పొగాకు రైతులకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ హెచ్చరిక
- పలు వేలం కేంద్రాల్లో కొనుగోళ్ల పరిశీలన

ఒంగోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : 'పొగాకు పంట అధిక ఉత్పత్తి వల్ల ఎంత ఇబ్బంది కలుగుతున్నదో ప్రస్తుత కొనుగోళ్లలో మీరంతా చూస్తున్నారు. వచ్చే ఏడాది ప్రపంచ దేశాల్లో మరింత అధికంగా పండే అవకాశం ఉంది. అప్పుడు మరిన్ని ఇక్కట్లు పడాల్సి వస్తుంది. రానున్నది గడ్డుకాలం. దీన్ని గుర్తించి పంట ఉత్పత్తిని తగ్గించుకోకపోతే తీవ్రంగా నష్టపోకతప్పదు' అని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ రైతులను హెచ్చరించారు. జిల్లాలోని ఒంగోలు-1, ఒంగోలు-2, వెల్లంపల్లి వేలం కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. పొగాకు కొనుగోళ్లను పరిశీలించారు. వేలం కేంద్రాలకు తెస్తున్న బేళ్లు, వాటి నాణ్యత, ఆయా గ్రేడ్‌లకు లభిస్తున్న ధరలను పరిశీలించారు. రైతులు, వివిధ కంపెనీల బయ్యర్లతో మాట్లాడారు. గత పక్షం రోజుల కన్నా పరిస్థితి కొంత మెరుగైందని అటు బోర్డు సిబ్బంది, ఇటు బయ్యర్లు, కొందరు రైతు ప్రతినిధులు కూడా ఆయన దృష్టికి తెచ్చారు. పోటీపడి మేలు రకం బేళ్లను

మిగతా 6లో...



మార్కాపురంలోని మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

మెడికల్ షాపుల్లో తనిఖీలు

- ఔషధ నియంత్రణ శాఖ ఏడీ ఆధ్వర్యంలో రంగంలోకి ఎనిమిది బృందాలు
- ఎన్టీఆర్ ట్రస్టు ఆసుపత్రుల్లోనూ సోదాలు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మెడికల్ షాపుల్లో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఏడీ డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో కూడిన 8 బృందాలు ఈ ప్రక్రియను చేపట్టాయి. మార్కాపురం, పొదిలి, ఒంగోలు, కనిగిరి, ప్రాంతాల్లో పలు మెడికల్ షాపులతోపాటు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెందిన ఆసుపత్రుల్లో సోదాలు చేశాయి. 12 ఔషధ నమూనాలు సేకరించాయి. ఈ సందర్భంగా ఏడీ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో కొన్ని లోపాలను గుర్తించామన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘించిన ఉదంతాలు కనిపించలేదని తెలిపారు. మందుల హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు బుధవారం ఉదయం 10.30 నుంచి జడ్పీ పాత సమావేశం హాలులో జరుగుతాయని సీఈవో బి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షత వహిస్తారన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీశిశుసంక్షేమం, సాంఘిక సంక్షేమం, ప్రణాళిక, ఆర్థిక విషయాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన సమయాల్లో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- సీఎం చంద్రబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, అనుబంధశాఖలకు సంబంధించిన పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 224 మంది రైతుల వద్ద నుంచి 657 మెట్రిక్ టన్నుల నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసినట్లు ఈసందర్భంగా కలెక్టర్ అన్సారియా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనివిలువ సుమారు రూ.5.5కోట్లు ఉంటుందని వివరించారు. ఆయా అంశాలపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందుల వినియోగం, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తోపాటు జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒంగోలులో ఫ్లెక్సీల రగడ!

- 'హరిహర వీరమల్లు' చిత్రం విడుదల సందర్భంగా ఏర్పాటు
- చర్చి సెంటర్‌లో తొలగించిన కార్పొరేషన్ అధికారులు
- ఆగ్రహం వ్యక్తంచేసిన జనసేన కార్పొరేటర్లు

7

టమాటా, ఉల్లిపాయలను దిగుమతి చేసుకోవాలి

- జేసీ గోపాలకృష్ణ ఆదేశం
- కూరగాయల కొరత సృష్టిస్తే చర్యలు

7



ఆక్రమించుకున్న భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

ఆక్రమిత భూమి స్వాధీనం

తర్లుపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు ఇలాకాలో వైసీపీ నేత ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 'ప్రభుత్వ భూమి హాంఫట్' శీర్షికన ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ కేకే కిశోర్‌కుమార్ ఆ భూమిని పరిశీలించారు. వైసీపీ నాయకుడు ఆక్రమించుకున్నట్లు నిర్ధారించారు. ఆయన రూ.కోటికి అమ్ముకున్న సర్వే నంబర్ 132-3లో 1.55 ఎకరాలు, 129-11లో 52 సెంట్ల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఆయన వెంట సర్వేయర్ మనోహర్, వీఆర్వో షఫీ ఉన్నారు.

వర్షాకాలంలో ప్రజలకు తప్పని పాట్లు



విశ్వనాథపురం కెనరా బ్యాంక్ వద్ద సాగర్ నీటికోసం పడిగాపులు



చెక్క రిక్షాపై తాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు

పొదిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలోనూ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పొదిలి పట్టణం జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నడికూడలిగా ఉంది. ఇక్కడ తాగునీటి సమస్య ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. వరుణుడు కరుణించి పూర్తి స్థాయిలో వర్షం కురిసినా తాగునీటికి మాత్రం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 9, 10 నుంచి 20వ తేదీ వరకు సాగర్ నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శివారు, సుదూర ప్రాంతాల నుంచి శివాలయం ఎదురుగా ఉన్న కొళాయి వద్ద, కెనరా బ్యాంక్ వద్ద కొళాయి దగ్గరకు వచ్చి గంటల తరబడి వేచి ఉండి బబుల్స్ పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంలో రెండుసార్లు మూడురోజులు రావాల్సిన తాగునీరు 10రోజులకు కూడా రాకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న నీటి వనరుల నుంచి మోటార్‌బైకులపై, తోపుడుబండ్లపై వచ్చి తెచ్చుకొని దప్పిక తీర్చుకుంటున్నామంటున్నారు. ఇప్పటికైనా అధికారులు సాగర్ నీటిని సకాలంలో విడుదల చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొడదాం

- ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య
- వ్యాపారులు, పురప్రముఖులతో సమావేశం
- పీ-4కు మార్గదర్శకులు ముందుకురావడంపై హర్షం

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టి, గ్రీన్ చీరాలగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ సమావేశం హాలులో చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి పట్టణంలోని వ్యాపారులు, పురప్రముఖులతో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగి మూగజీవాలు అశువులు బాస్తుండడంతో పాటు, చాపకింద నీరులా ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నట్లు వివరించారు. మరో రెండు మాసాల్లో పూర్తి స్థాయిలో నిషేధాజ్ఞలు అమల్లోకి వస్తాయన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. అలాగే పీ-4కు మార్గదర్శకులుగా స్వచ్ఛందంగా దాతలు ముందుకు రావడంతో ఎమ్మెల్యే వారిని ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు కొద్ది రోజులుగా సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

చీరాల : అది వైసీపీ పార్టీ చీప్ పార్టీ అని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. వైసీపీ మాజీ మంత్రి రోజా అధికార పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కొండయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 సీట్లకు పరిమితమైనా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. తప్పులు తెలుసుకుని ప్రజల నమ్మకాన్ని చూరగొనాల్సింది పోయి, మహిళ నేతలతో జగన్‌రెడ్డి అసభ్యకరంగా మాట్లాడించడం ఆ పార్టీకి సిగ్గుచేటని చెప్పారు. సొక్కాత్తు రక్తం పంచుకొని పుట్టిన సోదరితోపాటు తల్లిని బయటకు నెట్టేసిన జగన్‌ది నీచపు సంస్కృతి అని వ్యాఖ్యానించారు. రోజా నోరు అదుపు చేసుకోవాలని సూచించారు. రోజా తన గత చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. అలాగే కూటమి మహిళ నేతలు గడియార స్తంభం కూడలిలో రోజా చిత్రపటాలను దహనం చేశారు.

వరద ఉధృతికి 'సాగి' వాగుకు గండ్లు

పర్చూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎగువన కురిసిన వర్షాలకు, సాగి వాగులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని ఏళ్లుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఈ వాగులో చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. వరద ఉధృతంగా రావడం, నీటి సరఫరా సక్రమంగా జరగక పోవడంతో సాగి వాగు కాలువకు పలుచోట్ల గండ్లుపడ్డాయి. దీంతో వరద నీరు సమీప పొలాల్లోకి ప్రవహిస్తుండడంతో ఎటు చూసినా సముద్రాన్ని తలపించేలా పంటపొలాలు ఉన్నాయి.

ప్రస్తుతం పైర్లు సాగుచేయకపోవడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నా, వరద ఉధృతికి పొలాలు కోతకు గురవుతున్నాయని, రైతుల ఆందోళన చెందుతున్నారు. సాగి వాగు అభివృద్ధిలో నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల ప్రారంభంలోనే వాగు పరిస్థితి ఇలా ఉంటే, పైర్లు సాగుచేసిన తర్వాత పరిస్థితి పునరావృతం అయితే పంటలు కోల్పోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సమీప గ్రామాలు కూడా ముంపునకు గురి కావాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపో తున్నారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని యద్దనపూడి మండలంలో మొదలయ్యే సాగి వాగు పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం, అడుసుమల్లి, రమణాయపాలెం, మీదుగా చెరుకూరును కలుపుకొని బాపట్ల సమీపంలో సముద్రంలో కలుస్తుంది. వాగు పరివాహక గ్రామాల్లో వేల ఎకరాలకు వరద ప్రమాదం ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వేసవిలో చేపట్టాల్సిన పనులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే తమకు ఇలాంటి పరిస్థితి దాపురించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత డ్రైనేజ్ అధికారులు సాగి వాగు అభివృద్ధితోపాటు, గండ్లనుపూడ్చి వరద ముంపునకు పంట పొలాలు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆదిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.



ఉధృతంగా ప్రవహిస్తున్న సాగివాగు

అధికారుల నిర్లక్ష్యం వల్లే పరిస్థితి ఇలా

సాగి వాగుకు పలుచోట్ల గండ్లు పడి వేల ఎకరాల్లో పంటలు ముంపుకు గురిఅయ్యే పరిస్థితి నెలకొన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్లే వాగు అభివృద్ధికి నోచుకోలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే వేల ఎకరాలు పంట పొలాలు ముంపుకు గురికావటంతోపాటు, ఆయా గ్రామాలకు కూడా వరద నీటి ముంపు వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలి.

కారుమంచి పాపారావు, స్థానికుడు

సహకారరంగ అభివృద్ధిలో సొసైటీలదే కీలక పాత్ర

మేదరమెట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): సహకార రంగం అభివృద్ధిలో సొసైటీలదే కీలక పాత్ర అని ప్రకాశం జిల్లా పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య అన్నారు. మంగళవారం రావినూతల వచ్చిన సీతారామయ్య ముందుగా సెంట్రల్ బ్యాంక్ శాఖను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం రాష్ట్రంలోనే గుర్తింపు కలిగిన రావినూతల సొసైటీని ఆయన పరిశీలించారు. సొసైటీ చైర్మన్ మోపర్తి వెంకట్రావు సొసైటీలో జరుగుతున్న ఎరువుల వ్యాపారం, రేషన్ దుకాణం, వస్త్ర దుకాణం గురించి వివరించడంతో పాటు సొసైటీ పూర్వ చరిత్రను వివరించారు. ఎన్‌టీ.రామారావు ముఖ్యమంత్రిగా రావినూతల నూతన సొసైటి భవనాన్ని ప్రారంభించడంతో పాటు కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించారని సీతారామయ్యకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆయనకు చూపించారు. రైతులకు అవసరమైన పంటరుణాలను మంజూరు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధికి సహకరించినట్లు అవుతుందన్నారు. సొసైటీలలో రైతులు ఎక్కువ డిపాజిట్‌లు చేయాలని, రావినూతల రైతులను జిల్లాలోని రైతులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ రావినూతల మేనేజర్ శ్రీనివాసరావు, సొసైటీ సీఈవో నవనీ, సొసైటి కమిటీ సభ్యులు చేబ్రోలు నాగేశ్వరరావు, నాదెండ్ల తిరుపతిరావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ సీతారామయ్య

మార్గదర్శకుల కోసం అన్వేషణ

(5వపేజీ తరువాయి)

కలెక్టర్ ఆ కుటుంబాలకు సాయపడే మార్గదర్శకులపై ఆయా శాఖల ద్వారా దృష్టి సారించారు. ఇప్పటి వరకు పెద్దగా ఆ తరహా మార్గదర్శకులు అందుబాటులో లేకపోవడంతో జిల్లాస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రధాన శాఖలకు చెందిన అధికారులు కూడా తమ పరిధిలోని కొన్ని కుటుంబాలను పీ4 విధానంలో దత్తత తీసుకొనేలా ఇప్పటికే వారికి మోటివేషన్ కార్యక్రమం చేపట్టారు. అందుకు అక్కడ కూడా కొందరు ముందుకు వస్తున్నారు. తాజాగా వివిధ శాఖల పర్యవేక్షణలో ఉండే వివిధ గ్రూపులకు చెందిన వారిపై దృష్టి సారించారు. ఈ క్రమంలో మంగళవారం పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణలో ఉండే రైస్‌మిల్లర్లు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, పెట్రోలు బంకుల యాజమానులు, హోటళ్ళు, రెస్టారెంట్ల యజమానులు, సినిమా థియేటర్లు, హోల్‌సెల్ వ్యాపారులు తదితర అసోసియేషన్లతో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. మిగిలిన తదితర గ్రూపుల వారితోనూ ఈ తరహా సమావేశాలు నిర్వహించనున్నారు. ఇప్పటికి కలెక్టర్ అన్సారియా అనాథ పిల్లలకు ఆసరాగా తాను స్వయంగా ఈ పథకం ద్వారా నిలవాలని నిర్ణయించుకోగా జేసీ గోపాలకృష్ణ మద్దిపాడు మండలం మల్లవరంలో పది కుటుంబాలను పీ4 విధానంలో దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. క్షేత్రస్థాయిలోని కొందరు ముందుకు వస్తుండటంతో ఈనెలాఖరులోపు ఆ ప్రక్రియ పూర్తిపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.

పంట ఉత్పత్తిని తగ్గించకపోతే ప్రమాదం

(5వపేజీ తరువాయి)

కొనుగోలు చేస్తున్న వ్యాపారులు గరిష్ఠ ధరలను మాత్రం పెంచడం లేదన్నారు. నోబిడ్‌లు అధికంగానే ఉంటున్నాయని కొందరు రైతులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా ఆయా వేలం కేంద్రాలలో చైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ గత రెండు, మూడేళ్ల ఇతర దేశాల్లో పంట ఉత్పత్తి అంతగా లేక ఇక్కడ మంచి ధరలు లభించాయన్నారు. ఈ ఏడాది కొన్ని దేశాలలో ఉత్పత్తి పెరగడంతో మన దగ్గర మార్కెట్ ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటున్నదని చెప్పారు. వ్యాపారులతో మాట్లాడి రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే ఏడాది మరింత గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మనకన్నా మెరుగ్గా ఉండే బ్రెజిల్, జింబాబ్వేతోపాటు మరికొన్ని ఇతర దేశాల్లోనూ పంట ఉత్పత్తి పెరుగుతున్నదన్నారు. దానివల్ల ఇక్కడ మార్కెట్ మరిన్ని ఒడిదొడుకులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు దానిని అర్థం చేసుకొని రానున్న సీజన్‌లో పంట ఉత్పత్తిని తగ్గించుకోవడంతోపాటు నాణ్యత పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒంగోలు-2లో జరిగిన కార్యక్రమంలో బోర్డు వైస్‌చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, రైతు కమిటీ అధ్యక్షుడు వడ్డెళ్ల ప్రసాద్, వేలం కేంద్రం అధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో తల్లిదండ్రుల అరెస్ట్

ఒంగోలు క్రైమ్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం మంగమూరు రోడ్‌లోని విలేకరుల కాలనీలో 1వ లైనులో జరిగిన యువతి హత్య కేసులో నిందితులను తాలూకా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ టి.వి జయ్‌కృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 16వ తేదీ రాత్రి పదిన్నర గంటల సమయంలో పల్నాటి అనూష అనే యువతి హత్యకు గురైందన్నారు. ఆ మేరకు దర్యాప్తు చేయగా, మృతురాలు అనూష(22) ఒక వివాహితుడిని ప్రేమించగా ఆ విషయం తెలిసి తల్లిదండ్రులు రమేష్, లక్ష్మిలు ఎన్నిసార్లు చెప్పినా ఆమె వినిపించుకోలేదు. ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో కుమార్తె తీరు వల్ల తమ పరువు పోతుందని భావించిన అనూషను తండ్రి గొంతు నులుముతుండగా, తల్లి కూతురు కాళ్లు పట్టుకుని చంపినట్లు తెలిపారు. దీంతో నిందితులను మంగళవారం వారి ఇంటి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సిబ్బందిని ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందించారు.

జర్మన్ భాషలో ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ, జీఎన్‌ఎం నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి జర్మన్ భాషలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.లక్ష్మానాయక్ మంగళవారం తెలిపారు. బీఎస్సీ, జీఎన్‌ఎం డిగ్రీ పూర్తి చేసిన వారికి జర్మన్ వంటి దేశాలలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉండటంతో జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి పంపించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మూడు ప్రదేశాల్లో ఈ శిక్షణ ఉంటుందని, ఒక్కో కేంద్రం ద్వారా 50 మందికి ఈ శిక్షణ ఇస్తామన్నారు. 25 మంది ఎస్సీ, 25 మంది ఎస్టీ అభ్యర్థులకు ఈ శిక్షణ 8నుంచి 10 నెలల పాటు ఉంటుందని వెల్లడించారు. వయస్సు 35 సంవత్సరాలు మించకుండా ఉన్న అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తిరుపతి, విశాఖపట్నం, గుంటూరులో ఈ శిక్షణ ఉంటుందని, దరఖాస్తులను స్కాన్ చేసి డీవైడీఐఆర్ సోషల్‌వెల్ఫేర్ ఎట్ జీమెయిల్ డాట్‌కామ్ మెయిల్‌కు పంపించాలని, హార్డు కాపీలను ఈ నెల 26వ తేదీలోగా ఒంగోలులోని ప్రగతి భవన్‌లోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని డీడీ సూచించారు.

మృతుని ఆచూకీ లభ్యం

మార్టూరు, జూలై22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొట్టిపాటి నగర్ సమీపంలో మృతిచెందిన వ్యక్తి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రంజన్ బెహ్రా(36)గా గుర్తించినట్లు ఎస్ఐ సైదా మంగళవారం తెలిపారు. ఆదివారం రాత్రి గొట్టిపాటి నగర్ సమీపంలో మద్యంమత్తులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. అయితే పోలీసులు విచారించగా, మృతుడు మండల పరిధిలోని జొన్నతాళి కూడలి సమీపంలోని అమరావతి నూలుమిల్లులో ఐదేళ్లుగా కార్మికునిగా పని చేస్తున్నారు. ఆయన భార్య మమతాబెహ్రా, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే ఆదివారం రాత్రి భార్యకు మందులు తీసుకురావడానికి మార్టూరు వచ్చిన మృతుడు మద్యం బాటిళ్లతో గొట్టిపాటి నగర్ వైపు వెళ్లినట్లు పోలీసుల విచారణలో తెలిసిందన్నారు. మృతునికి రెండేళ్లనుండి మూర్ఛ వ్యాధి ఉందని, ఈ కారణంగా మద్యం మత్తులో ఉన్న అతను మూర్ఛవ్యాధి తో మృతిచెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మంగళవారం వీఆర్‌వో కే.మోహనరావు ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. తదుపరి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించగా, వారు మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో ఒడిస్సాకు తీసుకువెళ్లినట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

దుస్తుల దుకాణం దగ్ధం

మేదరమెట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనపాలెం చెక్‌పోస్టు వద్ద నాగులుప్పలపాడు రోడ్డులోని టైలరింగ్, బట్టల దుకాణం విద్యుత్ షాట్ సర్క్యూట్ వలన మంటలు చెలరేగాయి. మంగళవారం వేకువజామున శ్రీ బాలాజీ టైలరింగ్ షాపులో విద్యుత్ షాట్ సర్క్యూట్ వలన దుకాణంలో ఉన్న బట్టలు, మిషన్‌లు ఇతర సామాగ్రి దగ్ధమైనట్లు దుకాణం యజమాని ఈమని మాధవి తెలిపారు. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిలినట్లు వాపోయారు. అద్దంకి నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

పంగులూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో గేదె మృతిచెందిన ఘటన మంగళవారం అలవలపాడు గ్రామంలో చోటుచేసుకొంది. విద్యుత్ ప్రసరించే తీగలు తగిలి అలవల అనంతారెడ్డికి చెందిన గేదె మృతిచెందింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని రైతు అనంతారెడ్డి తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన రక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలని గ్రామస్థులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు.

అవీఇవీ

పెరల్స్ డిస్టిలరీలో తనిఖీలు



మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు

సింగరాయకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని పెరల్స్ డిస్టిలరీలో మంగళవారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం తనిఖీ చేశారు. కంపెనీలో ఉత్పత్తి అవుతున్న మద్యం బాటిళ్లను, రికార్డులను, స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సింగరాయకొండ ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మద్యం కేసులో సీజ్ చేసిన హోండా స్కూటీకి బహిరంగ వేలం నిర్వహించారు. వేలంపాటలో దొనకొండ వెంకట నాగరాజు రూ.5,500 స్కూటీని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

తమవంతు బాధ్యతగా ముందుకు రావాలి

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మానవసేవే మాధవసేవగా గుర్తించి సహాయార్థులకు అండగా నిలిచేందుకు తమ వంతు బాధ్యతగా స్వచ్ఛందంగా ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. పీ4 బంగారు కుటుంబంలో భాగంగా ప్రభుత్వం గుర్తించిన బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. హోల్‌సెల్ డీలర్స్, రైస్ మిల్లర్స్, పెట్రోల్‌బంకు, హోటల్స్, రెస్టారెంట్లు, సినిమా థియేటర్స్, తూనికలు, కొలతలు డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రకాశం భవన్‌లో వేరువేరుగా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 పథకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతినిధులకు జేసీ వివరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 74వేలకుపైగా పేద కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి సహాయంచేసేందుకు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో డీఎస్‌వో పద్మశ్రీ, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ వరలక్ష్మీ పాల్గొన్నారు.

నిజాయితీతో విధులు నిర్వహించండి

పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా తయారవ్వాలి

శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ ఎస్ఐలకు రేంజ్ ఐజీ త్రిపాఠి సూచనలు



దిశానిర్దేశం చేస్తున్న ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధత.. నిజాయితీ... అంకితభావంసేవా తత్పరతతో విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. ఈ మేరకు మంగళవారం తనను మర్యాదపూర్వకంగా కలిసిన శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ ఎస్ఐలకు దిశా నిర్దేశం చేశారు. గుంటూరు రేంజి పరిధిలో మొత్తం 53 మంది ఎస్ఐలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో గుంటూరు జిల్లా నుంచి 23 మంది, పల్నాడు నుంచి 13, బాపట్ల నుంచి 10, ప్రకాశం నుంచి ఒకరు, నెల్లూరు, తిరుపతి నుంచి ముగ్గురు చొప్పున ఎంపికైన ఎస్ఐలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఐజి త్రిపాఠి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లలో నిర్వహించే విధానాలు, రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు కలిగి ఉన్నప్పుడే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో వారు అభ్యసించిన అంశాలపై ప్రశ్నలు అడిగి, వారి సేవా దృక్పథాన్ని గమనించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏఆర్ డిఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కాకమ్మ కథలు చెప్పొద్దు

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

పూరిమెట్ల, కెల్లంపల్లి, పెదఉల్లగల్లు గ్రామాల సందర్శన



పూరిమెట్లలో పర్యటిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన డీపీవో, ఆర్డీవో

ముండ్లమూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సమస్యకూ కాకమ్మ కథలు చెబుతూ తప్పించుకోవద్దని అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పూరిమెట్ల, కెల్లంపల్లి, పెదఉల్లగల్లు గ్రామాలను ఆమె సందర్శించారు. పూరిమెట్ల గ్రామంలో పలువురు పేదలను పీ-4 పథకం గురించి కలెక్టర్ ప్రశ్నించగా చెప్పలేకపోయారు. పంచాయతీ సెక్రటరీని అడగ్గా సరైన సమాధానం చెప్పలేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మరలా గ్రామసభ నిర్వహించి ప్రజలకు పీ 4 పథకంపై అర్థమయ్యే విధంగా వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఓ ఇంటికి వెళ్లి పలుకరించగా తమకు వారం రోజుల నుంచి చికున్‌గున్యా వ్యాధి వచ్చిందని, వైద్యులు పట్టించుకోలేదని తెలిపారు. ఆగ్రహం చెందిన కలెక్టర్ వైద్యాధికారులు, ఏఎన్ఎంలు ఎక్కడ ఉన్నారని అడగ్గా తాము మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంటామని తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించారా? అని ఏఎన్ఎం రమణను అడగ్గా తాను నిన్ననే విధుల్లో చేరానని తెలిపారు. ఎంపీడీవో శ్రీదేవిని అడగ్గా నేను కూడా కొత్తగా వచ్చానన్నారు. కథలు చెప్పి తప్పించు కోవద్దు, బాధ్యతగా ఉండాలని, పదేపదే మేము కొత్త మేము కొత్త అని చెప్పటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకురాగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్ బాబును ప్రశ్నించగా, దర్శి నుంచి ఎన్ఏపీ నీరు సరఫరా అవుతోందని తెలిపారు. పైపులు పగిలిపోతుండటంతో తాగునీటి సమస్య ఏర్పడుతుందని ఏఈ వివరించారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కెల్లంపల్లి గ్రామంలో ప్రధాన వీధులను కలెక్టర్ సందర్శించి పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పూరిమెట్లలో బెల్టు షాపులతో కాపురాలు చితికి పోతున్నాయని గ్రామానికి చెందిన ముల్లా విజయమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

పేదరికంలేని సమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేయం

పేదరికం లేని సమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. మండలంలోని పూరిమెట్ల, కెల్లంపల్లి, పెదఉల్లగల్లు గ్రామాలను సందర్శించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో భాగంగా పారిశుధ్యం సరిగా లేదని ఫిర్యాదులు రావటంతో పూరిమెట్ల, కెల్లంపల్లి గ్రామాలను సందర్శించామని, పారిశుధ్యం అధ్వానంగా ఉన్న మాట వాస్తవమేనని చెప్పారు. ఇటీవల పీ-4 పథకంపై గ్రామసభలు పెట్టి గ్రామాల్లో పేదలను గుర్తించినట్టు చెప్పారు. కేవలం గ్రామాల్లో ఉండే స్థితిమంతులే కాకుండా ఉద్యోగాలు చేస్తున్నవారు, వివిధ రంగాల్లో స్థిరపడినవారు ముందుకు రావాలని కోరారు.

ముగ్గురు పీఎస్ హెచ్‌ఎంల ప్రమోషన్లు రద్దు

ఎస్‌జీటీ ఉర్దూ టీచర్లుగా రివర్షన్

ఉత్తర్వులు జారీచేసిన డీఈవో



ఒంగోలు విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల, మార్కాపురం మునిసిపాలిటీల్లో ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా(పీఎస్ హెచ్‌ఎం) ఉద్యోగోన్నతి పొందిన ముగ్గురు ప్రమోషన్లు రద్దయ్యాయి. వీరిని తిరిగి సెకండరీ గ్రేడ్ ఉర్దూ ఉపాధ్యాయులుగా రివర్ట్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి ఇచ్చారు. వారు కొత్త పాఠశాలల్లో చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. సయ్యద్‌ఆయేషా, షేక్ షాహిద్, దూదేకుల అబ్దుల్ రహీమ్‌లు ఉర్దూ ఎస్‌జీటీలుగా పనిచేస్తూ పీఎస్ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందారు. దీనిపై సెకండరీ గ్రేడ్(తెలుగు) టీచర్లు జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీకి ఫిర్యాదు చేశారు. డీఎస్సీలో తమ కంటే తక్కువ మార్కులు వచ్చిన వారిని తమ కంటే ముందు ఉద్యోగోన్నతి ఎలా ఇస్తారని ఫిర్యాదు చేశారు. ఒకే డీఎస్సీలో ఎస్‌జీటీలుగా ఎంపికైన తమకు పీఎస్ హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల్లో అన్యాయం జరిగిందని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఈ ఫిర్యాదుపై జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ విచారణ జరిపింది. ఉద్యోగోన్నతి పొందిన ముగ్గురిని ఎస్‌జీటీ ఉర్దూ టీచర్లుగా రివర్షన్ చేశారు.

డీఎస్సీలో ఉర్దూ పోస్టుల్లో అభ్యర్థులు తక్కువ. అదే ఎస్‌జీటీ తెలుగు పోస్టులు ఎక్కువ. ఉర్దూ టీచర్లకు డీఎస్సీలో తక్కువ మార్కులు వచ్చినా వారి కంటే ర్యాంకుల్లో ముందున్నారు. నిబంధనల ప్రకారం అధిక మార్కులు వచ్చిన తమకే మొదటి ప్రమోషన్ రావాలని ఎస్‌జీటీ తెలుగు ఉపాధ్యాయులు వాదించారు. డీఈవో కార్యాలయం ఈ విషయాన్ని పాఠశాల విద్యా డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అధిక మార్కులు వచ్చిన వారికే మొదటి ఉద్యోగోన్నతి ఇవ్వాలని డైరెక్టర్ స్పష్టంచేశారు. ఆ మేరకు ఉర్దూ టీచర్ల ప్రమోషన్లను రద్దు చేసి వారిని రివర్షన్ చేసి ఖాళీగా ఉన్న స్థానాల్లో వారిని నియమించారు. ఆ మూడు పోస్టులను ఎస్‌జీటీ తెలుగు టీచర్లతో భర్తీ చేయనున్నారు.

నెహ్రూనగర్ వాసులకు తీరనున్న నీటి కష్టాలు

ఆంధ్రజ్యోతి వార్తపై స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం కందులాపురం పరిధిలోని నెహ్రూనగర్ 5 నుంచి 9 వీధుల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు అవసరమైన నిధులు మంజూరుచేస్తానని, ఆ ప్రాంతవాసులకు రెండు రోజుల్లో తాగునీటి సమస్యను తీర్చాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలియచేసినట్లు కందులాపురం పంచాయతీ కార్యదర్శి జోష్యులు తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో తాగునీరు ఇవ్వకపోతే ఎమ్మెల్యే దగ్గర తేల్చుకుంటామన్న వార్తకు స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, గతంలో నెహ్రూనగర్ వాసులకు అర్బన్ కాలనీ సమీపంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బోరు నుంచి నీరు సరఫరా చేసేవారమని, ఆ పైపులైన్లు పగిలిపోవడం, రైల్వే అధికారుల అనుమతి తీసుకోవాలని తెలుపడంతోపాటు రైల్వే అధికారులతో సంప్రదిస్తే వారు మా స్థలం పక్క నుంచి పైపులైన్ ఏర్పాటు చేసుకోవచ్చని అనుమతిచ్చారని, పైపులైన్‌కు రూ.5లక్షలకు పైగా ఖర్చు అవుతుందని, రూ.3లక్షలు ఎంపీపీ తన ఫండ్స్ నుంచి ఇస్తానని హామీ ఇచ్చారని, మిగిలిన రూ.2లక్షలు పంచాయతీ దగ్గర లేవని కార్యదర్శి ఎమ్మెల్యేకు తెలపగా స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మిగిలిన సొమ్ము తాను అందచేస్తానని, తక్షణమే యుద్ధప్రాతిపదికన పైపులైన్ వేసి తాగునీటి సమస్య తీర్చాలని ఆదేశించినట్లు తెలిపారు. బుధవారం పనులు మొదలు పెట్టి నీరు అందజేస్తామని కార్యదర్శి తెలిపారు.

ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేస్తే ఉద్యమం

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న దామోదర్‌రావు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేయాలని చూస్తే ఉద్యమం తప్పదని ఏపీ పీటీడీ(ఆర్టీసి ఎంప్లాయీస్)యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు చెప్పారు. ఒంగోలులోని ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విజయవాడ నగరంలోని గవర్నర్‌పేట 2 డిపో, పాత బస్టాండ్ స్థలాన్ని షాపింగ్ మాల్‌కు ఇవ్వాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. విద్యుత్ బస్సుల వినియోగం పేరుతో రెండు దశల్లో 19 డిపోలను ప్రైవేటు ఆపరేటర్లకు గుంప గుత్తగా అప్పజెప్పే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలు చెల్లించాలని, పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించడంతోపాటు ఐఆర్ ప్రకటించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి జీవీ నరసయ్య, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, జోనల్ జాయింట్ సెక్రటరీ బెజవాడ రవి పాల్గొన్నారు. అనంతరం జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరం, జీవీ నరసయ్యలు మాట్లాడుతూ గత పాలకుల తరహాలోనే ప్రస్తుత ప్రభుత్వం ఆర్టీసీ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణకు, ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యక్షుడుగా పిడుగు వెంకటేశ్వరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్. జనార్దన్, జిల్లా కార్యదర్శి శ్రీరామ పోలయ్య, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జీవి. రత్నం, కోశాధికారిగా జి.ఓబులయ్యతోపాటు, చీఫ్ అడ్వయిజర్‌గా ఎన్. తిరుమలేసు, ప్రచార కార్యదర్శిగా కే.రామకృష్ణ, ఉపాధ్యక్షురాలుగా ఓవి.రమణమ్మ, మరో పదిహేను మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సబ్జెక్టుల్లో మార్కులు తగ్గుతుండడంపై ఆగ్రహం

ఉపాధ్యాయులను ప్రశ్నించిన డీఈవో కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

కొమరోలు, జులై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి సబ్జెక్టుల్లో మార్కులు ఎందుకు తగ్గుతున్నాయంటూ ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్‌బీఎన్‌ఆర్ఎం ఎయిడెడ్, ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన టీచర్లు ఉండి కూడా పరీక్షల్లో మార్కులు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రమాణాలను గుర్తించారు. మండలంలోని ఎస్‌బీఎన్‌ఆర్ఎం, ఏబీఎం పాఠశాలల రికార్డులను పరిశీలించారు. ఏబీఎం రికార్డుల్లో విద్యార్థుల సంఖ్య పదుల్లో ఉండగా నలుగురు మాత్రమే వచ్చారని హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీ నేతలతో పీటీఎం మీటింగ్ ఫిర్యాదుపై విచారణ

కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించిన అనంతరం మళ్లీ వైసీపీ ప్రజాప్రతినిధులతో నిర్వహించడంపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో దానిపై గోప్యంగా విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు, ఎంఈవోలతో లిఖితపూర్వక లేఖలను తీసుకున్నారు. ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తారని సమాచారం. డీఈవో వెంట ఎంఈవోలు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం ఉన్నారు.

జేపీచెరువులో డెంగ్యూ?

రాచర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు గ్రామంలో పదేళ్ల బాలికకు డెంగ్యూ వ్యాధి సోకింది. గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన బాలిక జ్వరానికి గురికావడంతో కుటుంబ సభ్యులు బాలికను గిద్దలూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించగా డెంగ్యూగా వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం బాలిక చికిత్స పొందుతోందని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. మరో బాలుడికి కూడా డెంగ్యూ లక్షణాలు కనిపించినట్లు చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. వైద్య సిబ్బంది వివిధ రకాల సర్వేలు నిర్వహిస్తూ వ్యాధులు నివారణకు ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికీ డెంగ్యూ తదితర వ్యాధులు వస్తున్నాయి. వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాలని పారిశుధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

డీఈఈసెట్ కౌన్సెలింగ్‌కు మరో రెండు రోజులు గడువు

సంతనూతలపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో జరుగుతున్న డీఈఈసెట్-2025 కౌన్సెలింగ్ గడువు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 24వ తేదీ వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి జరుగుతున్న డీఈఈసెట్ కౌన్సెలింగ్ 22వతేదీతో ముగియడంతో మరో రెండు రోజులు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లా డైట్ కళాశాలతో పాటు, రెండు డీఈడీ ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం 210 సీట్లకు గాను 100 సీట్లు కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు కేటాయించినట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ ధృవీకరణ పత్రాలను మైనంపాడు డైట్ కళాశాల వద్దకు తీసుకువచ్చి పరిశీలన చేయించుకుని సీటు పొందాలని కోరారు

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

కొండపి, జూలై22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ జిల్లా కమిటీ మెంబర్‌గా కొండపికి చెందిన యనమద్ని వెంకటేశ్వర్లును జిల్లా అధికారులు నియమించారు. ఆ మేరకు సమాచారం ఆయనకు మంగళవారం అందింది. వెంకటేశ్వర్లు 2014-19 మధ్య కాలంలో కూడా మానటరింగ్ కమిటీ మెంబర్‌గా పనిచేశారు. తనను మెంబర్‌గా నియమించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు కృతజ్ఞతలు తెలిపారు.

టమాటా, ఉల్లిపాయలను దిగుమతి చేసుకోవాలి

జేసీ గోపాలకృష్ణ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని మార్కెట్ల నుంచి ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించి దిగుమతి చేసుకొని తక్కువ ధరలకు రైతు బజార్లలో టమోటా, ఉల్లి విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో మంగళవారం సాయంత్రం వ్యవసాయ, ఉద్యాన, పౌరసరఫరాల, మార్కెటింగ్ శాఖ అధికారులతో పాటు రైతులు, కూరగాయల వ్యాపారులు, రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడారు. ప్రస్తుతం టమాటా, ఉల్లిధరలు అందుబాటులో ఉన్నాయని జేసీ దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై జేసీ మాట్లాడుతూ రైతులు వారి కూరగాయలను రైతు బజార్లలో ప్రత్యక్షంగా విక్రయించే విధంగా ప్రోత్సహించాలన్నారు. రైతు బజార్లలో విక్రయించడం ద్వారా మంచిధరకు అమ్ముకొనేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయాలు పండించే రైతులను ప్రోత్సహిస్తూ ప్రతి రైతు బజారులో స్టాల్స్‌ను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.

ఒంగోలులో ఫ్లెక్సీల రగడ!

'హరిహర వీరమల్లు' చిత్రం విడుదల సందర్భంగా ఏర్పాటు

చర్చి సెంటర్‌లో తొలగించిన కార్పొరేషన్ అధికారులు

ఆగ్రహం వ్యక్తంచేసిన జనసేన కార్పొరేటర్లు



ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

ఒంగోలు కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో మరోసారి ఫ్లెక్సీల రగడ చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదల సందర్భంగా మాజీ మంత్రి, జనసేన నాయకుడు బాలినేని శ్రీనివాసులరెడ్డి అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఒంగోలు కార్పొరేషన్ అధికారులు మంగళవారం తొలగించారు. దీనిపై జనసేన కార్పొరేటర్లు, బాలినేని అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్‌తో వాగ్వావాదానికి దిగారు. ఒక ఫ్లెక్సీని తిరిగి తీసుకెళ్లి చర్చిసెంటర్‌లో ఏర్పాటు చేశారు.

ప్రధాన సెంటర్‌లలో భారీగా ఏర్పాటు

బాలినేని అభిమానుల ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రధాన సెంటర్లలో పవన్ కల్యాణ్, బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి ఫొటోలతో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటిలో స్థానిక జేఎంబీ చర్చి సెంటర్ వద్ద ఉన్న మూడింటిని కార్పొరేషన్ అధికారులు తొలగించారు. విషయం తెలుసుకున్న జనసేన కార్పొరేటర్లు కమిషనర్ వెంకటేశ్వరరావును కలిసి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా తొలగించలేదని, ఆ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందిగా ఉన్నందున తీసివేశామని ఆయన వారికి వివరించారు. అప్పటికే ఆవేశంతో ఉన్న పలువురు జనసేన కార్పొరేటర్లు కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. తిరిగి ఏర్పాటు చేస్తామని ఆయన బదులిచ్చినా వినిపించుకోకుండా కార్యాలయంలో ఉన్న ఒక ఫ్లెక్సీని తామే స్వయంగా మోసుకెళ్లి తిరిగి చర్చి సెంటర్‌లో ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. అనంతరం జనసేన కార్పొరేటర్‌లు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఫ్లెక్సీలను అధికారులు తొలగించి ప్రొటోకాల్‌ను విస్మరించారని ఆరోపించారు. ఇది ఉద్దేశపూర్వకమేనని మండిపడ్డారు. ఇలా చేయడం తమ మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. మీడియా సమావేశంలో ఒంగోలు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, జనసేన కార్పొరేటర్లు మలగా రమేష్, యనమల నాగరాజు, ఈదర వెంకట సురేష్‌బాబు, జడ వెంకటేష్ పాల్గొన్నారు.



ఫ్లెక్సీని మోసుకెళ్తున్న జనసేన నేతలు

ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీల ఏర్పాటు నిషేధం

నగరంలో ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని, డీటీసీపీ నిబంధనల ప్రకారం కార్పొరేషన్ అనుమతితో కేటాయించిన ప్రాంతాల్లోనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలని నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీ సెంటర్లు, కమర్షియల్ షాపుల యజమానులు, ఇతర వ్యాపారస్తులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు గుర్తించాలని కోరారు. ప్రధాన జంక్షన్‌లు, సెంటర్ డివైడర్లు, విగ్రహాల కూడలిలో ఫ్లెక్సీలు నిషేధం అని చెప్పారు.

బడిబాటలను బాగు చేయరూ?





పెద్దారవీడులో విద్యార్థులు బడికి పోవాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వర్షపు నీరు నిల్వ ఉండి విద్యార్థులు బడికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పడమటిపల్లి నుంచి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. అదే విధంగా కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు వర్షం పడిన రోజులో ఉపాధ్యాయులు వెళ్లాలన్నా అదే పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని, నూతనంగా సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. - ఆంధ్రజ్యోతి, పెద్దారవీడు

శివారు కాలనీలకు నీటి సరఫరాలో ఆలస్యం!

మారిన ట్యాంకర్ల వాటర్ ఫిల్లింగ్ పాయింట్

ఒక ట్రిప్ కోసం గంటల తరబడి ఎదురుచూపులు

ఒంగోలు నగరంలోని పలు శివారు కాలనీలకు ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరాలో ఆలస్యం జరుగుతోంది. మునిసిపాలిటీగా ఏర్పాటైనప్పటి నుంచి నగరంలోని రంగారాయుడు చెరువు సమీపంలోని ఫిల్టర్‌బెడ్ వద్ద ట్యాంకర్లు మోటార్లు ద్వారా నీటిని నింపుకుని కాలనీలకు సరఫరా చేస్తున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పాయింట్‌ని నిలిపివేశారు. సోమవారం నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు-2 వద్ద నూతనంగా నీరు నింపుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ఊరికి చివర కావడంతో కాలనీలకు ఆలస్యంగా నీటి రవాణా జరుగుతోంది. కాగా పాత పాయింట్‌లో రెండు మోటార్లతో ప్రతిరోజు 38 ట్యాంకర్లు ద్వారా 200లకు పైగా ట్రిప్పులు కాలనీలకు నీరు సరఫరా చేస్తుండేవి. ప్రస్తుతం ఒక మోటారు కావడంతో రోజులో కనీసం 100 ట్రిప్పులు కూడా రవాణా చేసే అవకాశం కనిపించడం లేదు. కార్పొరేషన్ అధికారులు ఇప్పుడున్న దానితోపాటు మరో మోటారు ఏర్పాటు చేస్తే సమయం కలిసి వస్తుందని కాంట్రాక్టర్లు, డ్రైవర్లు చెబుతున్నారు. లేని పక్షంలో ఎస్ఎస్-1 వద్ద ఒక పాయింట్, ఎస్ఎస్-2 వద్ద మరో పాయింట్ ఏర్పాటుతో ఇబ్బందులు తొలగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)



వెంగముక్కలపాలెం వెళ్లే రోడ్డులోకి మార్చిన పాయింట్‌వద్ద ఆగివున్న ట్యాంకర్లు

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు

చీమకుర్తి, జూలై22(ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చీమకుర్తి పట్టణానికి చెందిన గుండా శ్రీనివాసరావు నియమితులయ్యారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పాటుపడుతున్న తనను గుర్తించి పదవికి ఎంపిక చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసరావు, జిల్లా నాయకులకు శ్రీనివాసరావు మంగళవారం ధన్యవాదాలు తెలిపారు.



గుండా శ్రీనివాసరావు

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

● ఎస్ఐ శివరామయ్య హెచ్చరిక

మద్దిపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పదని ఎస్ఐ శివరామయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని సీతారాంపురం కొష్టాలు సెంటర్, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి, రాచవారిపాలెం జంక్షన్, గ్రోత్ సెంటర్ దగ్గర వ్యతిరేక దిశలో వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని చెప్పారు. మంగళవారం మద్దిపాడు ప్రధాన కూడలి దగ్గర వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, హెల్మెట్, సీట్‌బెల్టు ధరించటం తప్పనిసరన్నారు. వారం రోజుల కిందట మద్దిపాడుకు చెందిన పెద్దపల్లి పోతురాజు మద్యం తాగి కారు నడుపుతుండగా కేసు నమోదు చేసి మంగళవారం ఒంగోలు మొబైల్ కోర్టులో హాజరుపరచగా రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు.

మండల అభివృద్ధికి సమష్టి కృషి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ అరుణ

మద్దిపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందేలా కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండల పరిషత్, పంచాయతీల నిధులు ఉపయోగించుకుని గ్రామాల్లో ముఖ్యమైన పనులు చేయాలన్నారు. సీసీరోడ్ల నిర్మాణానికి గ్రాంట్లు తెప్పిస్తానని చెప్పారు. దళితవాడల్లో అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎంపీపీ అరుణ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి మండల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. గుండ్లాపల్లి ఎంపీటీసీ పద్మావతి మాట్లాడుతూ ఎంపీటీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఏవో వరప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు

ఒంగోలు కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక ఆసుపత్రిలో వారు నోటు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ కొత్తపట్నం, ఒంగోలు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదవిద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు 2024-25 సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయుల ఫొటోలను పుస్తకాలపై ముద్రించినట్లు చెప్పారు.



నోటుపుస్తకాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు వంశీకృష్ణ, శాంతకుమారి

పంటలకు బీమా చేసుకోవాలి : డీఏవో

మద్దిపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు ఫసల్ బీమా చేసుకోవాలని డీఏవో శ్రీనివాసరావు కోరారు. మంగళవారం అన్నంగిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవో జి.స్వర్ణలత, ఉద్యానశాఖ అధికారి సంధ్య మాట్లాడుతూ రైతులు ఉద్యానపంటలను సాగు చేసుకోవాలని, ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు సబ్సిడీలకు అర్హులన్నారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వీఏఏలు గొల్లపాటి మనోహర్, ఎం.రాజు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

నాగులుప్పలపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కనపర్తి గ్రామంలోని రెండు సచివాలయాలలో డిటిటల్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న శరత్‌బాబు, రాజశేఖర్, ఏఎన్ఎంలు స్వర్ణకుమారి, యలమందమ్మలను మంగళవారం గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏడుగుండ్ల వెంకటేశ్వరరరావు, కోమట్ల త్రినాథరెడ్డి, కార్యదర్శి దేవదానం కన్నా వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, కొండల్‌రెడ్డి, మార్కాండేయులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలి : ఎస్ఐ

సింగరాయకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు... పిల్లల ప్రవర్తన, నడవడికను నిత్యం గమనిస్తూ ఉండాలని ఎస్ఐ బి.మహేంద్ర సూచించారు. సింగరాయకొండలోని గీతం హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నిక్షిప్తమైన ప్రతిభను గుర్తించి ఉన్నత లక్ష్యాలను సాధించేలా కృషిచేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ మహేంద్ర

కొండపి: పెట్లూరులోని సహజానంద స్కూల్‌లోని విద్యార్థులకు కొండపి ఎస్ఐ ప్రేమ్‌కుమార్ మంగళవారం గుడ్ అండ్ టచ్‌పై అవగాహన కలిగించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని ఆయన సూచించారు.

జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట కేజీబీవీ స్కూల్ విద్యార్థులకు ఎస్సై మహేంద్ర గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగించారు. సెల్‌ఫోన్‌ను ఎంత వరకు వాడుకోవాలో విద్యార్థులు తెలుసుకోవాలన్నారు.

నాగులుప్పలపాడు: అమ్మనబ్రోలులోని ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థినులకు సైబర్ నేరాలు, గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, చట్టాలపై ఎస్ఐ రజియా సుల్తానా మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

● చినరావిపాడులో ఉత్సాహంగా తొలిఅడుగు

చీమకుర్తి, జూలై22(ఆంధ్రజ్యోతి): ఏడాదికా కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాలు అభివృద్ధిబాటలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం మండలంలోని చినరావిపాడు గ్రామంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ఏడాదిపాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రజలనుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, కూనంనేని లోకేష్, గాలి వెంకటసుబ్బయ్య, గాలి వెంకటసుబ్రహ్మణ్యం, ఇస్తర్ల ఏడుకొండలు, దాసరి సుబ్బారావు, రాజశేఖరరెడ్డి, నగేష్, బొడ్డు రామారావు, కడియాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మద్దిపాడు : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు పేర్కొన్నారు. మంగళవారం దొడ్డవరంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా పనిచేస్తుందని, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ నేతృత్వంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వడ్డెంపూడి శ్రీనివాసరావు, సురేష్, చంద్రశేఖర్, వెంకట్రావు, సుమన్, సాయికుమార్, మద్దులూరు వెంకట్రావు, అంకమ్మరావు పాల్గొన్నారు.

బోర్డు అనుమతించిన మేరకే పొగాకు సాగు చేయాలి

చైర్మన్ యశ్వంత్‌కుమార్ పిలుపు ● అధికంగా పండిస్తే భారీగా అపరాధ రుసుం విధిస్తామని స్పష్టీకరణ

ఒంగోలు(రూరల్), జూలై22(ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు అనుమతి మేరకు మాత్రమే రైతులు సాగు చేయాలని చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ స్పష్టం చేశారు. అలా కాకుండా రైతులు విచ్చలవిడిగా పొగాకు సాగు చేస్తే భారీగా అపరాధ రుసుం విధిస్తామన్నారు. మంగళవారం ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో వేలం ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి బ్యారన్‌కు 42 క్వింటాల చొప్పున పొగాకు కొనుగోలు జరుగుతుందన్నారు. వచ్చే సంవత్సరం ప్రతి బ్యారన్‌కు పొగాకు బోర్డు 35 క్వింటాలకు మాత్రమే అనుమతి ఇస్తుందని, అందువల్ల రైతులు అధికంగా సాగు చేసి నష్టపోవద్దని చెప్పారు. బోర్డు కూడా ఇకపై కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని వెల్లడించారు. ముఖ్యంగా కౌలు రైతులు అధిక కౌలుకు భూములు, బ్యారన్‌లను తీసుకోవద్దని, పంట ఉత్పత్తి ఖర్చులు భారీగా తగ్గించుకోవాలని సూచించారు. ఈక్రమంలో పలువురు రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది అదనపు పంటకు అపరాధం రుసుం లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర వాణిజ్యశాఖ అధికారుల, మంత్రులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జెతులసి, బోర్డు వైస్ చైర్మన్ బొడపాటి బ్రహ్మయ్య, రైతు నాయకులు వడ్డెళ్ల ప్రసాద్, దేవబత్తిన వెంకన్న, బండారు రామాంజనేయులు, వెంకారెడ్డి పాల్గొన్నారు.



ఒంగోలులో రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొగాకు రైతులు ఉత్పత్తి తగ్గించాలి

మద్దిపాడు: రైతులు రాబోయే సంవత్సరం పొగాకు ఉత్పత్తి తగ్గించాలని చైర్మన్ యశ్వంత్‌కుమార్ కోరారు. మంగళవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రత్యామ్నాయ పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోవి రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాలుచౌదరి, మండవ గోవిందరాజులు, బోయపాటి వెంకయ్యచౌదరి, మండవ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో యూనివర్సిటీ ఫస్ట్ 'శ్రీహర్షిణి'

విద్యార్థులను అభినందించిన చైర్మన్ రవికుమార్



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్ల ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. బీసీఏ విభాగంలో కె.మేఘన 9.46 గ్రేడ్‌పాయింట్లతో మొదటిస్థానం, కె.సాత్విక 9.40 పాయింట్లతో ద్వితీయ, కె.రత్నకృప 8.97 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు. అలాగే బీఎస్సీ కంప్యూటర్స్ విభాగంలో జి.దీపిక 9.51, ఎస్‌కే.రేష్మ 9.33, వై.హరిప్రియ 9.24, బీకాం కంప్యూటర్స్‌లో ఎ.కార్తీక్, ఎస్‌కే.అబ్దుల్‌రహీం 8.53, ఎన్.విష్ణుప్రియ 9.50, జి.ఉమా 8.40, బీఎస్సీ ఆక్వా కల్చర్ విభాగంలో పి.నవీన్‌కుమార్ 9.11, డి.స్రవంతి 8.90, ఎం.జోష్న, భాగ్యరాజ్ 8.44, బీఎస్సీ కెమిస్ట్రీలో ఇ.కుమారి8.56, బి.మహాలక్ష్మి 8.43, యశ్వంత్‌రెడ్డి 8.39 గ్రేడ్ పాయింట్లు సాధించారు. బీబీఏ విభాగంలో వి.జాహ్నవి 8.21, లహరి 8.03, అఖిలేశ్వరి 7.97, బీఎస్సీ జువాలజీలో ఎస్‌కే.జిరిష్మాబేగం 8.98, నికితరయ్య8.80, సాయిలక్ష్మి 8.70, బీఎస్సీ మ్యాథమేటిక్స్‌లో జి.గోవిందమ్మ 8.39, ప్రవీణ్‌కుమార్ 8.28, పార్వతి 8.03, బీఎస్సీ బోటనిలో జహ్నవి 8.21, భానుశామ్యూల్ 8.02, అఖిలేశ్వరి 7.79 పాయింట్లు సాధించారు. బీఏ విభాగంలో కె.తేజశ్రీ 9.11, సమీరాపటేల్ 8.99, వెంకటలక్ష్మి 8.79 గ్రేడ్‌పాయింట్లు పొందారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో మంగళవారం చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా క్యాంపస్ ఇంటర్వ్యూలను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు కావాల్సిన స్కిల్స్‌ను ఉచితంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ దాది అంజనేయులు, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇన్‌చార్జి దిరీష్, ప్రతాప, శంకర్, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

దాతల సహకారంతో నగర సర్కిల్స్ అభివృద్ధి

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అభివృద్ధి పట్ల ఆకర్షితులైన పలువురు దాతలు నగర సుందరీకరణకు తమవంతు సహకారం అందిస్తామని ముందుకొస్తున్నారని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో కార్పొరేషన్ నిధులు, దాతల సహకారంతో నగరంలోని ప్రధాన సర్కిల్ అభివృద్ధికి శ్రీకారం పలికినట్లు ఆయన చెప్పారు. మంగళవారం స్థానిక మంగమ్మ కాలేజీ సర్కిల్ సుందరీకరణ, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అభివృద్ధికి ప్రముఖ వ్యాపారవేత్త శిద్దా హనుమంతరావు తన సొంత నిధులు రూ.20 లక్షల నుంచి రూ.25లక్షలు ఖర్చు చేయడానికి ముందుకు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే ఇతర ప్రధాన ప్రాంతాల్లో కూడా దాతల సహకారంతో, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలో మరింతగా సుందరీకరణ చేస్తామన్నారు. దాతలు నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. శిద్దా హనుమంతరావుకు కార్పొరేషన్ తరుపున అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.



మంగమ్మకాలేజీ వద్ద పనులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

శ్రమజీవుల పక్షపాతి అచ్యుతానందన్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రమజీవుల పక్షపాతిగా నిలిచిన కేరళ మాజీముఖ్యమంత్రి వీఎస్.అచ్యుతానందన్ జీవితం ఆదర్శనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం అచ్యుతానందన్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అచ్యుతానందన్ ఐదేళ్ళ పాటు కేరళ ముఖ్యమంత్రిగా, ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఏడుసార్లు ఎన్నికయ్యారన్నారు. సీపీఎంను స్థాపించిన 32మంది కీలక నేతల్లో అచ్యుతానందన్ ఒకరని పేర్కొన్నారు. కార్యక్రమంలో వై.సిద్ధయ్య, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, పూనాటి ఆంజనేయులు, ఎం.రమేష్, జె.జయంతిబాబు, కాలం సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, బి.రఘురాం, జి.రమేష్, కంకణాల రమాదేవి, బాలకోటయ్య, పెంట్యాల హనుమంతరావు, రాంబాబు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న నాయకులు

సంతనూతలపాడు: కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు మంగళవారం సంతనూతలపాడులో సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కోదాటి కోటేశ్వరరావు, బంకా సుబ్బారావు, పెద్దబ్బాయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నాగులుప్పలపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులోని పేకాట శిబిరంపై ఎస్ఐ రజియాసుల్తానా మంగళవారం రాత్రి దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకొని రూ.48,570 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె పోలీసు సిబ్బంది ఉన్నారు.

వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా వినోద్‌కుమార్

మద్దిపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా దుడ్డు వినోద్‌కుమార్ నియమితులయ్యారు. మంగళవారం మద్దిపాడులో నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జునను ఆయన మర్యాదపూర్వకంగా కలవగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, కోటిరెడ్డి, జి.రవి, నారా సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, రవణమ్మ పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీకి పరామర్శ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంగళూరులో స్వల్ప శస్త్ర చికిత్స చేయించుకుని ఒంగోలుకు వచ్చిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావును ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ పరామర్శించారు. స్థానిక మంగమూరురోడ్డులోని జర్నలిస్టుకాలనీలో మంగళవారం ఉదయం ఐవీని కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఐవీ.సుబ్బారావును పరామర్శిస్తున్న చైర్మన్ సురేష్

ఏకేయూకు నిధులను కేటాయించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ డిమాండ్ చేశారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీని అభివృద్ధి చేస్తామని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మంగళవారం యూనివర్శిటీ ప్రాంగణంలో లేఖ విడుదల చేశారు. విద్యాలయంలో జరుగుతున్న అక్రమాలను ప్రక్షాళన చేయడంతో పాటు రెగ్యులర్ వీసీ, పర్మినెంట్ రిజిస్ట్రార్‌ను నియమించాలన్నారు. విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలతో పాటు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజీవ్, రాము, ఈస్టర్, బాబు, సురేష్ పాల్గొన్నారు.

చెరువు ఖాళీ విషయంతో సంబంధం లేదు

● మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు

సంతనూతలపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు పెద్ద చెరువు నీటిని అనధికారకంగా బయటకు వదిలిన విషయం తమకు సంబంధం లేదని మత్యశాఖ జేడీ సీహెచ్.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన చేపల కోసం చెరువు ఖాళీ అనేపై ఆయన స్పందించారు. సంతనూతలపాడు పెద్ద చెరువులో నీటిని అనధికారకంగా విడుదల చేసే విషయంపై విచారించినట్లు తెలిపారు. 1434 ఫసలీ లీజు కాలం 2025 జూన్ 30తో ముగిసిందని, లీజుదారుడైన ఇన్లాండ్ సహకార సంఘం వారు ఎటువంటి చేపలు పట్టలేదన్నారు. గత కొన్ని రోజులుగా సహకార సంఘం ప్రెసిడెంట్ కుటుంబసభ్యులకు అనారోగ్యంగా ఉన్నందున అతను అందుబాటులో లేరన్నారు. సహకారసంఘం వద్ద చెరువు షట్టర్‌కు సంబంధించి లాకులు లేవని పేర్కొన్నారు. ఇదే విషయం ఇరిగేషన్ అధికారులకు తెలిపామన్నారు. కానీ చెరువు తూములను ఎత్తి నీటిని అనధికారకంగా బయటకు వదులుతూ చేపలు పడుతున్నది మత్యకారసంఘం కాదని తెలిపారు. చెరువులో నీటిని నింపే విషయం, బయటకు వదిలే విషయం పూర్తిగా నీటిపారుదలశాఖ వారిదేనని ఆయన స్పష్టం చేశారు.

క్విస్‌లో రక్తకణాల నమూనాల సేకరణ శిబిరం

ఒంగోలు విద్య, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రక్తకణాల నమూనాల సేకరణ శిబిరాన్ని నిర్వహించారు. ధాత్రి స్వచ్ఛంద సంస్థ, క్విస్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 1100 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తకణాల నమూనాలను ఇచ్చారు. ధాత్రి బ్లడ్ మిసల్ డొనర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా ఈ నమూనాలను సేకరించి వీరు భద్రపరుస్తారు. క్యాన్సర్ పేషంట్లకు అవసరమైనప్పుడు గ్రూపు మ్యాచ్ అయిన వారి నుంచి రక్తకణాలు అందజేస్తారు. ఈ సందర్భంగా రక్తనమూనాను ఇచ్చిన విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్ గాయత్రి, ధాత్రి సభ్యులు లావణ్య, రోజ్‌కిరణ్, జ్యోత్స్న తదితరులు అభినందించారు. రక్తదానంలో క్విస్ విద్యార్థి ఒకరు ఆరేళ్ళ చిన్నారి ప్రాణాన్ని కాపాడారని వారు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావుకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు.



ప్రిన్సిపాల్ హనుమంతరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

ఉదిత్‌ప్రదాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్‌లో మత్తుమందు విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఒడిశా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్‌ప్రదాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక లాయర్‌పేటలోని ఉదిత్‌ప్రదాన్ దిష్టిబొమ్మను వారు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటువంటి తప్పుడు పనులు చేస్తున్న ఎన్ఎస్‌యూఐను వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థినికి, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థినిఇ వేధించడమే కాకుండా అత్యాచారం చేయడం సభ్యసమాజం తల దించుకునేవిధంగా ఉందన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గురునాథ్, నగర సహా కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, కార్యవర్గసభ్యులు సుదర్శన్‌రెడ్డి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వీసీ మూర్తికి అభినందనలు

ఒంగోలు విద్య, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్‌గా జీవీఆర్.మూర్తి బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు. మంగళవారం స్థానిక యూనివర్శిటీలోని వీసీ చాంబర్‌లో వీసీ మూర్తిని యూనివర్శిటీ అధికారులు కలిసి బొకేలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ నిర్మలామణి, సీఈ సోమశేఖర్, డీన్ కేవీఎన్.రాజమోహన్‌రావు, భారతీదేవి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం.హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ పాల్గొన్నారు.



వీసీ మూర్తికి సత్కరిస్తున్న అధ్యాపకులు

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఒంగోలు(రూరల్), జూలై22(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య కోరారు. మంగళవారం యరజర్ల, సర్వేరెడ్డిపాలెంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లుపై చెత్తాచెదారం వేయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే చెత్తబండిలో వేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య

30న ఒంగోలు జాతి పశువుల వేలం

నాగులుప్పలపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చదలవాడ పశుక్షేత్రంలోని 47 ఒంగోలు జాతి పశువులకు ఈ నెల 30వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు డీడీ డాక్టర్ బి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలానికి ఒట్టి ఆవులు 13, పెయ్యలు 2, పెయ్యదూడలు 16, కోడె దూడలు 16 ఉన్నాయని, పాటదారులు ముందుగా రూ.5వేల ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంకు ఒక రోజు ముందుగా పశుక్షేత్రంలో ఆయా పశువులను పరిశీలించుకోవచ్చని, వివరాలకు 9392901049 సెల్‌నంబరులో సంప్రదించాలని డీడీ కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల కార్యాలయంలో జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. మండల పరిషత్‌సభ్యులు, అధికారులు తగిన నివేదికలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

■ ముఖాముఖి

నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి

నిర్మలాదేవి, ఏపీడీ, వైపాలెం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఉపయోగపడే నీటి కుంట (ఫాం పాండ్స్) లకు ప్రాధాన్యం ఇస్తుందని, అవి ఏర్పాటు చేసుకోవడం వలన రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని జాతీయ ఉపాధి హామీ పథకం మార్కాపురం ఏపీడీ నిర్మాల దేవి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ప్రశ్న : ప్రస్తుతం ఉపాధి పథకం ద్వారా ఏయో పథకాలు అమలులో ఉన్నాయి.

జవాబు : రైతులకు ఉపయోగకరమైన పథకాలు అమలులో ఉన్నాయి. ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తూ నిమ్మ, బత్తాయి, దానిమ్మ, నేరేడు, కొబ్బరి సాగుకు ప్రాధాన్యం ఇస్తుంది.

ప్ర : ఎంత మందికి సాగుకు అవకాశం ఇస్తున్నారు.

జ : మార్కాపురం క్లస్టర్ పరిధిలో 1500 ఎకరాల్లో ఈ ఏడాది ఆయా పంటలు రైతులు వేసుకునేలా ప్రయత్నిస్తున్నాం.

ప్ర : ఏయో మండలాల్లో ఎంత టార్గెట్

జ : ఎర్రగొండపాలెం 300 ఎకరాలు, పుల్లలచెరువు 300, త్రిపురాంతకం 300, పెద్దారవీడు 200, దోర్నాల 200, మార్కాపురం 100, దొనకొండ 100 ఎకరాల్లో వేసేలా ప్రతిపాదనలు పంపించాం.

ప్ర : సాగు చేసిన పంటలను ఎలా కాపాడుకోవాలి

జ : సాగు చేసిన ప్రతి రైతుకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందిస్తాం. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీపై ఇవ్వనున్నారు.

ప్ర : నీటి కుంటల వలన పొలాలు నష్టపోవాల్సి వస్తుంది.

జ : రైతులు పొలాల్లో కాకుండా పక్కనే వినియోగంలో లేని ల్యాండ్‌లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవచ్చు. అలా లేనివారు పొలాల్లో తీస్తే బోరు, వాన నీటితో పాండ్లను నింపుకోవచ్చు. దానివల్ల నష్టం లేదు.

రైతులపై జగన్‌రెడ్డి మొసలి కన్నీరు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



ఎస్టీ కాలనీలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

- **ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి**
- **ఆగస్టు 15 నుంచి తొలివిడత అన్నదాత సుఖీభవ**

గిద్దలూరు టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైతుల పేరు చెప్పుకుని నాడు అధికారంలోకి వచ్చి మోటార్లకు మీటర్లు బిగించి రైతులను మోసగించిన జగన్‌రెడ్డి నేడు మొసలి కన్నీరు కార్చుతున్నారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం మండలంలోని కొంగళవీడు, బయనపల్లె, కొమ్మునూరు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా కొంగళవీడు గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కొంగళవీడు నుంచి నరవ గ్రామానికి రూ.3.20కోట్లతో నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆయన ప్రారంభించారు. వేములపాడు, కొమ్మునూరు గ్రామాలలో రూ.20లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గడిచిన ఏడాదిలో మహిళలు, రైతుల సంక్షేమంతోపాటు యువత భవిష్యత్ కోసం చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు చేసిందేమీ లేదని, కానీ జగన్‌రెడ్డి మొసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం గిట్టుబాటు ధరలు, పొగాకు, మామిడి కొనుగోళ్లకు కృషి చేసిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకాన్ని మొదటిగా ఆగస్టు 15వ తేదీన అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, మీసాల పాపయ్య, బాబాయి, మీసాల రమేష్ ఉన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలందినపుడే అభివృద్ధి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : అందరికీ సంక్షేమ పథకాలు అందినపుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా వినూత్న పథకాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెంలోని ఎస్టీ కాలనీలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పెంచి వారు గౌరంగా జీవించేలా చేశారన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఉన్న పిల్లలందరూ చదువుకునేలా మార్గం చూపారని తెలిపారు. ఇలా అన్నివర్గాల ప్రజలకు చేయూత నిచ్చేలా సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు సుబ్బారావు, సత్యనారాయణగౌడ్, యక్కలి తిమ్మయ్య, డి.వెంకట్రావు, కిశోర్, పట్టణ అధ్యక్షులు పీ మల్లికార్జునరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ గఫూర్, బ్రహ్మారెడ్డి, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్ద బొమ్మలాపురంలో

పెద్ద దోర్నాల : మండలంలోని పెద్ద బొమ్మలాపురం తూర్పు పల్లెలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంటు టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే బృహత్తర పథకాలను అమలు చేయడంతో దీంతో అన్నివర్గాల ప్రజలు ఆనందంలో ఉన్నారని తెలిపారు. తల్లికి వందనం, 3 గ్యాస్ సిలిండర్ల మంజూరు, పింఛన్ పెంపుతో పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ త్వరలో అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మల్లారెడ్డి, గంగరాజు, నర్సిరెడ్డి, మల్లయ్య, దాడియేలు, ఈశ్వర్, రాజయ్య పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మార్కాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం డివిజన్‌లోని పలు చోట్ల మెడికల్ షాపులలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల బృందం మంగళవారం తనిఖీలు చే పట్టింది. 'దాడుల భయంతో మూత' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఔషధ నియంత్రణ శాఖ స్పందించింది. మార్కాపురం, గుంటూరు విజిలెన్స్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉషారాణి, సాంబశివరావు, మహేష్ బృందంగా ఏర్పడి సిబ్బందితో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కాపురం, కనిగిరి, పొదిలి పట్టణాల్లోని మెడికల్ షాపుల్లో సోదాలు చేశారు. ఆరోగ్యశ్రీ విభాగం ఉన్న ప్రతి ప్రైవేటు వైద్యశాలలోనూ తనిఖీలు నిర్వహించారు. ఆయా చోట్ల నిబంధనల మేరకు మందులు అమ్ముతున్నారా? లేదా? అన్న విషయాలను పరిశీలించారు. అనుమానం వచ్చిన పలు కంపెనీలకు చెందిన మందులను సేకరించి లేబొరేటరీకి పంపారు. ఈ సందర్భంగా షాపులు నిర్వహిస్తున్న యజమానుల సర్టిఫికెట్లను కూడా పరిశీలించారు. గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)కంటే ఎక్కువకు అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ డాక్టర్ నాగరాజు

ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే చర్యలు

వాహనాల తనిఖీలో డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు అన్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఏకకాలంలో వాహన తనిఖీ చేపట్టారు. మార్కెట్ యార్డు, పూలసుబ్బయ్య కాలనీ, ఆర్టీసీ డిపో, కంభం రోడ్డు, ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో ప్రతి వాహనాన్ని నిలిపి తనిఖీలు నిర్వహించారు. పెండింగ్ చలానాలు ఉన్న 106 కేసుల్లో రూ.22,440లు జరిమానా విధించారు. రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సైలెన్సర్‌లను మార్చుచేసిన 8 వాహనాలు, నెంబర్ ప్లేట్‌లేని 8 వాహనాలకు నూతనంగా సైలెన్సర్‌లు, ప్లేట్లు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ గతంతో పోల్చితే జరిమానాలు ఎక్కువగా పెరిగాయన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగివుండటం, హెల్మెట్ ధరించడం, పరిమితికి లోబడి వాహనంలో ప్రయాణించడం తప్పనిసరి అన్నారు. తనిఖీల్లో మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, అంకమ్మరావు, అహరోన్, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం మంగలంలోని ఓబులక్కపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌యూవో క్రిష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యంగా ప్రతి ఒక్కరూ మూడు విషయాలను తప్పకపాటించాలన్నారు. నీటి నిల్వను గుర్తించాలని, వాటిని శుభ్రపరచడం, నీటినిల్వలకు మూతలు అమర్చడం మరిచిపోవద్దన్నారు. ఇంటి ముందుగాని, ఇంటిపరసరాల్లోగాని మురుగు నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంట్లో మరుగు నీరు బైటకు వచ్చినప్పుడు వీధుల్లో వదిలేయకుండా పెద్దగుంట తీసి అందులోకి వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ మార్పుల వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

రాచర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల పోలీస్ స్టేషన్‌ను గిద్దలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.రామకోటయ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులు వివరాలు ఎస్సై కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని, బాధితులపట్ల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సైలు

కంభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కంభం సీఐ మల్లికార్జున తెలిపారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల ఆటోడ్రైవర్ల సమావేశంలో సీఐ మల్లికార్జున మాట్లాడుతూ తాము సూచించిన ప్రకారం లైసెన్సు, ఇన్స్యూరెన్స్ లేకపోతే పట్టుబడినపుడు రూ.10వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. లేబర్ ఆఫీసులో మీ పేర్లు నమోదై ఉంటే కార్మికులుగా గుర్తింపు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు నరసింహారావు, రవీంద్రరెడ్డి, సుదర్శన్, మార్కాపురం బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు పాల్గొన్నారు.

కార్మికుల వినూత్న నిరసన

గిద్దలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు 7వ రోజు మంగళవారం వినూత్నంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మురళి, కార్యదర్శి రంగయ్య, యూనియన్ నాయకులు రవి, చంటయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ఐక్య బాప్టిస్టు చర్చి నూతన కమిటీ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ది సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి ఐక్య బాప్టిస్టు నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.దేవప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా డి.ఆదిత్య వర్మ, కార్యదర్శిగా పిలిప్, సహయ కార్యదర్శిగా సూర్య ప్రకాశ్‌రావు, కోశాధికారిగా ఎస్తేరు రాణి ఎన్నికయ్యారు.

అచ్యుతానందన్‌కు నివాళి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పోరాట యోధుడు అచ్యుతానందన్ అని సీపీఎం నాయకులు అన్నారు. సీపీఎం కార్యాలయంలో కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సోమయ్య, డీకేఎం రఫి, ఏనుగుల సురేశ్, బాలనాగయ్య, రాజు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి నేడే చివరి తేదీ

రాచర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి నేడే చివరి తేదీ అని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డీ మేరీ మంజుల మంగళవారం ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి నేడు అనగా 23వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. 10వ తరగతిలో ప్రవేశించేందుకు 9వతరగతి పూర్తి చేసిన విద్యార్థులు 60శాతం మార్కులు సాధించిన వారు అర్హులని ఆమె తెలిపారు. వివరాలకు 9701489190కు సంప్రదించాలని ఆమె కోరారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి

మార్కాపురం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 4 నెలల పెండిగ్ జీతాలను చెల్లించాలని కోరుతూ మంగళవారం సూపరింటెండెంట్ రామచంద్రారావుకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రఫి, కార్మికులు రూబెన్, సురేష్, కొండమ్మ పాల్గొన్నారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

మార్కాపురం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి). లోకోస్ యాప్‌లో స్వయం సహాయక సంఘాల మహిళల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని శిక్షకురాలు ఈశ్వరి కోరారు. ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారు వెలుగు కార్యాలయంలో మండలంలోని వీవోఏలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు.



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో కమలకుమారి

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్ద దోర్నాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలపై చెంచు గిరిజనులు అవగాహన కల్గి ఉండాలని సీడీపీవో కమల కుమారి అన్నారు. శివ సదనులో ఆదర్శ సంస్థ ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరయిన కమలకుమారి మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం సంపూర్ణ పోషణ ప్లస్ అమలు జరుగుతుందన్నారు. దీని కింద గర్భిణులు, బాలింతలకు నెలకు 25 గుడ్లు, 5లీటర్ల పాలు, 3 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకిలో ఆయిల్ ప్యాకెట్లు, 2 కేజీల మల్టీ ఆట రాగి పిండి, అర కేజీ బెల్లం, అర కేజీ కర్జూరాలు, అరకేజీ చిక్కీలు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే 7నెలల బిడ్డ నుంచి 2.5 కేజీల బాలామృతం, 30కోడిగుడ్లు, 6లీటర్ల పాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రీ స్కూల్ పిల్లలకు 75 గ్రాముల బియ్యం, 15గ్రాముల కందిపప్పు, 5గ్రాముల నూనెతో వంట చేసి భోజనం పెడతారు. అలాగే ఉదయం ఉడికించిన గుడ్డు, లేదా 200 ఎంఎల్ పాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఇవన్నీ గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. చింతల వీఆర్‌వో వెంకటయ్య మాట్లాడుతూ రేషన్ కార్డు లేనివారు దరఖాస్తు చేసు కోవాలని, ఉన్నా పిల్లలను చేర్చుకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ కరుణాకర్, అగ్రికల్చర్ అధికారిఆ ప్రసాద్, ఆర్గనైజర్స్ సామ్యూల్, కోటేశ్వరరావు, వెంకటేశం, దావీద్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

గిద్దలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంజీవరాయుని పేట గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఖరీఫ్ పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలులోని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.రామ్మోహన్ కార్యక్రమానికి హాజరై పత్తి, కంది, ఆముదం, కొర్ర మొదలైన పంటలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే 20 శాతం పెట్టుబడిని తగ్గించుకోవచ్చన్నారు. పత్తిలో పురుగును బట్టి సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరాకు 10 నుంచి 15 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎం.వి జయభాస్కర్‌రెడ్డి, విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శంకరమ్మ, మధుశంకర్ పాల్గొన్నారు.

మురుగు తొలగించి.. బ్లీచింగ్ చల్లించండి

రాచర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కాలువలు, వీధుల్లో ఉన్న మురుగు తొలగించి వెంటనే బ్లీచింగ్ చల్లించాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. జేపీ చెరువు, అనుములపల్లిలో పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షాలు ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తగా పంచాయితీ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను అప్రమత్తం చేసి వారు శుభ్రంగా ఉంటూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. పారిశుధ్య పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటేష్, కార్యదర్శులు సురేష్, వీరగరుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్న ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

వీధి కుక్కల స్వైరవిహారం

భయాందోళనలో ప్రజలు

కంభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కంభం, కందులాపురం పంచాయతీలలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ చిన్నారులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాకింగ్‌కు వెళ్లే వారిపై, ద్విచక్ర వాహనదారులను వెంటాడి దాడులకు పాల్పడుతున్నాయి. కుక్కల దాడిలో పలువురు గాయాలపాలయ్యారు. రెండు పంచాయతీల్లోని వీధుల్లో వందల కుక్కలు సంచరిస్తున్నాయి. దీనితో ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు మండల సమావేశాల్లో వీధికుక్కల బెడదను తొలగించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ప్రయోజనం లేకపోవడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈవిషయంపై కార్యదర్శి జోసులును వివరణ కోరగా కుక్కలను పట్టి దూరంగా వదలాలన్నా, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయాలన్నా సరిపడ నిధులు లేవని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.



రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న వీధికుక్కలు

వాహనదారుడిని వెంబడించిన కుక్కలు

కిందపడి ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

కంభం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కందులాపురం పాఠశాలకు వాహనంపై వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని వీధి కుక్కలు వెంబడించడంతో కిందపడి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే కంభంకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చాట్ల డానియేలు కందులాపురం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తుండగా వీధికుక్కలు వెంటపడడంతో అదుపుతప్పి కిందపడి డానియేలుకు గాయాలయ్యాయి. వెంటనే కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీధికుక్కలు వెంటపడడంతో అనేకమార్లు పలువురు కిందపడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు, వాహనదారులు విమర్శిస్తున్నారు.

పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పీ-4 విధానంలో నిరుపేద కుటుంబాల్లో విద్యార్థులను దత్తత చేసుకొని 2047 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా తీర్చి దిద్దాలన్నదే ముఖ్య మంత్రి చంద్రబాబు ఆశయం అని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. అంబేడ్కర్ భవన్ జరిగిన పీ4పై మంగళవారం అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పేద కుటుంబాల విద్యార్థులను దత్తత తీసుకోవాలని ఎరిక్షన్‌బాబు సూచించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు జమ చేయాలి

పొదిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గత డిసెంబర్‌లో విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి కుంటుపడడంతోపాటు పారిశుధ్యం గాడి తప్పిందన్నారు. అసలే వర్షాకాలం ఆపైన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 విడుదల చేసి దేనికి కేటాయించారో తెలపాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు పంచాయతీ ఖాతాల్లో వేసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

ప్రతి పోలింగ్ బూత్‌కు 1,200 మంది ఓటర్లు ఉండేలా చర్యలు

మార్కాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పోలింగ్ బూత్‌కు 1,200 మంది ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్ నిర్వహించామన్నారు. 1,200 ఓట్లకు మించి ఒక పోలింగ్ బూత్‌లో ఉండరాదని ఈసీ ఆదేశాలిచ్చిందన్నారు. అందుకు అనుగుణంగానే నియోజకవర్గ వ్యాప్తంగా జాబితాలను తయారు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, అఖిలపక్ష నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, విజయారావు నరసింహారావు, పీవీ కృష్ణారావు, పత్తి రవిచంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకొని సత్ప్రవర్తన కలిగి ఉండాలని వాసవీ విద్యా నికేతన్ ప్రిన్సిపాల్ కె.రంగయ్య అన్నారు. వాసవీ విద్యానికేతన్‌లో మాధకద్రవ్యాల నియంత్రణపై పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్‌ఐలు రాజమోహన్, సైదుబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు గంజాయి తదితర మత్తు పదార్థాలకు ఆకర్షితులు కావొద్దని, చెడు ప్రవర్తన కలిగిన వారిని దూరంగా ఉంచాలన్నారు. చిన్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సెల్ ఫోన్ వాడకం అనర్థదాయకమని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రంజిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దర్శి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి అనురాధ రైతులకు సూచించారు. మండలంలోని కోర్లమడుగు, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కా ర్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలను పరిశీలిం చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసా న్ పథకాలు కౌలు రైతులకు వర్తించాలంటే కౌలు కార్డులు తప్పనిసరిగా తీ సుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.
దొనకొండ: అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బు ధవారంతో గడువు పూర్తవుతుందని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణా నాయక్ పేర్కొన్నారు. మండలంలోని ఆరవళ్లిపాడు, తెల్లబాడు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల బీమా చెల్లించుకోవాలన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

దొనకొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పాల్ నాని అన్నారు. డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన షేక్ షమీమా, కెవీ శ్రావణి, ఏ కాశమ్మ, బి.ఏసుబాబు, జె.కృతికను చైర్మన్ గుండారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విడుదల దేవదానం, డి.వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివరాంపురం ఇన్‌చార్జ్ కార్యదర్శిగా షహనాజ్

తాళ్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపురం ఇన్‌చార్జ్ కార్యదర్శిగా విఠలాపురం కార్యదర్శి షేక్ షహనాజ్‌ను నియమిస్తూ ఎంపీడీవో డి.హనుమంతరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో శివరాంపురం గ్రామ కార్యదర్శి రాజారమేష్ బదిలీపై వెళ్లటంతో కొర్రపాటివారిపాలెం పంచాయతీ కార్యదర్శి డి.కల్యాణ్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆయన కూడా బదిలీపై వెళ్లడంతో విఠలాపురం గ్రామ కార్యదర్శి షేక్ షహనాజ్‌ను నియమిస్తూ ఎంపీడీవో ఉత్తర్వులు జారీ చేశారు.

అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగించాలి

పామూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యు తానందన్ అనారోగ్యంతో మృతి చెందడం సీపీఎంకు తీరనిలోటని జాలా అంజయ్య అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగిన సంతాపసభలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలువేసిన నివాళుల ర్పించారు. అంజయ్య మాట్లాడుతూ ఆయన ఆశయాలను కొనసాగించాల న్నారు. కార్యక్రమంలో సయ్యద్ హనీఫ్, ఖాదర్‌బాషా, కె.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.
దర్శి: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి విచారకరమని సీపీఎం దర్శి డివిజన్ నాయకుడు టి .రంగారావు విచారం వ్యక్తం చేశారు స్థానిక సుందరయ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. కార్యక్రమంలో సందు వెంకటేశ్వరరావు, ఎం.యలమందారెడ్డి, యు.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తాం

సీఎస్‌పురం(పామూరు), జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో అన్ని సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకొంటున్నట్లు ఎంఈవో రాజాల కొండారెడ్డి తెలిపారు. సీఎస్‌పురం మెయిన్ ప్రాథమిక మోడల్ పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. మొక్కలు నాటిన విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన గ్రీన్ పాస్‌పోర్టులను అందజేశారు. కార్యక్రమంలో వి .సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో డెంగ్యూ జ్వరాలు సోకే ప్రమాదం ఉందని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంగళవారం వెలుగువారిపాలెంలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారం నిల్వలేకుండా ఉండాలన్నారు. జ్వరం వచ్చి తగ్గకుంటే వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తాళ్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): దర్శి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.రవికుమార్ మంగళవారం సాయంత్రం మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో వాహనాలను తనిఖీ చేశారు. పరిమతికి మించి అధికలోడ్‌తో వెళుతున్న టిప్పర్, ట్రాక్టర్, లారీలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా రూ.లక్షా ఆరు వేలు అపరాధ రుసుం విధించారు. వాహనదారులు అనుమతి పత్రాలు, పరిమితిలోడ్‌తో వెళ్లాలన్నారు. నింబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అపరాధ రుసుం విధిస్తామని రవికుమార్ హెచ్చరించారు.

కనిగిరి అభివృద్ధిలో..

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

అధికారులు భాగస్వాములు కావాలి

కనిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కనిగిరి అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్ సమావేశపు హాలులో మంగళవారం నియోజకవర్గస్థాయి వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనిగిరి ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదిక తయారుచేయాలని సూచించారు. వర్షాల పడుతున్న ఈ తరుణంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య కార్మికులు కొరవడిన ప్రదేశాల్లో రోజువారీ కూలీల ద్వారానైనా పారిశుధ్య పనులు చేయించాలన్నారు. తద్వార ప్రజలకు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. చెత్త కుప్పల్లో వర్షాల కారణంగా దోమలు ప్రబలి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. రైతాంగ సమస్యలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయశాఖ అధికారులు మరింత చొరవచూపాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిదులు అవసరమో గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. మంచినీటి వసతి, సరఫరాపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వర్షాల కారణంగా సాగర్ నీరు కలుషితమయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. నీటిని శుద్ధిచేసి ప్రజలకు సరఫరా చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వైద్యశాఖ పరిధిలోని డాక్టర్‌లు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. వైద్యపరంగా ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదన్నారు. ప్రతి ప్రభుత్వశాఖ పరిధిలో అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. తద్వారా కనిగిరి నియోజకవర్గ ప్రజల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్ళి అవసరమైన నిధులు సమీకరణకు తన వంతు కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విశ్వనాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన, ఎంఈవో యూవీ నారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డు

» కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆగ్రహం

ముండ్లమూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో డంపింగ్ యార్డు నిరుపయోగంగా ఉండటం పట్ల కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పూరిమెట్ల, కెల్లంపల్లి, పెదఉల్లగల్లు గ్రామాలను ఆమె సందర్శించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో భాగంగా రెండు గ్రామాల్లో పారిశుధ్యం సరిగా లేదని ఫిర్యాదులు రావటంతో పూరిమెట్ల, కెల్లంపల్లి గ్రామాలను సందర్శిస్తున్నట్టు చెప్పారు.

కెల్లంపల్లి గ్రామంలో డంపింగ్ యార్డును చూసి ఇందులో చెత్తాచెదారాన్ని ఎందుకు వేయటం లేదని, ఎందుకు తనిఖీలు నిర్వహించటం లేదని డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చెప్పే సమాధానం సక్రమంగా లేకపోవటంతో అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రధాన వీధులను కలెక్టర్ సందర్శించి పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓఇంటికి వెళ్ళి పారిశుధ్య పనులు ఎలా చేపడుతున్నారని? అడగ్గా ప్రతి రోజు తడి చెత్తను పొడి చెత్తను తీసుకువెళ్తున్నారని ఇంటి యజమానురాలు తెలిపారు. అక్కడే ఉన్న గ్రీన్ అంబాసిడర్లను ఏమైనా సమస్యలు ఉన్నాయా? అడగ్గా తమకు జీతాలు తొమ్మిది నెలల నుంచి రావడంలేదన్నారు. తక్షణమే పంచాయతీల నుంచి గ్రీన్ అండాసిడర్లకు జీతాలు చెల్లించాలని ఎంపీడీవో శ్రీదేవిని ఆదేశించారు. గ్రామానికి చెందిన కుంటా అంజలి తొమ్మిది సంవత్సరాల దివ్యాంగుడు గణేష్‌ను తీసుకు వచ్చి తమకు నలుగురు పిల్లలని, తన పరిస్థితి బాగోలేదని కన్నీటి పర్యంత మయ్యారు. ఆమె చెల్లించి పోయి వెంటనే తహసీల్దార్ లక్ష్మీనారాయణను ఆ కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే డీపీవో రూ.2వేలు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ రూ.2 వేలు తక్షణ సాయంగా అందించారు. రెండు నెలలకు సరిపడా సరుకులు ఇప్పించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను ఆదేశించారు. అనంతరం పెద ఉల్లగల్లులో డంపింగ్ యార్డును పరిశీలించారు.



కెల్లంపల్లిలో డంపింగ్ యార్డును పరిశీలించి డిప్యూటీ ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బెల్టు షాపులు లేకుండా చేయాలంటూ మహిళ మొర

పూరిమెట్లలో బెల్టు షాపులతో కాపురాలు చితికి పోతున్నాయని గ్రామానికి చెందిన ముల్లా విజయమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ఎన్ని బెల్టు షాపులు ఉన్నాయని కలెక్టర్ అడగ్గా మూడు బెల్టు షాపులను రూ.10 లక్షలకు పాట పాడుకుంటున్నారని తెలిపారు. ఇటీవల బెల్టు షాపుల్లో మద్యం తాగి మురుగు కాలువల్లో పడి ఒక వ్యక్తి మృతి చెందారని తెలిపారు. దీనికితోడు ఉపాధి హామీపథకంలో కూలీలకు రెండు నెలల నుంచి వేతనాలు రాకపోగా గ్రామంలో కొందరు మేట్లు రూ.200 లంచం అడుగుతున్నారని తెలిపారు. వెంటనే ఆయా శాఖల అధికారులను పిలిపించి విచారణచేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో వెంకటనాయుడు, డీఎల్‌పీవో పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్ బాబు, విద్యుత్ ఏఈ టి.చినఅంకబాబు, సర్పంచ్‌లు ఒగులూరి రామాంజీ, జమ్ముల గురవయ్య, జనమాల నాగేంద్ర, ఏఎంసీ వైస్‌చైర్మన్ కోడెగ మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే పల్లెల ప్రగతి

సీఎస్‌పురం(పామూరు), జూలై 22(ఆంధ్రజ్యోతి): పల్లెసీమల ప్రగతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం సీఎస్‌పురం మండలం ఉప్పలపాడు గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలుపరిచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలి విధ్వంసం సృష్టించి కూల్చడమే పనిగా పెట్టుకొందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, మాజీ సింగిల్‌విండో చైర్మన్ బి నారాయణరెడ్డి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఎన్‌సీ మాలకొండయ్య, పునుగుపాటిరవి, వెంకటనారాయణ, ఏసుదాసు, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

కనిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత చంద్రబాబుదేనని టీడీపీ హెచ్ఎంపాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి(ఎస్‌టీఆర్) అన్నారు. మంగళవారం హనుమంతునిపాడు మండలంలోని కూటాగుండ్ల, ముప్పళ్ళపాడు గ్రామాల్లో జరిగిన సుపరిపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కనిగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, గాయం రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




మహిళలకు కరపత్రాలను అందజేస్తున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

వెలిగండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకణంపాడు పంచాయతీలోని సూదనగుంట్ల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన 30 మంది మంగళవారం డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, చిలకల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహా రెడ్డితోనే సాధ్యమని గుర్తించి తాము టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కాశిరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీసీ, ఎస్సీలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. కార్పొరేషన్లు నిర్వీర్యం చేశారన్నారు. అనంతరం సూదనగుంట్ల గ్రామంలో సర్పంచ్ నిధులతో వేసిన బోరును ప్రారంభించారు. అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఎరువ రామకృష్ణారెడ్డి మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ నాయకుడు చిలక ల కృష్ణారెడ్డి వారి కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసా యం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, జయపాల్‌రెడ్డి, కామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్ అనుసంధానానికి సహకరించాలి'

కనిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఓటరుకు వారి ఓటుకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియలో రాజకీయ ప్రతినిధులు సహకరించాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటు నమోదు ప్రక్రియపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 1200 ఓట్లు, అంతకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఓటరు జాబితా తయారుచేసే క్రమంలో బూత్ లెవల్ ఏజెంట్ వివరాలను అందజేయాలని రాజకీయపార్టీల ప్రతినిధులను కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, టీడీపీ నాయకుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, నరసింహులు, తహసీల్దార్ రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

గంజాయి అమ్మకాలపై ప్రత్యేక నిఘా



కొండ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ శ్రీరాం

కనిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్ఐ టి.శ్రీరాం చెప్పారు. పట్టణంలోని దొరువు ప్రాంతం, కొండ దిగువతోపాటు కొండపైన మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయిని సేవిస్తూ భావిజీవితాన్ని నాశనం చేసుకుంటు న్నారన్నారు. పట్టణంలో కొత్త వ్యక్తులు సంచారిస్తూ కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొంతమంది కొండ వద్ద, దొరువ వద్ద, నగర శివారుల్లో సంచరిస్తూ మొబైల్ అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటమన్నారు. గంజాయి అమ్మకం విషయాలను పోలీసులకు తెలియజేసే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

సెల్ షాపులో అధికారుల తనిఖీలు

దర్శి, జూలై 22(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని రాజా మొబైల్స్ సెల్ షాపులో మంగళవారం సేల్స్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాస్థాయి అధికారి ఆధ్వర్యంలో బృందం ఉదయం 11 గంటల సమయంలో దర్శికి వచ్చినట్లు సమాచారం. ఆ బృందం సెల్ షాపులో సుమారు 4 గంటల పాటు తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం కొన్ని కీలకమైన రికార్డులను వారి వెంట తీసుకెళ్లినట్లు సమాచారం.

ఈ సెల్‌షాపు నిర్వాహకులు బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాల నుండి వస్తువులు తెచ్చి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందటంతో సేల్స్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు చేసినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈవిషయమై సేల్స్ ట్యాక్స్ అధికారులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా దర్శి పట్టణంలోని రాజా సెల్ షాపులో తనిఖీలు చేసిన మాట వాస్తవమేనన్నారు. పూర్తి వివరాలను నివేదిక ద్వారా ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు అన్నారు. మంగళవారం మండలంలోని పసుపుగల్లు, కెల్లంపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు, ఎరువులు వాడవద్దన్నారు.

ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను పరిశీలించారు. రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.కార్యక్రమంలో వీఏఏ నరేంద్ర, ఉద్యానశాఖ సహాయకురాలు సువర్చల పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, టీడీపీ నాయకులు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దర్శి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. దర్శి పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, నారపుశెట్టి మధు, ఊరిబిండి మధు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ పథకంలో 33 మంచినీటి ట్యాంకులు మంజూరు

దొనకొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ పథకంలో భాగంగా మండలానికి 33 మంచినీటి ట్యాంకులు మంజూరయ్యాయి. 18 గ్రామ పంచాయతీల పరిధిలోని ఆరవళ్లిపాడు, బాదాపురం, యర్రబాలెం, దొండపాడు, పెద్దగుడిపాడు, ఇండ్లచెరువు, పి.వెంకటాపురం, ఎన్ఎస్‌పల్లి, చిన్నగుడిపాడు, సంగాపురం, వీరేపల్లి, తెల్లబాడు, వెస్టు కంభంపాడు, వద్దిపాడు, బట్టిపాడు, చందవరం, దేశిరెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, కొచ్చెర్లకోట, నారపరెడ్డిపల్లి, పుల్లాయిపల్లి, మల్లంపేట, అనంతవరం, చిలకలపల్లి, మంగినపూడి, పి.లక్ష్మీపురం, కంభంవారిపల్లి, పోలేపల్లి, పుచ్చకాయలపల్లి, రామిరెడ్డిపల్లి, రామాపురం, రుద్రసముద్రం గ్రామాల్లో హైలెవల్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టి ఇంటింటికి కొళాయి ఏర్పాటుతో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణాలకు అనువైన స్థలాల ఎంపిక కోసం సంబంధిత అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ పథకం సకాలంలో పూర్తయితే దాదాపు 30 సంవత్సరాల పాటు గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని సమస్య తీరుతుందని ప్రజలు భావిస్తున్నారు.

విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరనాయక్ సూచించారు. సీఎస్‌పురం మండలంలోని శీలంవారిపల్లి, పెదరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మాదక ద్రవ్యాలు, బాలికలపట్ల లైంగిక వేధింపులకు సంబంధించి మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు కె.వెంకటేశ్వర్లు, బోడా ప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ కె.ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

పామూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకులోనై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. మంగళవారం స్థానిక వివేక డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ మూర్తి మహాలక్ష్మయ్య అధ్యక్షత వహించారు. సీఐ మాట్లాడుతూ గంజాయి కలిగిఉన్నా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి మత్తుపదార్థాలకు అలవాటుపడి మీ భవిష్యత్తును పాడుచేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ షేక్ జిలానిబాషా, సిబ్బంది పాల్గొన్నారు.


గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంచుకోవాలి

పీసీపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. మంగళవారం పీసీపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆకతాయిలతో పాటు ఇతర ఏదైనా సమస్య ఎదురైప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ప్రత్యేక అధికారిణి సుజాత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

తాళ్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. మంగళ వారం సాయంత్రం స్థానిక ఏబీసీ స్కూల్‌లో జరిగిన అవగాహన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశనుంచే లక్ష్యసాధనతో ముందు కు సాగి ఉన్నత వ్యక్తులుగా నిలవాలన్నారు. క్రమశిక్షణతో విద్య కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ కెవెంకటేశ్వరరావు, డైరెక్టర్ కాలేషాబాబు, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, దుకాణాల యజమానులు

కనిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల అమ్మకాలను నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో మంగళవారం వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలుదారులకు ప్లాస్టిక్ కవర్ల స్థానంలో పర్యావరణహిత సంచులను అందజేయాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయవిక్రయాలు, రవాణా, నిల్వలపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో ప్రత్యామ్నాయంగా నార, గుడ్డ సంచులను విక్రయించాలన్నారు. గోదాములు, షాపులపై ఆకస్మిక దాడులు చేస్తామన్నారు. ఆ సమయంలో ప్లాస్టిక్ వస్తువులు దొరికితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువుల అమ్మకాలను నిషేధిస్తామని దుకాణాల యజమానులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, మేనేజర్ ప్రసాద్, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

దేవదాయ భూములకు కౌలు వేలం

తాళ్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరం గ్రామంలో దేవాలయాలకు చెందిన భూములను సాగుచేసుకునేందుకు పంగులూరు గ్రూపు దేవదాయ కార్యనిర్వహణాధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం కౌలు వేలం నిర్వహించారు. గతంలో ఈ ఆభూములను రూ.1.77లక్షలకు పాడుకోగా, ప్రస్తుతం నిర్వహించిన వేలంపాటలో రూ.3.22 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈవో వాసుబాబు, ఆర్పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలించిన ఏఈ

ముండ్లమూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని అంబేడ్కర్ కాలనీ, ఎస్సీ కాలనీల్లో వేలాడుతున్న విద్యుత్ తీగెలను మంగళవారం సాయంత్రం ఏఈ చినఅంకబాబు పరిశీలించారు. ఈసందర్భంగా లోవోల్టేజీ సమస్య అధికంగా ఉందని కాలనీ వాసులు ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.




పెనుమూడి సమీపంలో గుంతల మయంగా కరకట్ట

కరకట్టకు.. కోతలు

- గుంతలమయంగా రహదారి
- ప్రమాదభరితంగా మారినా పట్టించుకోరు
- ఇసుక టిప్పర్ల తాకిడికి పూర్తిగా కుంగిన కట్ట
- వరదల సమయంలో అధికారులు హడావుడి

నదీ తీర ప్రాంతాలపై కృష్ణమ్మ కన్నెర్ర చేయకుండా కట్టడి చేయాల్సిన కరకట్ట ప్రమాదకరంగా మారింది. కోతలతో కట్ట ఎక్కడికక్కడ బలహీనంగా మారింది. పటిష్ఠంగా ఉండాల్సిన కరకట్ట రహదారి మొత్తం పెద్దపెద్ద గోతులతో నిండిపోయి ఉంది. కోతలు, గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తోందోనని కరకట్ట సమీప గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ప్రధానంగా వర్షాలు, వరదల సమయాల్లో అయితే రాత్రిళ్లు కంటిమీద కునుకు వేయరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతంలో కరకట్టకు పలు ప్రాంతాల్లో కోతతో ఆయా గ్రామాలను వరద ముంచెత్తినా అధికారులు హడావుడితో సరిపెట్టారే కానీ పటిష్ఠ చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గుంతలు పడిన కరకట్ట

రేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం నుంచి.. దిగువన కృష్ణమ్మ సముద్రంలో కలిసే వరకు ఉన్న కరకట్ట ప్రమాదకరంగా మారింది. వరదపోటును నివారించడంలో కరకట్ట పాత్ర ఎంతో కీలకమైనా ప్రభుత్వం దాని పటిష్ఠతపై దృష్టి సారించడంలేదు. ఎన్నో దశాబ్దాలుగా కృష్ణానది పరివాహక ప్రాంతాలుగా ఉన్న గ్రామాలను కావలి కాసే కరకట్ట పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఇసుక టిప్పర్ల రాకపోకలతో ఎక్కడికక్కడ గోతులకు తోడు.. నదిలోని నీటిని వినియోగించుకునేందుకు గండ్లుకొట్టి వేసుకున్న పైపులతో కట్ట శిథిలావస్థకు చేరింది. శిథిలమైన కరకట్ట ప్రస్తుతం బలహీనంగా మారింది. కట్టపై యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్న ఇసుక టిప్పర్ల నియంత్రణపై, అక్రమంగా పైపులైన్లు వేసుకుంటున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కరకట్ట ప్రమాదకరంగా మారింది. అసలే అంతంతమాత్రంగా ఉన్న కరకట్ట ఇసుక తరలించే వాహనాలతో మరింత అధ్వానంగా మారింది. పెద్దపెద్ద గోతులతో నిండిపోయి ఎక్కడికక్కడ కుంగిపోయింది. పలుచోట్ల భారీగా కరకట్ట కోసుకుపోయింది. 2009 అక్టోబరు 5న తెల్లవారుజామున రేపల్లె మండలంలోని ఓలేరు పల్లెపాలెం వద్ద భారీ గండి పడి వరద నీరు చుట్టుపక్కల గ్రామాలను, పొలాలను ముంచెత్తింది. అప్పటి నుంచి ప్రతిఏటా వరదల సమయంలో ప్రత్యక్షమయ్యే అధికారులు, ప్రజాప్రతినిధులు కట్టను పటిష్ఠం చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారే తప్ప పదేళ్లుగా పట్టించుకోలేదు. ఓ మోస్తరుగా నదిలో నీరు ప్రవహిస్తున్నా అది సమీప గ్రామాలను ముంచెత్తుతోంది. ప్రస్తుతం ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. పైగా బ్యారేజి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని కట్ట వెంబడి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరకట్ట పటిష్ఠతను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన కృష్ణారివర్ అథారిటీ అధికారులు కనీసం కట్టలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. వాహనాల రాకపోకలు, పైపులైన్లు వేసిన ప్రాంతాల్లో ఇప్పటికే కట్ట పూర్తిగా బలహీనపడింది. ఇలాంటి చోట్ల గండ్లు పడే ప్రమాదం పొంచి ఉంది. కిందటేడాది వచ్చినట్లు వరద వస్తే కట్ట మీద నుంచి రాజధానితో పాటు బ్యారేజీ దిగువన ఉన్న గ్రామాల్లోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నది నుంచి ఇసుకను తరలించే భారీ టిప్పర్లు నిత్యం వందల సంఖ్యలో కరకట్టపై రాకపోకలు

(మిగతా 6లో)

సరిహద్దు నుంచి పట్టణంలోకి..!

- దేవినూతలలో జోరుగా ఇసుక తవ్వకాలు
- రాత్రిళ్లు బాపట్ల పట్టణం, గ్రామాలకు తరలింపు


దేవినూతల గ్రామంలో పొలాల్లో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న ఎక్సకవేటర్

బాపట్లరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాపట్ల - చీరాల సరిహద్దు గ్రామం దేవినూతల పంచాయతీలో జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. చీరాల మండల పరిధిలోని ఈ గ్రామ పంట పొలాల్లో పొక్లెయినర్ల ద్వారా ఇసుక తవ్వకాలు చేపట్టి.. ట్రాక్టర్ల ద్వారా బాపట్ల పట్టణం, మండలంలోని పలు గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కట్టుబడి, పూడిక ఇసుకను రాత్రిళ్లు, తెల్లవారు జామున మరుప్రోలువారిపాలెం, మద్దిబోయినవారిపాలెం, ముత్తాయిపాలెం, పిన్నిబోయినవారిపాలెం, బసివిరెడ్డిపాలెం, హనుమాన్‌నగర్, పోతురాజు కొత్తపాలెం, ఆసోదివారిపాలెం, నాగేంద్రపురం గ్రామాలకు చేర్చేస్తున్నారు. బాపట్లకు, చీరాలకు చివరి గ్రామం కావడంతో ఇసుక తవ్వకాలు జరిపినా ఎవరూ ఏమి చేయలేరు అనే ధీమా అక్రమార్కుల్లో మెండుగా కనిపిస్తోంది. బాపట్ల రూరల్ పోలీసులు, మైనింగ్ అధికారులు వీటిపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సేవ, నిజాయితీగా విధులు నిర్వహించాలి

- ప్రొబేషనరి ఎస్‌ఐలకు రేంజ్ ఐజీ త్రిపాఠి సూచన

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, నిజాయితీ, అంకితభావం, సేవా తత్పరతలతో విధులు నిర్వహించాలని ప్రొబేషనరి ఎస్‌ఐలకు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 53 మంది ప్రొబేషనరి ఎస్‌ఐలు మంగళవారం మర్యాదపూర్వకంగా రేంజ్ కార్యాలయంలో ఐజీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండా లన్నారు.

దంచికొట్టిన వాన

అత్యధికంగా పర్చూరులో 59.2 మి.మీ

వెద పొలాలు ముంపు.. అన్నదాతల్లో ఆందోళన

(బాపట్ల, భట్టిప్రోలు, కొల్లూరు, చెరుకుపల్లి, ఆంధ్రజ్యోతి)

మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. మంగళవారం ఉదయం పర్చూరు, అద్దంకిలో కుండపోత వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన కుండపోత వర్షానికి జిల్లా వ్యాప్త సగటు వర్షం 29.25. మి.మీటర్లుగా నమోదైంది. అత్యధికంగా పర్చూరులో 59.2 మి.మీటర్ల


బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెంలో వెదపెట్టిన పొలాలలో నిలిచిన వర్షపునీరు

వర్షపాతం నమోదైంది. కారంచేడు 51.2, బాపట్ల 37.4 మి.మీ. వర్షం కురవగా అత్యల్పంగా భట్టిప్రోలులో 11.4 మి.మీ. వర్షం కురిసింది. పర్చూరులో కురిసిన కుండపోత వర్షం ధాటికి అడుసుమల్లి సమీపం లోని సాకి వాగుకు గండ్లు పడి సమీప పొలాలను ముంచెత్తింది. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని బాపట్ల, కర్లపాలెం, అమర్తలూరు, పిట్టలవానిపాలెం, కొల్లూరు, భట్టిప్రోలు తదితర మండలాల్లో వేలాది ఎకరాలు వెద సాగులో ఉన్నాయి. వెద పద్ధతిలో వరి సాగు చేసిన రైతులకు ఈ వర్షాలు కొంతమేర ఊరట కలిగించాయి. ముందుగా వెదపెట్టిన పొలాల్లో మొలక పైకొచ్చిన పైర్లకు వర్షం వల్ల ఇబ్బంది లేదు. అయితే ఈ వర్షాలు మరో రెండు రోజులు కొనసాగితే నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వెద పొలాలు వర్షపు నీటితో ముంపునకు గురై ఉన్నాయి. ఆలస్యంగా పెట్టిన వెదవిత్తనాలు మురిగిపోయే ప్రమాదం ఉంది. కాల్వల గుండా నీరు వెళ్లే పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో పొలాల్లోని నీటిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే మంగళవారం వరుణుడు శాంతించడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోని బర్లీ పొగాకు రైతులను ఈ వర్షాలు కొంత కలవరపాటుకు గురిచేశాయి. భారీ వర్షాల ధాటికి బేళ్ల కిందకి నీళ్లు వెళ్లాయని తేమ శాతంలో ఇబ్బందులు ఎదురవుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలు అద్దంకి నియోజకవర్గ పరిధిలో మొక్కజొన్న, నువ్వులు లాంటి మెట్టపంటలు సాగు చేసే రైతులకు మేలు చేశాయి. కొన్ని రోజులుగా వర్షం జాడే లేక పోవడంతో వాటి ఎదుగుదల ఆగిపోయింది. ఈ వర్షాలు వాటికి ఊపిరి పోశాయి.

ఉధృతంగా ఆర్‌ఎం డ్రెయిన్

చెరుకుపల్లి మండలంలోని గూడవల్లి ఆర్‌ఎం డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. గూడవల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం వద్ద తూటికాడతో నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఇక్కడ కట్టలు తెగిపోయే పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


పర్చూరు మండల పరిధిలోని సాకి వాగు ఉధృతి

ప్రవర్తనలో.. మార్పు తెచ్చుకోవాలి

- సబ్‌జైలు సందర్శనలో ఖైదీలతో జడ్జి జియావుద్దీన్

రేపల్లె, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు క్షణికావేశానికి లోను కావొద్దని, ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ సూచించారు. మంగళవారం తాలూకా ప్రాంగణంలోని సబ్‌జైలును ఆయన సందర్శించి వసతులను పరిశీలించారు. ఖైదీల గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు న్యాయపరమైన సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలోప్యానల్ అడ్వకేట్ గుమ్మడి కుమార్‌బాబు, జైలు అధికారులు పాల్గొన్నారు.


సబ్‌జైలును సందర్శిస్తున్న గుంటూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్

ఆదర్శవంతమైన జీవితాలే లక్ష్యం

- పీ-4 గ్రామసభలో ఆర్డీవో రామలక్ష్మి

నగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆదర్శ వంతంగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. నగరం పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన పీ- 4 గ్రామసభలో ఆమె ప్రసంగించారు. పంచాయతీ పరిధిలోని 43 బంగారు కుటుంబాల బాధ్యతను ఆరు మార్గదర్శులతో జత చేశామన్నారు. బంగారు కుటుంబాలు స్థితిగతులు గురించి తెలుసుకుని వారికి అందుకు అనుగుణంగా మార్గదర్శకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి


వెస్ట్‌బైపాస్ ఎంట్రన్స్ వద్ద జరుగుతున్న ఆర్చ్ నిర్మాణ పనులు

అనుసంధానం మొదలు

తుది దశకు వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4

- కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు
- రాకపోకలు ఎన్‌హెచ్- 16 సర్వీసు రోడ్డులోకి మళ్లింపు
- సెప్టెంబరు చివరికి అందుబాటులోకి..

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ, గుంటూరు నగరాల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, రాజధాని అమరావతిని అన్ని జిల్లాలకు అనుసంధానించడంలో అత్యంత కీలకమైన వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పక్కనే ఉన్న గొల్లపూడి నుంచి గుంటూరు జిల్లా కాజ టోల్‌గేటు వరకు సాగుతున్న ప్యాకేజీ 4 నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యా యి. ప్రస్తుతం కాజ టోల్ గేట్‌కు సమీపంలో ఈ రోడ్డును ఎన్‌హెచ్-16లో అనుసంధానించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

● కీలకమైన బ్రిడ్జి పూర్తి

విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ప్యాకేజీ- 4 కింద 18.2 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మిస్తున్నారు. ఇందులో కృష్ణానదిపై 3.2 కిలోమీటర్ల మేర నిర్మించే బ్రిడ్జి అత్యంత కీలకమైంది. ఈ బ్రిడ్జి నిర్మాణం దాదాపు మూడు నెలల క్రితమే పూర్తయింది. రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా మే 2న ఈ బ్రిడ్జి అందుబాటులోకి కూడా వచ్చింది. ఈ సమయంలో ఎన్టీఆర్, కృష్ణా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల కూటమి ముఖ్య నేతలకు ఈ బ్రిడ్జి మీద నుంచే రూట్ మ్యాప్ ఇచ్చారు. జూన్ నుంచి బ్రిడ్జి అందుబాటులోకి వస్తుందని భావించినప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో పనులు పెండింగ్ ఉండడంతో బ్రిడ్జి ఇప్పటి వరకు

(మిగతా 6లో)


మంగళగిరి రైల్వే ట్రాక్‌పై పూర్తయిన ఆర్వోబి

గాడితప్పిన సంక్షేమం

సాంఘిక సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణలో నిర్లక్ష్యం


సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

- కళాశాల బాలికల భద్రతపై నీలినీడలు
- అనేక ఘటనలు వెలుగు చూస్తున్నా.. పట్టించుకోని వైనం
- మౌలిక వసతులు, భోజనంపై విద్యార్థినుల అసంతృప్తి

బాపట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పర్యవేక్షణ లోపం, సంక్షేమంపై నిర్లక్ష్యం వెరసి పేద విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. గత ఐదేళ్లగా సాంఘిక సంక్షేమ శాఖలో ఏకపక్ష నిర్ణయాలు ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. నూతన డీడీ చెన్నయ్య ఆధ్వర్యంలో అయినా ఆ శాఖ పనితీరు మెరుగుపడుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల నూతన డీడీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు జారీ చేశారు.

ఐదేళ్లుగా సమీక్షలు నిల్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాశాల, పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వసతి గృహాలున్నాయి. వీటిల్లో దాదాపు పదివేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతూ విద్యాభ్యాసం చేస్తున్నారు. వసతి గృహాలను పరిశీలిస్తే.. ఒకరిద్దరూ మినహా మిగిలిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫలితంగా అనేక సమస్యలు వసతి గృహాల్లో తిష్ట వేశాయి. గుంటూరు నగరంలోనే పరిపాలన గాడి తప్పిందంటే మారుమూల ప్రాంతాల్లోని వసతి గృహాల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సంక్షేమ వసతి గృహాల్లో దారుణాలు

గుంటూరులోని సంక్షేమ శాఖ వసతి గృహంలో వాచ్‌మెన్, ఆయాల ప్రోద్బలంతో కొంతమంది ఆకతాయిలు విద్యార్థుల్ని లైంగికంగా

(మిగతా 6లో)

వైసీపీ వికృత చర్యలను ప్రజలు ఖండించాలి

మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి,జూలై22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని, మంచి చేయని ప్రభుత్వాన్ని ఒకేవిధంగా చూడరాదని, వైసీపీ వికృత చర్యలను అందరూ ఖండించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని వెంపరాలలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి మంత్రి రవికుమార్ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్య క్రమాలను అమలు చేస్తోందన్నారు. ఏడాదికి రూ.33 వేల కోట్ల నిధులను 65 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్‌లుగా అందిస్తోందన్నారు. తల్లికివందనం పథకం ద్వారా ఒక్కరోజే రూ.10 వేల కోట్లను తల్లుల ఖాతాలలో జమచేయ చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ అందిస్తుందన్నారు. వైసీపీ చర్యలతో రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంన్నారు. పింఛన్ డబ్బులు, గ్యాస్ డబ్బులు అందుతున్నాయా లేదా అని వృద్ధులను, మహిళలను మం త్రి రవికుమార్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న తారురోడ్డు పనులు 6 నెలలలో పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో సింగయ్య, ఏపీవో కోటేశ్వరి, డీఈ రమేష్, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, సర్పంచ్ యడ్లపల్లి వెంకాయమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ, మండలపార్టీ అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మానం మురళీమోహన్‌దాస్, పాపసాని నారాయణ, బైరపునేని రామలింగయ్య, మాదాల శ్రీను, నయింపు సురేష్, మాదాల సురేష్, కంచర్ల వెంకటరావు, దివికోలు రాధాకృష్ణ, బైరపునేని సత్యనారాయణ పాల్గొన్నారు.

అద్దంకి,జూలై22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 5 సంవత్సరాల కాలంలో రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదని, కనీసం తట్ట మట్టి కూడా పోసిన పాపాన పోలేదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని శాంతినగర్ నుంచి ఏలేశ్వరవారిపాలెం వరకు రూ.5.10 కోట్ల నాబార్డ్ నిధులతో చేపడుతున్న తారురోడ్డు నిర్మాణం పనులను మంగళవారం వెంపరాల వద్ద మంత్రి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అద్దంకి నియోజకవర్గంలో రూ.110 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 20 సంవత్సరాల క్రితం వేసిన తారురోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో నాబార్డ్ నుండి 5.10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. 6 నెలలో రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. రోడ్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. వైసీపీ చర్యలతో ప్రస్తుతం రోడ్లు వేయాలన్నా కష్టంగా మారిందన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

కూటమి ప్రభుత్వం గ్రామాలకు, మారుమూల పల్లెలకు సైతం పట్టణాలు, నగరాలలో మౌళిక వసతులు కల్పించినట్లే అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వెంపరాలలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.55 లక్షలతో చేపడుతున్న పనులకు మంత్రి రవికుమార్ శంకుస్థాపన చేశారు.

ఉనికి కోసమే వైసీపీ డ్రామాలు

అద్దంకి : వైసీపీ బ్యాచ్ మొత్తం లిక్కర్‌తో పాటు ఇతర స్కామ్‌లలో చిక్కుకు పోయిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని వెంపరాలలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ఉనికి కాపాడుకునేందుకు డ్రామాలాడు తోందన్నారు. వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. వైసీపీ నాయకులు గ్రామాలలోకి వచ్చినప్పుడు ఐదేళ్లలో ఏమి చేశారో అగడడంతో పాటు కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ వైసీపీ నేతల బురదచల్లే ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు.

అవీ..ఇవీ..

శ్రీనివాసాచారికి గుర్తింపు


శ్రీనివాసాచారి

అద్దంకిటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఎన్ఆర్ఐ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేష్ విశ్వ కుంటుంబ హెడ్ ఆఫ్, ఈస్ట్ ముంబై వారి ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అద్దంకికి చెందిన చెన్నుపల్లి శ్రీనివాసచారిని సెంట్రల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ చేతాలి విశాల్ ధర్మశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి మాట్లాడుతు ప్రపంచ వ్యాప్తంగా 195 దేశాలల్లో ఆర్గనైజేషన్‌తో ఉన్న ఈ సంస్థ సనాతన ధర్మం వ్యాప్తి చెందాలనే ఉద్దేశంతో అసోసియేషన్ ఏర్పాటు చేసి ప్రతి రాష్ట్రంలో కమిటిలు ఏర్పాటు చేస్తుందన్నారు. దానిలో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినందుకు డాక్టర్ సత్యప్రకాష్ స్వామి గురుజీకి, పదవి రావాడనికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు చావా రామకృష్ణ, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు వాకా బాల గంగాధర్‌కు, గౌరవ సలహాదారుడు పొన్నకంటి శ్రీనివాసచారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా సనాతన ధర్మాన్ని కాపాడుతు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఇంకొల్లు, జూలై 22,(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులుగా ఇంకొల్లు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన వెనిగండ్ల వెంకటేశ్వర్లును నియమించినట్లు జిల్లా కార్యవర్గం ప్రకటించింది. వెంకటేశ్వర్లు గతంలో రెండు పర్యాయాలు ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షులుగా పని చేశారు. ఇంకొల్లు మండల పార్టీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లును మంగళవారం గొల్లపాలెంలోని ఆయన గృహంలో సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షురాలు నల్లూరి సాహితి, సీనియర్ నాయకులు నల్లూరి కృష్ణయ్య, నాదెండ్ల పార్థసారధి,పెనుమాల రామయ్య,రావి సుధాకర్,వెనిగండ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొని అభినందించారు.

అడవిపాలెంలో 'పొలం పిలుస్తోంది'

సంతమాగులూరు జులై 22(ఆంధ్రజ్యోతి) : వరిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను అదుపులో ఉంచవచ్చని బాపట్ల డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.బాలమురళిధర్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని అడవిపాలెం, వెల్లలచెరువు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంటలపై వచ్చే తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. వరిలో విత్తనశుద్ధికి కార్బండిజమ్ మూడు గ్రాములు, ఒక కిలో వరి విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసి రైతులకు చూపించి అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు అవసరమయ్యే యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో షేక్ సైద, సిబ్బంది భవాని, పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, ఎస్ఎస్‌పీ డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ కామాను శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పంటసాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

పంగులూరు: రైతులు పంటసాగులో ఆధునిక పద్దతులు అవలంబించాలని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని ఆరికట్లవారిపాలెం, ముప్పవరం గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులందరూ పంటహక్కుపత్రం పొందాలని కోరారు. దీనిద్వారా కౌలు రైతులు విత్తనాల సబ్సిడీ, పంట ఉత్పత్తులు అమ్ముకోవడం, పంటనష్ట పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. పొగాకు పంట సాగుచేయవద్దని, అందుకు ప్రత్యామ్నాయంగా జొన్న, మొక్కజొన్న, పప్పు ధాన్యాల పంటలు సాగుచేయాలని కోరారు. కార్యక్రమంలో వీవోవో. గోపీకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు మహిళ యత్నం

● రక్షించిన వన్‌టౌన్ పోలీసులు


అమలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై రాజ్యలక్ష్మి

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో గొడవలు సర్వసాధారణమని బలవన్మరణాలు పరిష్కారం కాదని వన్‌టౌన్ ఎస్సై రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక గంజిపాలెంకు చెందిన అమల కుటుంబంలో నెలకొన్న ఆర్థిక సమస్యల కారణంగా మనస్థాపం చెందింది. ఈనేపధ్యంలోనే వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై బలవన్మరణం చెందేందుకు ప్రయత్నించింది. అయితే సిఐ సుబ్బారావు ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఎస్సై రాజ్యలక్ష్మీ సాంకేతిక పరిజ్ఞానంతో అమలను గుర్తించి, కౌన్సిలింగ్ చేశారు. అనంతరం సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై వెంట ఏఎస్సై సత్యన్నారాయణ ఉన్నారు.

దారి సమస్య కారణంగా వివాదం

పాపాయిపాలెం(చీరాల), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పూర్వికుల నుంచి సంక్రమించిన స్థలానికి రాకపోకల సమస్య కారణంగా పలువురిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వేటపాలెం మండల పరిధిలోని పాపాయిపాలెంకు చెందిన డక్కుమళ్ల రవికుమార్‌కు పూర్వికుల నుంచి కొంత స్థలం సంక్రమించింది. అయితే అందుకు సంబంధించిన దారి విషయంలో పెదనాన్న యిర్మియా, కుమారులు పున్నారావు, నాగేశ్వరరావు దారికి ఆటంకం కలిగించారు. దీంతో రవికుమార్ ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉనికి కోసమే వైసీపీ డ్రామాలు

అద్దంకి, జూలై22(ఆంధ్రజ్యోతి): వైసీపీ బ్యాచ్ మొత్తం లిక్కర్‌తో పాటు ఇతర స్కామ్‌లలో చిక్కుకు పోయిందని విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని వెంపరాలలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమంలో మం త్రి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ఉనికి కాపాడుకునేందుకు డ్రామాలాడుతుందన్నారు. వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు గ్రామాలలోకి వచ్చినప్పుడు ఐదేళ్లలో ఏమిచేశారో అగడడంతో పాటు కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంను వివరిస్తూ వైసీపీ నేతల బురదచల్లే ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ఆషాడ సారె సమర్పణ


ఊరేగింపుగా ఆషాడ సారె తీసుకొని వెళ్తున్న మహిళలు

చినగంజాం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ, గంగమ్మ అమ్మవార్లకు మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఆషాడ సారె కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామంలోని మహిళా భక్తులు తల మీద చీరలు, జాకెట్లు, పసుపు, కుంకుములు, గాజులు, చలిమిడి, పొంగళ్లు, కొబ్బరి కాయులు, అరటి పండ్లు, స్వీట్లును పెట్టుకొని గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా మేళతాళాలు, కనకతప్పెట్లుతో ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాలకు వెళ్లారు. ఆలయ పూజార్లు బ్రహ్మయ్య, హైమారావులు పోలేరమ్మ, గంగమ్మ అమ్మవార్లను విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం అమ్మవార్లకు ఆషాడ సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు జరిపారు. ముందుగా గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారు, పోతురాజు విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. గాజులు, పసుపు కుంకుములు, చలిమిడి, పండ్లను గ్రామంలోని మహిళలకు పంపిణీ చేశారు. గ్రామంలోని పలు సామాజిక వర్గాల పెద్దలు, మహిళల ఆధ్వర్యంలో అమ్మవార్ల సారె కార్యక్రమాన్ని నిర్వహించారు

మార్టూరులోని ఓ నివాసంలో చోరీ


చోరీకి గురైన ఇళ్లు

మార్టూరు, జూలై22 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో కొనిదెనరోడ్డులో అమ్మ ఆశ్రమం సమీపంలోని కొండముది కోటేశ్వరరావుకు చెందిన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం వేకువ జామున దొంగతనానికి పాల్పడ్డారు. గతంలోనే కోటేశ్వరరావు చనిపోగా, ఆయన భార్య కల్యాణి ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఆమె పెద్ద కుమారుడు శివ హైదరాబాదులో ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు గుంటూరులో ఉంటున్నారు. అయితే నాలుగురోజులు క్రితం కల్యాణి తీర్థయాత్రలు నిమిత్తం కాశీ వెళ్లారు. దీంతో ప్రస్తుతం ఇంటిలో ఎవరూ లేకపోవడం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటిలో మొదటి అంతస్తులో నివసిస్తున్న కల్యాణి కుటుంబం వంటగది కిటికీ ఇనుప జల్లెడను తొలగించిన దొంగలు ఇంటిలోకి ప్రవేశించి, బీరువాలోని బట్టలను, వస్తువులను, మాస్టర్ బెడ్‌రూంలో ఉన్న వస్తువులను చెల్లాచెదురుగా చేశారు. అయితే రాత్రి 3 గంటల సమయంలో ఇంటిలో దొంగతనం చేస్తున్న వ్యక్తులలో ఒక వ్యక్తి ఇంటి వరండాలో బయటకురావడం, అతను పైనున్న సీసీ పుటేజీని గమనించి, మరల ఇంటిలోకి వెళ్లిన ఘటన జరిగాయి. ఈ విషయాన్ని హైదరాబాదులో ఉన్న కుమారుడు శివ ఉదయం 6 గంటల సమయంలో సెల్‌ఫోన్‌లో సీసీ పుటేజీలో గుర్తుతెలియని వ్యక్తి కనిపించడంతో, ఈ విషయాన్ని మార్టూరులో బాబాయి రఘుకు ఫోన్‌లో తెలిపారు. దాంతో రఘు దొంగతనం జరిగిన ఇంటిలోకి వెళ్లి, ఇంటిలోపల పరిశీలించి, ఈ విషయాన్ని 100 కు సమాచారం అందించారు. దీంతో స్టేషన్ నుండి పోలీసులు వచ్చి, ఇంటిని పరిశీలించారు. అంతేగాకుండా క్లూస్ టీం బృందాన్ని పిలిపించారు. వారు ఇంటిలో పరిశీలించి,కొన్ని వేలిముద్రలను సేకరించినట్లు తెలిసింది. అయితే ఇంటిలో జరిగిన దొంగతనంలో ఏ వస్తువులు ను దొంగలు తీసుకువెళ్లారో, పోలీసులకు సమాచారం తెలియలేదు. కాశీ నుండి బుధవారం ఉదయానికి కల్యాణి ఇంటికి వస్తుందని, ఆమె వచ్చిన తర్వాత ఇంటిలో ఏ వస్తువులు పోయాయో చూసి, అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తారని రఘు తెలిపారు.

వైభవంగా అమ్మవారి సారె మహోత్సవం

పేరాల(చీరాల), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పేరాలలో వేంచేసియున్న శ్రీభద్రావతి సమేత శ్రీభావనాఋషి దేవస్థానంలో అమ్మవారి సారె మహోత్సవం కమిటి ప్రతినిధులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళ భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు లక్కీడిప్ ద్వారా బహుమతుల అందజేశారు. గుర్రం శ్రీనివాస్, వెంకట సుబ్బారావు, దేవేంద్రం, జివి పున్నారావు పర్యవేక్షించారు.

సెయింట్ ఆన్స్‌లో బెస్ట్ లెక్చరర్ కార్యక్రమం

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఆర్టిరియల్ స్టిఫినెస్‌పై బెస్ట్ లెక్చరర్ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల కార్యదర్శిగా వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ ఫిజియాలజీ ఎస్‌కె చాందిని హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంను ప్రిన్సిపల్ డా.నాగేశ్వరరావు పర్యవేక్షించగా విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాల కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసి శ్రీదుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలని చీరాల కేంద్ర జిల్లా సాధన సమితి ప్రతినిధులు తాడివలస దేవరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా ఏర్పడితే పర్యాటకం, ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన వివరించారు.

బధిరులకు భోజన వసతి

అద్దంకిటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పంగులూరు మండలం కశ్యాపురం గ్రామ మాజీ సర్పంచ్ వెలగతోటి రాములు సంవత్సరికం సందర్భంగా మంగళవారం అద్దంకిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్నం భోజన అందించారు. ముందుగా రాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, ఐ క్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, రాములు కుటుంబ సభ్యులు చిన్న వెంకటరావు, రాజేష్ ఖన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

పర్చూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. జీరో పావర్టీ పీ-4 కార్యక్రమంపై పర్చూరు మండలం నూతలపాడు గ్రామం పంచాయితీ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- 2047 దర్శనిక కార్యక్రమం క్రింద ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా కార్యక్రమాన్ని తీసుకురావటం జరిగిందన్నారు. దీనిలో విరాళం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న సంపన్న వ్యక్తులను మార్గదర్శకులు అంటారని, నిరుపేద లబ్ధిదారులను బంగారు కుంటుంబంగా గుర్తిస్తారనని తెలిపారు. మార్గదర్శి కుటుంబాలు చూపేబాటలో బంగారు కుటుంబాలు అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఈవోఆర్‌డీ కె.సత్యన్నారాయణ, వెలుగు ఏపీఎం రామకృష్ణ, సర్పంచ్ చిన్నా, రెవెన్యూ, సచివాలయ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎంపిక

చినగంజాం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు ఉలిచి రాజేష్ అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏన్నిక ఏకగ్రీవంగా జరిగింది.ఉపాధ్యక్షులుగా అన్నేపోగు అప్పలనాయుడు, కొల్లూరి మరియమ్మ, కందుకూరి పద్మ, వేజండ్ల శ్రీనివాసరావు తదితరులు కమిటీలో ఉన్నారు.

గాడితప్పిన సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

వేధించిన ఘటనలున్నాయి.

- నగరంలోని కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఓ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి, బిడ్డకు జన్మనిచ్చినా.. గుర్తించలేని దుస్థితిలో పర్యవేక్షణ ఉంది.

- జూట్ మిల్ సమీపంలోని మరో కళాశాల వసతి గృహంలోని ఒక విద్యార్థినిని వైసీపీ పాలనలో ఓ నాయకుడి అనుచరులు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశారు. నగరంలోని రాజీవ్ స్వగృహ నివాసాల్లో ఉంచి రెండు రోజులు వేధించారు.

- నగరం నడిబొడ్డున ఒక వసతి గృహంలో వంట సరిగా లేక.. విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్‌కి వెళ్లి భోజనం చేశారు. ఈ విషయం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ గతం డీడీకి నివేదించినా.. పట్టించుకోలేదు.

- సాంఘిక సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నుంచి కొంతమంది అధికారులు నెలనెలా మామూలు వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. సిబ్బంది పనిచేయకపోయినా.. వారికి జీతాలు ఇస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

- మరోవైపు హెచ్‌డబ్ల్యూలు పెట్టే బిల్లుల్లో కూడా కమిషన్లు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి కొంతమంది అధికారులు ప్రొటోకాల్ పేరుతో భారీ మొత్తంలో వసూళ్లు చేసిన ఘటనలు ఉన్నాయి.

- కొంతమంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై విజిలెన్స్ విచారణ ఉన్న పట్టించుకోవడం లేదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపడం లేదని విమర్శలున్నాయి.

- తాజాగా నగరంలోని ఓ కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయం గోప్యంగా ఉంచి సదరు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇలా సాంఘిక సంక్షేమ శాఖ గత అధికారుల హయాంలో గాడి తప్పింది. నూతనంగా వచ్చిన అధికారి అయిన శాఖను గాడిలో పెడతారా? లేదా అని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

సమ్మె విరమించిన ఇంజనీరింగ్ కార్మికులు


స్వీట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకిటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి పదవ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో ప్రభుత్వం కార్మిక నాయకులతో చర్చించి కార్మికులకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు సీఐటీయూ మండల నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సమ్మెలో ఉన్న కార్మికులతో మాట్లాడి సమ్మెను విరమింపజేశారు. కార్మికులకు కమిషనర్ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కావూరి రఘుచంద్, ఇంజనీరింగ్ విభాగం వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్, సామ్యూల్, వడివేలు, మారుతి, మార్కు తదితరులు ఉన్నారు.

కార్మిక నేత నాగేశ్వరరావు హఠాన్మరణం


నాగేశ్వరరావు (ఫైల్)

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఏఐటియుసి చీరాల నాయకులు, దేవతోటి నాగేశ్వరరావు(56) మంగళవారం ఉదయం హఠాన్మరణం చెందారు. దాదాపుగా 40 సంవత్సరాల పాటు కార్మికుల కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. నాలుగు నెలల క్రితం ఏఐటీయూసీలో చేరారు. ఈక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, ప్రకాశం జిల్లా కార్యవర్గ సభ్యులు చీకటి శ్రీను, స్థానిక నాయకులు ఎన్ బాబురావు, కొండయ్య, పలువురు ఉద్యోగులు, కార్మికులు పాల్గొని నివాళులు అర్పించారు. బుధవారం నాగేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కరకట్టకు.. కోతలు

(5వ పేజీ తరువాయి)


ఓలేరుపల్లెపాలెంవద్ద కుంగిన కరకట్ట

సాగిస్తున్నాయి. దీంతో రాజధాని గ్రామాలైన లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెంలో కరకట్ట పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత వైసీపీ హయాంలో అప్పటి ఎంపీ నందిగం సురేశ్ నేతృత్వంలో టిప్పర్ల రాకపోకలతో కరకట్ట పూర్తిగా ధ్వంసమైపోయింది. బ్యారేజి దిగువున పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, కనగాలవారిపాలెం సమీపంలో పైప్‌లైన్లతో ప్రమాద భరితంగా మారింది. దీంతో మైనేనివారిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, లక్ష్మీపురం, అడవిపాలెం గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కట్టను పటిష్ఠం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకోలేదంటున్నారు. కరకట్టపై పెట్రోలింగ్ చెయ్యాల్సిన అధికారులు స్థానికంగా ఉండకుండా గుంటూరులో నివాసం ఉంటున్నారు. దీంతో కట్టపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గత ఏడాది వరదల సమయంలో కృష్ణారివర్ ఏఈ ప్రత్యక్షమై హడావుడి చేశారు. ఆ తర్వాత ఈ పదినెలల్లో ఒక్కసారి కూడా కట్టను పరిశీలించిన దాఖలాలు లేవు.

అనుసంధానం మొదలు

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి రాలేదు.

● మందడం, కృష్ణాయపాలెం వద్ద జాప్యం

మందడం టోల్‌గేట్ నిర్మాణంతో పాటు ఇక్కడే నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు ఇంకా కొంతమేర పెండింగులో ఉన్నాయి. దీంతోపాటు కృష్ణయ్యపాలెం, కురగల్లు సమీపంలో ఈ-11 రోడ్డు సమీపంలో కొండవీటివాగు రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు కూడా జాప్యానికి మరో కారణం. ఈ పనులు కూడా ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. కాగా ఈ-10 రోడ్డు వద్ద అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు గుంటూరు- విజయవాడ రైల్వే లైనుపై మంగళగిరి, చినకాకాని సమీపంలో నిర్మించే ఆర్వోబీ కూడా పూర్తయింది. సేఫ్టీ వాల్ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.

● కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు

కాజ- చినకాకాని సరిహద్దుల్లో వెస్ట్ బైపాస్ అనుసంధానించడం కోసం ఎన్‌హెచ్- 16 మీద రాకపోకలను సర్వీసు రోడ్డులోకి మళ్లించారు. కాజ జంక్షన్ వద్ద వెస్ట్ బైపాస్ ఎంట్రన్స్‌లో పెద్ద ఆర్చి నిర్మాణాన్ని ఏర్పాటు చేసి సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. చిలకలూరిపేట వద్ద నిర్మించిన బైపాస్‌ను ఎన్‌హెచ్- 16లో అను సంధానించిన విధంగానే కాజ వద్ద కూడా రెండు రోడ్ల అనుసం ధానం ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. కాగా సెప్టెంబరు చివరి నాటికి వెస్ట్ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని వారు స్పష్టం చేశారు.

అవీ..ఇవీ..

విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేత

బల్లికురవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటుపల్లి ప్రాథ మిక పాఠశాలలో రోటరీ క్లబ్ అఫ్ మార్టూరు ఆధ్వర్యంలో మంగళ వారం విద్యార్థులకు అభ్యసన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న 43 మంది విద్యార్థుల చదువుకు అవసరమైన పలు రకాల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, గోనుగొంట్ల రవికుమార్, తాళ్లూరి సాంబశివరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం ఏడుకొండలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పుస్తకాలను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

బంగారు కుటుంబాలకు అర్హులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీ-4 కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఇంకా ఎవరైన బంగారు కుటుంబాల కింద నమోదు కాని వారు ఉంటే వెంటనే నమోదు చేసి వారికి మార్గదర్శకులను ఏంపిక చేయాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. మంగళవారం మండలంలోని వేమవరం గ్రామంలో పీ-4 కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ అర్హత లేని వారు ఎవరైన బంగారు కుటుంబాల కింద నమోదైతే వెంటనే వారి పేర్లను తొలగించాలన్నారు. రానున్న రోజుల్లో బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా ఉన్న వారి నుంచి చేయుత అందించే చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, వీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వేకు సంబంధించి గ్రామంలో బంగారు కుటుంబాల గుర్తింపు, ఆ కుటుంబాల అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో జరిగిన పీ4 సర్వేపై జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోర్లంట పద్మావతి, ఎంపీటీసీ కామేపల్లి నాగ్రేందమ్మ, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల విలువను గుర్తించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎన్ఎంపీబీ అధికారుల బృందం

అద్దంకిటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈతరం విద్యార్థులు ఔషద మొక్కల విలువలను గుర్తించాలని, నేషనల్ మెడిసిన్ ప్లాంట్ బోర్డు (ఎన్ఎంపీబీ) ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ యూవీఎం చంద్రశేఖర్, కన్సల్టెంట్ పి.చిరంజీవిలు అన్నారు. బుధవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు జెడ్పీహెచ్ఎస్‌లో పెంచుతున్న హెర్బల్ గార్డెన్‌లను పరిశీలించారు. అందులో పెంచుతున్న వివిధ రకాల ఔషద మొక్కలను పరిశీలించి వాటి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. హెర్బల్ గార్డెన్‌లు విద్యార్థులలో ప్రకృతి, ఆ రోగ్యంపై ప్రేమను పెంచుతాయన్నారు. ఇది భవిష్యత్తులో సమాజానికి ఆరోగ్యాన్ని అందించే మార్గంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏ.శ్రీనివాసరావు, ఐఈఈఆర్డీ ప్రాజెక్టు సమన్వయకర్త బత్తుల కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకిలో డ్రోన్‌తో పోలీసుల నిఘా

అద్దంకి, జూలై22 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో పోలీసులు డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. ప్రదానంగా బ్యాంకులు, ఆర్టీసీ బస్టాండ్, నామ్ రోడ్డు లో రద్ధీ ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాలలో డ్రోన్‌తో పర్యవేక్షిస్తూ, నిఘా ఉంచినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అనుమాన స్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడం, దొంగతనాల నివారణకు, ట్రాఫిక్ రద్దీని గుర్తించేందుకు నిఘా చేపట్టడం జరుగుతుందన్నారు.



డ్రోన్ నిఘాలో ఆర్టీసీ బస్టాండ్

డ్రైవర్‌కు తీవ్రగాయాలు

మేదరమెట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి వెంబడి గుడిపాడు- కొరిశపాడు మధ్యలో గాజు ఫ్యాక్టరీ వద్ద రోడ్డు అంచులో ఆగి ఉన్న లారీని ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం బెంగుళూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఐసర్ లారీ డ్రైవర్ రోడ్డు అంచులో వాహనాన్ని నిలిపాడు. అదేరోడ్డులో వస్తున్న ట్రాలీ ఆటో డ్రైవర్ గులాం రోడ్డు అంచులో అగి ఉన్న లారీని ఢీ కొన్నాడు. తమిళనాడు రాష్ట్రం నాగూర్‌కోయి గ్రామానికి చెందిన డ్రైవర్ గులాం లారీని ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రాయపడిన డ్రైవర్ గులాంను అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



ఆగి ఉన్న లారీని ఢీ కొన్న ట్రాలీ ఆటో

నాగండ్లలో అవయవదానం

ఇంకొల్లు,జూలై 22,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్లలో అవయవదానం, నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన కోట నాగేశ్వరరావు(64) మరణాంతరం తమ దేహాన్ని దానం చేయాలని కుటుంబసభ్యులకు చెప్పారు. దీంతో ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో అవయవాలను గుంటూరు కాటూరి మెడికల్ కళాశాలకు, నేత్రాలను శంకర్ కంటి వైద్యశాలకు దానం చేశారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు లక్ష్మీకుమారి, శ్రీనివాసరావు, వంశీకృష్ణ, భాగ్యలక్ష్మీ, సుబ్రహ్మణ్యంలను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, అడ్వకేట్ రావి సత్యనారాయణ, వీరగంధం ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొడదాం

- ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య
- వ్యాపారులు, పురప్రముఖులతో సమావేశం
- పీ-4కు మార్గదర్శకులు ముందుకురావడంపై హర్షం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

చీరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టి, గ్రీన్ చీరాలగా తీర్చి దిద్దుదామని ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ సమావేశం హాలులో చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి పట్టణం లోని వ్యాపారులు, పురప్రముఖులతో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగి మూగజీవాలు అసువులు బాస్తుండడంతో పాటు, చాపకింద నీరులా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నట్లు వివరించారు. మరో రెండు మాసాల్లో పూర్తి స్థాయిలో నిషేదాజ్ఞలు అమల్లోకి వస్తాయన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. అలాగే పీ-4కు మార్గదర్శకులుగా స్వచ్ఛందంగా దాతలు ముందుకు రావడంతో ఎమ్మెల్యే వారిని ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు కొద్ది రోజులుగా సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

చీరాల : అది వైసీపీ పార్టీ చీప్ పార్టీ అని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. వైసీపీ మాజీ మంత్రి రోజా అధికార పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కొండయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 సీట్లుకు పరిమితమైన ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదన్నారు. తప్పులు తెలుసుకుని ప్రజల నమ్మకాన్ని చూరగొనాల్సింది పోయి, మహిళ నేతలతో జగన్‌రెడ్డి అసభ్యకరంగా మాట్లాడించడం ఆ పార్టీకి సిగ్గుచేటన్నారు. సాక్షాత్తు రక్తం పంచుకొని పుట్టిన సోదరిని తల్లిని బయటకు నెట్టేసిన జగన్‌ది నీచపు సంస్కృతి అని వ్యాఖ్యానించారు. రోజా నోరు అదుపు చేసుకోవాలని సూచించారు. రోజా తన గత చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. అలాగే కూటమి మహిళ నేతలు గడియార స్తంభం కూడలిలో రోజా చిత్ర పటాలను దహనం చేశారు.

వరద ఉధృతికి 'సాగి' వాగుకు గండ్లు

పర్చూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎగువన కురిసిన వర్షాలకు, సాగి వాగులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని ఏళ్లుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో మరమ్మతులకు నోచుకోక పోవడంతో ఈ వాగులో చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. వరద ఉధృతంగా రావడం, నీటి సరఫరా సక్రమంగా జరగక పోవడంతో సాగి వాగు కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో వరద నీరు సమీప పొలాల్లోకి ప్రవహిస్తుండడంతో ఎటు చూసినా సముద్రాన్ని తలపించేలా పంటపొలాలు ఉన్నాయి. ప్రస్తుతం పైర్లు సాగుచేయక పోవడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నా, వరద ఉధృతికి పొలాలు కోతకు గురవుతున్నాయని, రైతుల ఆందోళన చెందుతున్నారు. సాగి వాగు అభివృద్ధిలో నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల ప్రారంభంలోనే వాగు పరిస్థితి ఇలా ఉంటే, పైర్లు సాగుచేసిన తర్వాత పరిస్థితి పునరావృతం అయితే పంటలు కోల్పోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సమీప గ్రామాలు కూడా ముంపుకు గురికావాల్సి వస్తుందని ఆ యా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని యద్దనపూడి మండలంలో మొదలయ్యే సాగి వాగు పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం, అడుసుమల్లి, రమణాయపాలెం, మీదుగా చెరుకూరును కలుపుకొని బాపట్ల సమీపంలో సముద్రంలో కలుస్తుంది. వాగు పరిస గ్రామాల్లో వేల ఎకరాలకు వరద ప్రమాదం ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి తక్షణ మరమ్మతు లకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వేసవిలో చేపట్టాల్సిన పనులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే తమకు ఇలాంటి పరిస్థితి దాపురించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత డ్రైనేజ్ అధికారులు సాగి వాగు అభివృద్ధితోపాటు, గండ్లనుపూడ్చి వరద ముంపుకు పంట పొలాలు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆదిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.



ఉధృతంగా ప్రవహిస్తున్న సాగివాగు

అధికారుల నిర్లక్ష్యం వల్లే పరిస్థితి ఇలా

సాగు వాగుకు పలుచోట్ల గండ్లు పడి వేల ఎకరాల్లో పంటలు ముంపుకు గురిఅయ్యే పరిస్థితి నెలకొన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్లే వాగు అభివృద్ధికి నోచుకోలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే వేల ఎకరాలు పంట పొలాలు ముంపుకు గురికావటంతోపాటు, ఆయా గ్రామాలకు కూడా వదర నీటి ముంపు వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలి.

కారుమంచి పాపారావు

సహకార రంగ అభివృద్ధిలో సొసైటీలదే కీలక పాత్ర

మేదరమెట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): సహకార రంగం అభివృద్ధిలో సొసైటీలదే కీలక పాత్ర అని ప్రకాశం జిల్లా పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య అన్నారు. మంగళవారం రావినూతల వచ్చిన సీతారామయ్య ముందుగా సెంట్రల్ బ్యాంక్ శాఖను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం రాష్ట్రంలోనే గుర్తింపు కలిగిన రావినూతల సొసైటిని ఆయన పరిశీలించారు. సోసైటి చైర్మన్ మొప్పర్తి వెంకట్రావు సోసైటీలో జరుగుతున్న ఎరువుల వ్యాపారం, రేషన్ దుకాణం, బట్టల దుకాణం గురించి వివరించడంతో పాటు సొసైటీ పూర్వ చరిత్రను వివరించారు. ఎన్.టీ.రామారావు ముఖ్యమంత్రిగా రావినూతల నూతన సొసైటి భవనాన్ని ప్రారంభించడంతో పాటు కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించారని సీతారామయ్యకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆయనకు చూపించారు. రైతులకు అ వసరమైన పంటరుణాలను మంజూరు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధికి సహకరించినట్లు అవుతుందన్నారు. సొసైటిలలో రైతులు ఎక్కువ డిపాజిట్‌లు చేయాలని, రావినూతల రైతులను జిల్లాలోని రైతులందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ రావినూతల మేనేజర్ శ్రీనివాసరావు, సొసైటీ సీఈవో నవనీ, సొసైటి కమిటి సభ్యులు చేబ్రోలు నాగేశ్వరరావు, నాదెండ్ల తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ సీతారామయ్య

బల్లికురవలో వీధిశునకాల స్వైర విహారం

బల్లికురవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీధి శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. వీటిని చూసిన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రతిరోజు పాఠశాలలు కళాశాలలకు వచ్చే విద్యార్థులైతే ఈ శునకాలను చూసి అవి వెళ్లే వరకు వేచి ఉంటున్నారు. వారం రోజుల నుంచి వీధి శునకాల సంఖ్య బాగా పెరిగిందని ఎదో గ్రామం నుంచి మండల కేంద్రానికి శునకాలు వచ్చాయని ప్రజలు అంటున్నారు. అధికారులు వెంటనే ఈ వీధి శునకాలను పట్టించాలని ప్రజలు కోరుతున్నారు. బల్లికురవ మండల కేంద్రం నాలుగు రోడ్ల జంక్షన్‌లో వీధి శునకాలు ప్రజలను భయపెడుతున్నాయి. వీధుల వెంట వరుసగా శునకాలు వస్తుంటే ప్రజలు భయం భయంగా వాహనాలను నడుపుతున్నారు. శునకాలను దాటే వరకు నెమ్మదిగా భయపడుతు వెళుతున్నారు. రాత్రుళ్ల అయితే వాహనాల వెంట శునకాలు పడుతున్నాయని దీంతో ప్రమాదాలు జరుగు తున్నాయని ప్రయాణికులు అంటున్నారు. అధికారులు వెంటనే మండల కేంద్రంతో పాటు మిగిలిన గ్రామాలలో కూడా ప్రజలకు ఇబ్బందిగా ఉన్న వీధి శునకాలను పట్టించి అడవులలో వదిలి పెట్టే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బల్లికురవలో రోడ్డుపై ఉన్న వీధికుక్కలు

పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగుచేసుకోవాలి

అద్దంకిటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయవద్దని, రైతులు ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలను సాగుచేయాలని ఏడీఏ ఎఫ్రాయం సూచించారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగుచేస్తున్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతు ప్రస్తుతం పండించిన పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, తేమ శాతం 20లోపు ఉండాలన్నారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ 23వ తేదీతో అన్నదాత సుఖీభవ పథకం ఈక్రాప్ నమోదు చేసుకునే అవకాశం పూర్తవుతుందన్నారు. అర్హులైన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు ఉచితంగా కందులు, మినుములు అందిస్తున్నామని సాగు చేసే రైతులు వినియో గించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి ఎస్. దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు దినేష్ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ ఎఫ్రాయం

బీమా నమోదుకు 31 వరకు గడువు

యద్దనపూడి, (మార్టూరు) : ప్రత్తి, మిరప, కంది, మినుము పంటలు సాగు చేసే రైతులు పంటల భీమాలో నమోదు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ తుదిగడువు అని పర్చూరు ఏడీఏ జి.ప్రవీణ అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని చిమటావారిపాలెం, వింజనంపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ ప్రవీణ మాట్లాడుతూ అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రానికి పొగాకును తీసుకువెళ్లే రైతులు పాటించవలసిన నిబంధనలను రైతులకు తెలిపారు.

జేజీ- 11 రకం శనగల ధరల్లో కదలిక

ఇంకొల్లు, జూలై 22,(ఆంధ్రజ్యోతి) : జేజీ-11 రకం ఎర్రశనగల ధరలో కదలిక వచ్చింది. ఈ ఏడాది పంట చేతికందిన సమయం నుంచి క్వింటా జేజీ-11 రకం శనగలు రూ.5600 ఉంది. వారం రోజుల కిందట వరకు క్వింటా రూ.5800 మధ్య మాత్రమే ఉంది. ఈ వారం రోజులలో శనగల ధరలో కదలిక వచ్చింది. మంగళవారం క్వింటా రూ. 6300 వరకు పలికిందని వ్యాపార వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జేజీ-11 రకం శనగల సాగు తక్కువగా ఉండడంతో డిమాండు వచ్చిందని భావిస్తున్నారు. దీంతో శనగరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కాక్-2(తెల్లశనగలు)ధర, జెజె-11 శనగల ధర ఒక్కటే ఉండడం విశేషం. జెజీ -11 కంటే తెల్ల శనగలు కాక్-2 రకం ఏటా క్వింటాకు రెండు నుంచి మూడు వేలు అధికం ఉంటుంది. ప్రస్తుతం రెండు రకాలు ఒకే ధర పలుకుతున్నాయి. జెజీ -11 రకం శనగల నిల్వలు తక్కువగా ఉండడంతో ఈ ఏడాది మంచి ధర రావచ్చునని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏబీసీ కాలువపై పాత వంతెన తొలగింపు

- కొత్త వంతెన ఏర్పాటు చేసే వరకు భారీ వాహనాల రాకపోకలు బంద్



పాత వంతెనను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లాపల్లి గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కాలువపై శిథిలావస్థకు చేరిన పురాతన వంతెనను తొలగించే పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పాతవంతెన స్థానంలో కొత్త హైలెవల్ వంతెన ఏర్పాటు అయ్యే వరకు బల్లికురవ అద్దంకి రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఈ రోడ్డులో చిన్న వాహనాలు వెళ్లేలా ఏబీసీ కాలువపై డైవర్షన్ ఏర్పాటు చేశారు. గ్రానైట్ ముడి రాయి లారీలు మాత్రం ఈ దారిలో వెళ్లటం కష్టమని అధికారులు తెలిపారు. భారీ వాహనాలకు ప్రవేశం లేదని బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. నూతన హైలెవల్ వంతెన నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో రూ. 2 కోట్ల నిధులు మంజురు అయ్యాయి. ఈ నిధులతో రెండు మాసాల వ్యవధిలో నూతన వంతెన పనులు పూర్తయ్యేలా పనులు శర వేగంగా చేపడుతున్నారు. 1967వ సంవత్సరంలో ఏబీసీ కాలువపై ఏర్పాటు చేసి వంతెన ఇప్పటి వరకు ఎంతో నాణ్యతగా ఉంది. దీని వలన వంద టన్నుల బరువు ఉన్న గ్రానైట్ రాళ్లను ఈ దారి వెంబడి తరలించిన ఏమీ కాలేదు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న వంతెన కూడా నాణ్యత ప్రమాణాల మేర నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కళాకారిణి కుటుంబానికి ఆర్థికసాయం

అద్దంకిటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గాత్ర, వాద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మృతి చెందిన కళాకారిణి కుటుంబానికి ఆర్థికసాయాన్ని బుధ వారం అందజేశారు. అద్దంకి పట్టణంలోని పాతదామావారిపాలెంకు చెందిన గాయని, కళకారిణి పఠాన్ ఆషా (50) మంగళవారం మృతి చెందింది. ఆమె గాత్ర, వాద్య కళాకారుల సంక్షేమ సంఘం సభ్యురాలుగా ఉన్నారు. పఠాన్ ఆషా మృతదేహాన్ని సంఘ సభ్యులు బుధవారం సందర్శించి నివాళ్లులర్పించారు. ఆమె కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జి. శేషగిరిరావు, తదితరులు ఉన్నారు.



సాయాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

మృతుని ఆచూకీ లభ్యం

మార్టూరు, జూలై22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొట్టిపాటి నగర్ సమీపంలో మృతిచెందిన వ్యక్తి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రంజన్ బెహ్రా(36)గా గుర్తించినట్లు ఎస్ఐ సైదా మంగళవారం తెలిపారు. ఆదివారం రాత్రి గొట్టిపాటి నగర్ సమీపంలో మద్యంమత్తులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. అయితే పోలీసులు విచారించగా, మృతుడు మండల పరిధిలోని జొన్నతాళి కూడలి సమీపంలోని అమరావతి నూలుమిల్లులో ఐదేళ్లగా కార్మికునిగా పని చేస్తున్నారు. ఆయన భార్య మమతాబెహ్రా, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే ఆదివారం రాత్రి భార్యకు మందులు తీసుకురావడానికి మార్టూరు వచ్చిన మృతుడు మద్యం బాటిళ్లతో గొట్టిపాటి నగర్ వైపు వెళ్లినట్లు పోలీసుల విచారణలో తెలిసిందన్నారు. మృతునికి రెండేళ్లనుండి మూర్ఛ వ్యాధి ఉందని, ఈ కారణంగా మద్యం మత్తులో ఉన్న అతను మూర్ఛవ్యాధి తో మృతిచెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మంగళవారం వీఆర్వో కే.మోహనరావు ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. తదుపరి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించగా, వారు మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో ఒడిస్సాకు తీసుకువెళ్లినట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

ఉపాధి హామీ పనికల్పించండి సార్

సంతమాగులూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనిచేసిన తమకు బిల్లులను మంజూరే చేయడం లేదని, జాబ్‌కార్డులు ఉన్నవారికి పనులు కల్పించడం లేదని సంతమాగులూరు మండలంలోని వెల్లల చెరువు గ్రామ ఉపాధి హామీ కూలీలు మంగళవారం ఎంపీడీవో జ్యోతిర్మయిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు పనులు తాలూకా బిల్లు రాలేదని చల్లగిరి శ్రీనివాసరావు అనే వ్యక్తి ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చెన్నంనేని ఏడుకొండలు కూడా తనకు నవంబర్, డిసెంబర్ నెలలకు నగదు జమ కాలేదని చెప్పారు. అంతేకాకుండా ఫీల్డ్ అసిస్టెంట్ రూ200లను తమ వద్ద తీసుకున్నట్లు ఆరోపించారు. ఈ ఇద్దరితో పాటు రావి రాజేంద్ర, చేరెడ్డి శివరామకోటేశ్వరరావులు తమకు జాబ్ కార్డులు ఉన్నప్పటికీ పనులు కల్పించడం లేదని వాపోయారు. పనులకు రానివాళ్లకు మస్టర్లు వేసి, బిల్లులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గతంలోనూ వెల్లలచెరువులో ఉపాధి పనులపై ఫిర్యాదులు వచ్చాయని, విచారణ నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని చెప్పారు. వారి ఆదేశాలు మేరకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ కూలీలు

విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో దుస్తుల దుకాణం దగ్ధం

మేదరమెట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనపాలెం చెక్‌పోస్టు వద్ద నాగులుప్పాలపాడు రోడ్డులోని ట్రైలరింగ్, బట్టల దుకాణం విద్యుత్ షాట్ సర్క్యూట్ వలన మంటలు చెలరేగాయి. మంగళవారం వేకువజామున శ్రీ బాలాజీ ట్రైలరింగ్ షాపులో విద్యుత్ షాట్ సర్క్యూట్ వలన దుకాణంలో ఉన్న బట్టలు, మిషన్‌లు ఇతర సామాగ్రి దగ్ధమైనట్లు దుకాణం యజమాని ఈమని మాధవి తెలిపారు. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిలినట్లు వాపోయారు. అద్దంకి నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను అదపు చేశారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి


పంగులూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో గేదె మృతిచెందిన ఘటన మంగళవారం అలవలపాడు గ్రామంలో చోటుచేసుకొంది. విద్యుత్ ప్రసరించే తీగలు తగిలి అలవల అనంతారెడ్డికి చెందిన గేదె మృతిచెందింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని రైతు అనంతారెడ్డి తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన రక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలని గ్రామస్థులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు.

రేణంగివరం పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

పంగులూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణంగివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అజిత్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ నూతన కంప్యూటర్ బహూకరించారు. రేణంగివరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుండి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. నూతనంగా ఏర్పడిన ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ సమకూర్చిన అజిత్‌ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణకు హెచ్.యం. సందిరెడ్డి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గింజుపల్లి శ్రీనివాసరావు, రావి చంద్రశేఖర్, ఆనందరావు, సునంద తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్‌ను అందజేస్తున్న వీరనారాయణ




సైదాపురం పూర్వపు ఎంపీడీవోపై వేటు

సైదాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం పూర్వపు ఎంపీడీవో పి శివకుమార్‌ను సస్పెండ్ చేస్తూ జడ్పీ సీఈవో మోహన్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కోట ఎంపీడీవో కార్యాయలంలో ఏవోగా పని చేస్తున్న శివకుమార్ సైదాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది నుంచి నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారించిన ఉన్నతాధికారులు వాస్తవమని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



సోమశిల డ్యాం దిగువున దెబ్బతిన్న అప్రాన్ (ఫైల్)





సమస్యలు అనేకం..
చూపాలి పరిష్కారం!

- అభివృద్ధిలో పుంజుకోని వేగం
- రకరకాల సమస్యలతో సతమతం
- నేడు జిల్లా రివ్యూ కమిటీ సమావేశం

నెల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చిన్న పనికి కూడా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. రెవెన్యూ సమస్యలకు ఒకపట్టాన దొరకని పరిష్కారం.. మరోవైపు అభివృద్ధి పనుల్లో ఆశించినంతగా కనిపించని పురోగతి. నిధులు, భూసేకరణ వంటి రకరకాల సమస్యలతో పుంజుకోని వేగం.. ఇంకోవైపు నెల్లూరులో ఆందోళన కలిగిస్తున్న రౌడీయిజం.. ఇవీ క్లుప్తంగా జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు. వీటన్నిటిపై చర్చించేందుకు జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశం బుధవారం జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలతోపాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభం కానుంది. ప్రధానమైన సమస్యలతోపాటు కీలక శాఖలపై ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. ఈ మేరకు అన్ని శాఖలకు ఉత్తర్వులు అందాయి. పూర్తిస్థాయి వివరాలు, నివేదికలతో డీఆర్సీకి హాజరుకావాలంటూ కలెక్టర్ ఆనంద్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఈ ఏడాది తొలిసారిగా డీఆర్సీ సమావేశం జరుగుతుండగా, ఇన్‌చార్జి మంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ఒకేచోట కూర్చోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గత డీఆర్సీ సమావేశంలో చర్చించిన పలు కీలక సమస్యల్లో కొన్ని పరిష్కారమయ్యాయి. అందులో ఆమంచర్ల ఏపీఐఐసీ భూముల సమస్య ఒకటి. ఇప్పుడు కూడా అదే విధంగా ప్రధాన అంశాలపై ఎటువంటి సమీక్ష జరపుతారన్నది జిల్లావాసుల్లో ఆసక్తి నెలకొంది.

సమీక్షించాల్సిన అంశాలెన్నో..

- జిల్లాకు జీవనాడి వంటి సోమశిల జలాశయం అప్రాన్ నిర్మాణంలో అంతులేని జాప్యం కొనసాగుతోంది. రానున్న వర్షాకాలంలోపు అయినా పనులు పూర్తవుతాయో లేదో చెప్పలేని పరిస్థితి. బిల్లుల సమస్యతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. అలానే సోమశిల హైలెవల్ కెనాల్ రెండు దశల పనుల్లో కూడా ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఇక్కడ భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది.



- నెల్లూరు, సంగం బ్యారేజీల నిర్మాణానికి రూ.500 కోట్లకుపైగా వెచ్చించారు. ఈ రెండు బ్యారేజీలకు కాంట్రాక్టర్ల నిర్వహణ పీరియడ్ కూడా ముగిసింది. దీంతో ఈ బ్యారేజీలు ఇప్పుడు ఇరిగేషన్ అధికారుల నిర్వహణలోకి వచ్చేశాయి. కానీ ఇక్కడ టెక్నికల్, నాన్-టెక్నికల్ సిబ్బంది లేరు. ఆఖరుకు గేట్లు ఆపరేట్ చేసేందుకు కూడా సిబ్బంది లేకపోవడం గమనార్హం. సిబ్బంది నియామకానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు.

లింగసముద్రం : విస్తరణకు నోచుకోని రాళ్లపాడు ఎడమ కాలువ

- బండేపల్లి-డేగపూడి కాలువ నిర్మాణానికి పట్టిన గ్రహణం వీడటం లేదు. 25 వేల ఎకరాల ఆయకట్టు రైతులు ఈ కాలువ ఎప్పుడు పూర్తవుతుందా.. అని కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురుచూస్తున్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభించగా.. వైసీపీ అధికారంలోకి రాగానే పనులు నిలిపేశారు. అయితే ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంత వరకూ పనులు మొదలు కాలేదు.

రాళ్లపాడు ఎడమ కాలువ విస్తరణ పనులకు మోక్షం లభించడం లేదు. ఏళ్ల తరబడి రైతులు విజ్ఞాపనలు చేస్తున్నా ఈ పనులు పట్టాలెక్కడం లేదు. 2003లో ప్రారంభమైన మోపాడు సప్లై ఛానల్ పనులు నేటికీ నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులకు జైకా నిధులు ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో పురోగతి కనిపించడం లేదు.

- గత ప్రభుత్వంలో అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నిధుల పేరుతో జిల్లాలో 222 రోడ్లను రూ.185.40 కోట్లతో బాగు చేసేందుకు టెండర్లు పిలిచారు. అందులో 149 పనులను మాత్రమే కాంట్రాక్టర్లకు అప్పగించగా, మిగిలినవి చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అయితే ఈ వర్కులకు ఇంతవరకూ ఏఎంసీ నుంచి ఎటువంటి బడ్జెట్ గానీ, రుణం గానీ మంజూరు కాలేదు. చేసిన పనులకు కూడా బిల్లులు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో ఈ రోడ్లను ఇక్కడా బాగు చేయలేక, మరో పథకం కింద బాగు చేయలేక అవస్థలు పడుతున్నారు.
- నెల్లూరులో ఇటీవల కాలంలో రౌడీయిజం ఎక్కువైపోయింది. దీని మూలంగా హత్యలు, గొడవలు కూడా ఎక్కువయ్యాయి. రాత్రిపూట ఆకతాయిలు బ్యాచ్‌లుగా నగరంలో తిరుగుతూ ఒంటరిగా వెళ్లేవారిని కత్తులతో బెదిరించి డబ్బులు లాక్కెళుతున్నారు. రౌడీలు, ఆకతాయిలకు స్థానిక రాజకీయ నేతలు అండ గా నిలుస్తుండడంతో తమకు ఒత్తిళ్లు వస్తు న్నట్లు పోలీసు వర్గాలు బహిరంగంగానే చెబుతున్నా యి. ఈ పరిస్థితిపై కూడా డీఆర్సీలో చర్చించాల్సిన అవసరముంది.



కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఎట్టకేలకు జిల్లా రివ్యూ కమిటీ(డీఆర్సీ) సమావేశం బుధవారం జరగనుంది. ఎనిమిది నెలల అనంతరం జరుగుతున్న సమావేశం కావడం విశేషం. ఈ నెల 8వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'డీఆర్సీ ఉందా.. లేదా..?' కథనానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పందించారు. జిల్లా అభివృద్ధిపై అనేక అంశాలను చర్చించాల్సిన అవసరాన్ని ఆంధ్రజ్యోతి తెలియజేసింది. ఈ విషయాన్ని కలెక్టర్ ఆనంద్.. ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే డీఆర్సీ సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ క్రమంలో తొలుత ఈ నెల 17వ తేదీన డీఆర్సీ నిర్వహణకు సిద్ధమయ్యారు. అయితే ఆ రోజున సీఎం చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లాలో పర్యటిస్తుండటం, అది ఇన్‌చార్జ్ మంత్రి జిల్లా కావడంతో డీఆర్సీ వాయిదా పడింది. ఆ తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేల వీలును పరిగణలోకి తీసుకొని బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కరేడులో భూసేకరణ ప్రక్రియకు అడుగులు

- రైతుల సమ్మతి కోసం రంగంలోకి ఇండోసోల్ ప్రతినిధులు
- కరేడులో భూములున్న బయటి గ్రామాల రైతులపై దృష్టి
- పునరావాస కాలనీలకు అనువైన స్థలం కోసం అన్వేషణ

కందుకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో భూసేకరణ జరిపి తీరాలన్న పట్టుదలతో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తుండగా మరోవైపు ఇండోసోల్ ప్రతినిధులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ఈ దిశగా చర్యలు ప్రారంభించారు. కరేడు పంచాయతీ పరిధిలో ఇండోసోల్ కోసం 8348 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం జీఓ జారీ చేసినా గ్రామస్థుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. తొలివిడత నోటిఫికేషన్ జారీచేసిన 4800 ఎకరాలను ఎట్టిపరిస్థితుల్లో సేకరించాలన్న పట్టుదలతో అధికార యంత్రాంగం రైతులను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేయగా అధికార యంత్రాంగానికి సమాంతరంగా ఇండోసోల్ ప్రతినిధులు కూడా రంగంలోకి దిగి రైతులను ఒప్పించుకునేందుకు తమదైనశైలిలో ప్రయత్నాలు ప్రారంభించారు. భూములు ఇచ్చేందుకు అంగీకరిస్తే మెరుగైన ప్యాకేజీ ఇస్తామని రైతులతో సంప్రదింపులు జరుపుతుండటం విశేషం. ముఖ్యంగా కరేడు గ్రామంలో భూములు కలిగిఉన్న ఇతర గ్రామాల రైతులను తొలుత ఒప్పించే వ్యూహంతో ఇండోసోల్ ప్రతినిధులు రైతులను కలుస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన ధరతోపాటు అనధికారికంగా తాము మరికొంత పరిహారంగా చెల్లిస్తామని రైతులకు ఆశ చూపిస్తున్నారు. ముఖ్యంగా పది ఎకరాలు, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం భూమి కలిగి ఉన్న రైతులకు ఆకర్షణీయమైన ప్యాకేజీ ఆశచూపుతున్నట్లు సమాచారం. ఆవిధంగా కొందరు రైతుల వద్ద నిరభ్యంతర పత్రాలు సేకరించి జిల్లా అధికారులకు అందజేసే ప్రక్రియకు ఇండోసోల్ సిబ్బంది శ్రీకారం చుట్టడమే గాక ఇప్పటికే కొందరు రైతులచేత మౌఖికంగా ఓకే అనిపించుకున్నట్లు చెబుతున్నారు. మరోవైపు



- మిగతా 7లో..

సోమశిలకు 3,856 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 3,856 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 27.510 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 4,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కోవూరు షుగర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కోవూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోవూరు సహకార చక్కెర కర్మాగార సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని మంగళవారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఫ్యాక్టరీ ఆవరణలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. ఏపీఐఐసీ సంస్థకు ఫ్యాక్టరీ ఆవరణను అప్పగించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిందిగా కోరారు. అనంతరం జరిగిన సభలో మంత్రి భరత్ మాట్లాడుతూ ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికులకు, రైతులకు బకాయిలను వెంటనే చెల్లించేందుకు వేగవంతంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అయితే, కొందరు కోర్టులో కేసులు వేసి స్టే తెచ్చినందువల్ల సమస్య పరిష్కరించడంలో ఆలస్యమవుతోందని చెప్పారు. స్టే పొందిన వ్యక్తులతో మాట్లాడి న్యాయసమస్యలు తలెత్తకుండా చూస్తానని అన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు.

2న జడ్పీ స్థాయీ సంఘ సమావేశం

నెల్లూరు (జడ్పీ), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆగస్టు 2వ తేదీన జడ్పీ స్థాయీ సంఘ సమావేశం జరుపుతున్నట్లు జడ్పీ సీఈవో మోహనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రణాళిక, ఆర్థిక పనుల విషయాలపై, మధ్యాహ్నం 12.30 గంటలకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ విషయాలపై, మధ్యాహ్నం 3 గంటలకు విద్య, వైద్య ఆరోగ్య విషయాలపై, సాయంత్రం 4 గంటలకు స్త్రీ శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ విషయా లపై సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రెండు రోజులు.. 62 ప్రశ్నలు!

- అన్నిటికీ మాజీ మంత్రి కాకాణివి రెండే సమాధానాలు
- నాకు తెలియదు.. సంబంధం లేదు!
- ఎక్సైజ్ కేసులో ముగిసిన కస్టడీ.. జైలుకు తరలింపు

నెల్లూరు (క్రైం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులు.. 62 ప్రశ్నలు సంధించిన ఎక్సైజ్ పోలీసులకు మాజీ మంత్రి, కాకాణి గోవర్దన్‌రెడ్డి నుంచి రెండే రెండు సమాధానాలు వచ్చాయి. 'నాకు తెలియదు.. నాకు సంబంధం లేదు.' ఇవి తప్ప కాకాణి నోటినుంచి మరేమాట రానట్లు సమాచారం. పొదలకూరు మండలం ఇరువూరు గ్రామంలోని మద్యం దుకాణం నుంచి మద్యం అక్రమంగా తరలించిన కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీ మంగళవారం ముగిసింది. కోర్టు ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు సోమవారం కాకాణిని కస్టడీకి తీసుకున్నారు. రెండు రోజులపాటు సాగిన విచారణలో ఎక్సైజ్ పోలీసులు 62 ప్రశ్నలు అడగ్గా ఒక్క ప్రశ్నకు కూడా కాకాణి స్పష్టమైన సమాధానం ఇవ్వనట్లు సమాచారం. ప్రధానంగా 2014లో కాకాణిపై గోవా మద్యానికి సంబంధించిన కేసులపై అనేక ప్రశ్నలు అడిగారు. ఆ కేసుల వివరాల గురించి గత ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచారా!? అని ప్రశ్నించగా పొందుపరిచినట్లు కాకాణి చెప్పినట్లు సమాచారం. ఇక ఇరువూరు గ్రామంలో మద్యం దుకాణంలో మద్యం బయటకు వచ్చిన కేసులో మీ అనుచరులు సురేష్ కుమార్‌రెడ్డి, మరో ఇద్దరు ఉన్నారని వారితో ఆ సమయంలో మీరు ఫోన్‌లో మాట్లాడారా!? లేదా!? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయం కావడం, తమ పార్టీకి చెందిన వారు కావడంతో మాట్లాడి ఉంటానని మద్యం విషయం గురించి తనకు తెలియదని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద రెండు రోజులపాటు ఎక్సైజ్ పోలీసులు అడిగిన ప్రశ్నలకు కాకాణి మాత్రం నాకు తెలియదు... నాకు సంబంధం లేదు అన్న సమాధానాలే ఇచ్చినట్లు సమాచారం. మంగళవారం కస్టడీ ముగిశాక గూడూరు కోర్టులో ఎక్సైజ్ పోలీసుల కాకాణిని హాజరు పరిచి అక్కడ నుంచి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.



కాకాణి గోవర్దన్‌రెడ్డి

రిజిస్ట్రేషన్ శాఖలో ఇన్‌చార్జులే దిక్కు!

- రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ల కొరత
- ఆపై ఎస్ఏ, జేఏలూ లేక అవస్థలు
- ఉన్న వారిపై పనిభారం.. పనులకు ఆటంకం

నెల్లూరు (హరనాథపురం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖలలో ప్రధానమైన రిజిస్ట్రేషన్ శాఖను అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ ప్రభావం ఉన్నవారిపై పనిభారం పడటమేకాకుండా పనులు సక్రమంగా జరగడంలేదు. నెల్లూరులోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్, కోవూరు సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. కోవూరు, ఉదయగిరిలలో సీనియర్ సహాయకులే ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా కొనసాగుతున్నారు. అదనపు బాధ్యతల వల్ల సీనియర్ సహాయకులు చూడాల్సిన పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సబ్ రిజిస్ట్రార్ ఉన్నప్పుడు సీనియర్ సహాయకులు వారికి చేదోడు వాదోడుగా పనులు సాగిస్తుంటారు. పనులు కూడా సత్వరమే పూర్తి చేయడానికి అవకాశం కలుగుతుంది. చిట్‌ఫండ్స్ వ్యవహారాలు చేసేందుకు ఒక సబ్ రిజిస్ట్రార్ పోస్టు నెల్లూరులో ఉంది. ఈ పోస్టులోనూ సీనియర్ సహాయకుడే ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. చిట్ ఫండ్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి అందులో జరిగే మోసాలను వెలుగులోకి అధికారులు తీసుకురావాల్సి ఉంది. కానీ అలాంటి పరిస్థితి ఇప్పుడు లేదు. ఇక రిజిస్ట్రేషన్ శాఖలో ప్రధాన అధికారి అయిన జిల్లా రిజిస్ట్రార్ పోస్టుకు కూడా ఇన్‌చార్జ్ కొనసాగడం విశేషం. నెల్లూరులో పని చేస్తుండిన జిల్లా రిజిస్ట్రార్‌ను ప్రకాశం జిల్లాకు ఆరు నెలల క్రితం బదిలీ చేశారు. అప్పటినుంచి ఎవరినీ నియమించలేదు. ఒంగోలుకు బదిలీ అయిన ప్రకాశం జిల్లా రిజిస్ట్రార్‌నే నెల్లూరుకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.



నెల్లూరులో రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న జనం

ఎస్ఏ, జేఏ పోస్టులు ఖాళీ..

జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్, జూనియర్ ఖాళీలు ఉన్నాయి. సీనియర్ సహాయకుల్లో కొందరిని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా నియమించారు. దీంతో రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్ వ్యవహారాలతోపాటు మార్కెట్ విలువలు దస్తావేజుల పరిశీలన సత్వర జారీ వంటి అంశాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత సత్వరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతున్నా దస్తావేజులను రిజిస్ట్రేషన్‌దారుకు అప్పజెప్పడానికి వారం, పదిరోజులు పడుతోంది. అలాగే, రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి వచ్చే సందేహాలను అధికారులు, సిబ్బంది నివృత్తి చేయాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా కొన్ని కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌దారులకు జవాబు చెప్పే వారే కరువయ్యారు. ఇదే అదునుగా దళారులు రంగ ప్రవేశం చేసి ప్రజల నుంచి నగదు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో పదోన్నతులు?

జిల్లాలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రార్లుగా, సీనియర్ సహాయకులకు సబ్ రిజిస్ట్రార్‌లుగా, జూనియర్ సహాయకులకు సీనియర్ సహాయకులుగా పదోన్నతి లభించనుంది. సీనియర్ సహాయకులకు పదోన్నతి లభిస్తే జిల్లాలో ఖాళీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. అప్పటిదాకా ఇన్‌చార్జుల పాలనే ఆ శాఖలో కొనసాగనుంది.



క్రిటికల్ కేర్.. సిద్ధం

8లో..

- ఆగస్టు 15కల్లా జీజీహెచ్‌కు అప్పగింత
- మొత్తం నిర్మాణానికి రూ.23.75 కోట్లు
- రెండు అధునాతన ఆపరేషన్ థియేటర్లు
- ఆధునిక వైద్య పరికరాలు

యాక్సిస్ బ్యాంకుకు బాధితులు

నెల్లూరు(క్రైం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యాక్సిస్ బ్యాంక్ కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న యాక్సిస్ బ్యాంకు నుంచి నోటీసులు అందుకున్న పలువురు బాధితులు మంగళవారం ఆ బ్యాంకుకు చేరుకున్నారు. తమకు నోటీసులు అందాయని, వాటి గురించి తెలియజేయాలని కోరగా నోటీసులు అందిన వారికి స్కామ్‌తో ఎలాంటి సంబంధం లేదని తెలిపినట్లు సమాచారం. దీంతో బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది కనుసైగల్లోనే స్కామ్ జరిగినట్లు పోలీసులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 520

పక్కా గృహాల డబ్బులు ఇవ్వడం లేదు సారూ...

బిట్రగుంట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణానికి బ్యాంకర్లు డబ్బులు ఇవ్వడం లేదు సారూ.. అంటూ యానాదులు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి విన్నవించుకున్నారు. బోగోలు మండలం ఎస్వీపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురం గిరిజన కాలనీకి చెందిన యానాదులు మంగళవారం కావలి ఎమ్మెల్యేని కలిసి తమ ఆవేదనను తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారుల వద్దకు తీసుకుపొమ్మని స్థానిక టీడీపీ నేతలు ఆదిశేషయ్య, తిరుపతిలతో చెప్పారు. ఈ విషయమై బాధితులు మాటాడుతూ పక్కాగృహాల నిర్మాణానికి విడుదలైన నగదు పొదుపు రుణం కింద పట్టుకున్నారని తెలిపారు. అయితే తాము పొదుపు రుణాల నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని తెలిపారు. అయినా తమను ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు.

పిల్లర్ల దశ దాటని చెత్తతో సంపద కేంద్రం

వలేటివారిపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లెలో చెత్తతో సంపద కేంద్రం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.8లక్షలతో పనులు కాంట్రాక్టర్ పిల్లర్ల దశ వరకు పనులు చేపట్టారు. అంతలోనే సాధారణ ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిపేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామంలోని వీధుల్లో చెత్త పేరుకపోయి అంటువ్యాధులు ప్రబలుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన చెత్తతో సంపద కేంద్రం పనులను పునఃప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. వీధుల్లో చెత్తను సంపద కేంద్రానికి తరలించి ఎరువులు తయారీ చేసి, ఆ ఎరువులను రైతులకు తక్కువ ధరకు విక్రయించి వచ్చిన ఆదాయంలో పంచాయతీని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అయ్యవారిపల్లెలో పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన చెత్తతో సంపద కేంద్రం

సాగు, తాగునీటికి సోమశిల జలాలు రప్పిస్తా

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): సాగు, తా గునీటికి సోమశిల జలాలు తీసుకొచ్చి ప్రజలు, రైతుల కష్టాలు తీరుస్తానని ఉదయగిరి ఎమ్మె ల్యే కాకర్ల సురేష్ హామీ ఇచ్చారు. మంగళవారం మంగళవారం మండలంలోని నాగసముద్రం పంచాయతీ అంబటి వారిపాలెంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందరగా రైతులు, మహిళలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నాగసముద్రం పంచాయతీ సమీపంలో ఉన్న సోమశిల ఉత్తరకాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తే ఐదుగ్రామాల భూములకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు కోరారు. తాగునీటికోసం పక్క గ్రామానికి వెళ్లి మినరల్‌వాటర్ కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందని మహిళలు తెలిపారు. స్పందించిన ఆయన ఈ ప్రాంతవాసులకు సోమశిల జలాలు తెస్తానని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకట కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ చీమల తాతయ్య, నాయకులు యర్రగుంట రమణారెడ్డి, బాపతి చినమాలకొండయ్య, యర్రగుంట రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

'సుపరిపాలనలో తొలిఅడుగు'తో సత్ఫలితాలు

● 4వ క్లస్టర్‌లో సంబరాలు ● కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కావలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగుతో నియోజకవర్గంలో సత్ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 4వ క్లస్టర్‌లో డోర్‌టూడోర్ కార్యక్రమం సోమవారంతో దిగ్విజయంగా పూర్తి అయిన సందర్భంగా ఆ క్లస్టర్ బాధ్యులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేతో కేక్ కట్‌చేయించారు. అనుకున్న సమయానికన్నా ముందుగానే కార్యక్రమం పూర్తి చేసినందుకు ఆ క్లస్టర్ బాధ్యులకు ఊహించని గిఫ్ట్‌తో కూడిన ఒక కవర్ ఇచ్చి ఆ సొమ్ముతో క్లస్టర్‌లో కష్టపడ్డ వారంతా ఎంజాయ్ చేసుకోమని ఎమ్మెల్యే చెప్పారు. తీరా ఆకవర్ తెరచి చూస్తే దానిలో రూ.50 వేల ఉండటంతో కష్టేఫలి అన్నట్లుగా కష్టపడ్డ వారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని ఆనందపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదికి రెండు పర్యాయాలు పార్టీ ఏదో ఒక కార్యక్రమం బాధ్యత అప్పచెపుతోందని దానిని మనం సిన్సియర్‌గా చేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అదిష్టానం పార్టీ నేతల కదలికలను నిత్యం గమనిస్తూ సూచనలిస్తుంటుందని, పార్టీ అప్పచెప్పిన కార్యక్రమాలను అందరం సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ కిషోర్ బాబు, జ్యోతి బాబూరావు, 4వ క్లస్టర్ ఇన్‌చార్జి కండ్లగుంట మధుబాబు నాయుడు, కో ఇన్‌చార్జి షేక్ హజరత్, నేతలు అన్నదాత మణి, యేగూరి చంద్రశేఖర్, శానం హరి, గంగినేని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

బలవంతపు భూసేకరణ విరమించుకోవాలి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ● కరేడులో సేకరించనున్న భూముల పరిశీలన

ఉలవపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : కరేడులో బలవంతపు భూముల సేకరణను ప్రభుత్వం మానుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, సీపీఎం నాయకులు కరేడులోని భూసేకరణ ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఉలవపాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాడు వైసీపీ, నేడు టీడీపీ రెండు ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అభివృద్ధి కోసమే రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటున్నాయన్నారు. గతంలో చేవూరు, రావూరు మాదిరిగానే ఇప్పుడు కరేడు భూముల వంతు అయిందన్నారు. కరేడు ప్రజలు చేస్తున్న పోరాటంలో అపూర్వమైన ఐక్యత ఉందని, ఐక్యతను చెడగొట్టేందుకు ప్రయత్నించకుండా మీకు చేతనైన సహాయం రైతులకు, రైతుకూలీలకు చేయాలన్నారు. రైతుల పోరాటానికి రాష్ట్ర రైతు సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పబ్లిక్ హియరింగ్ జరపకుండా ప్రభుత్వం భూసేకరణ చేపట్టడానికే ముందుకెళుతుందన్నారు. దీనిపై రైతులు, బాధితులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలే వెంగయ్య, సీపీఎం నాయకులు మూలం రమేష్, జీ వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నేత ప్రభాకర్‌రెడ్డి

శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌కు సత్కారం

కావలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్లాస్టిక్ భూతం వేషధారణతో ప్రజలకు అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ భూతం వేషధారణపై ఈనెల 19న తిరుపతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎండీ బషీర్‌ను మంగళవారం మున్సిపల్ అధికారులు సత్కరించారు. ముందుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని ఆయన కార్యాయంలో కలవడంతో ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందిని బషీర్‌కు శాలువ కప్పి సత్కరించి అభినందించారు. అలాగే స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో కావలి మున్సిపాలిటీకి 12వ స్థానం రావడంతో మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్‌ను కూడా మున్సిపల్ ఉద్యోగులు సత్కరించా రు. ఈ కార్యక్రమంలో మేనేజరు ఫణీంద్ర, డీఈ సాయిరాం, టీపీవో వివేకానంద్, తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

పీ-4లో భాగస్వాములు కావాలి

కొండాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం రూపొందించిన పీ-4 కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఆదినారాయణరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంపై మండలస్థాయిలోని అన్ని శాఖల అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వీవోఏలకు అవగాహన సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 8,500 కుటుంబాలుండగా అందులో 20 శాతం 1700 బంగారు కటుంబాలను గుర్తించాలని ప్రభుత్వం నిర్దేశించగా ఇప్పటి వరకు 1100 కుటుంబాలను గుర్తించామన్నారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాలలో ఒక్కొక్కరు కనీసం 10 కుటుంబాలకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. కాగా మండలానికి నూతనంగా వచ్చిన డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలో ఎంపికచేసిన బంగారుకుటుంబంలో ఒక విద్యార్థి విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చులు భరిస్తానని చెప్పడం గమనార్హం. అలాగే పదవ తరగతి తర్వాత విద్యాభ్యాసం కొనసాగకుండా ఆపివేసిన విద్యార్థులను గుర్తించి ఓపెన్ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారులు రవికుమార్, ఆనందరావులు కోరారు. ఈకార్యక్రమంలో ఏపీఎం కాంతారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పీ-4 సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆదినారాయణరావు

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

కావలి(టౌన్), జూలై 22(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా గత ఆరు రోజుల నుంచి మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు మంగళవారం తాత్కాలిక విరమణ పలికారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మె పట్ల సానుకూలంగా స్పందించి కొన్ని డిమాండ్లకు పరిష్కారం చూపడం, మరికొన్ని డిమాండ్లపై నెలాఖరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి పరిష్కరిస్తామని సంబంధిత మంత్రులు రాష్ట్ర సీఐటీయూ, సీపీఎం నేతలకు హామీ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు సీఐటీయు పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్ తెలిపారు. కాగా కామ్రేడ్ అచ్యుతానందన్ మృతికి సమ్మె శిబిరంలో కార్మికులు, సీఐటీయూ నేతలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ అచ్యుతానందన్ 17 ఏళ్ల వయస్సులోనే ప్రజా కార్మిక ఉద్యమాల పట్ల ఆకర్షితులై జీవించివున్న 102 ఏళ్ల వరకు ప్రజల పక్షాన ఉద్యమ కెరటమై పోరాడారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణయ్య, మధుసూదన్‌రావు, పోలయ్య, షాన్వాజ్, యూనియన్ నేతలు శీనయ్య, రమేష్, మహేష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలుపుతున్న కార్మికులు

బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులకు సన్మానం

బిట్రగుంట, జూలై 22(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామ చివాలయంలో పని చేసి బదిలీ అయిన ఉద్యోగలును మంగళవారం గ్రామస్థులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. సన్మానం పొందిన వారిలో మహిళ పోలీస్ కే.మౌనిక, అగ్రికల్చర్ అసిస్టెంట్ పీ.సుధీర్, ఏఎన్ఎం డి.అనిత, సహాయక సర్వేర్ కే.సురేష్‌లు ఉన్నారు. స్థానిక టీడీపీ నేత ఐ.రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్, డిజిటల్ అసిస్టెంట్ శ్యాంసుధాకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ టీ.భారతి, కృపావై తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న సహచరులు

పందలపాడులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

కందుకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని పందలపాడులో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికారప్రతినిధి గోచిపాతల మోషే, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కూనం లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు కంజుల రామచంద్రారెడ్డి, వర్ల జోసెఫ్‌కిషోర్, గౌడపేరు నరసింహారావు, వర్ల యాకోబు, ఇస్సాకు, కందుకూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం** : మండలంలోని పెదపవనిలో మంగళవారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, మాజీ సర్పంచు సయ్యద్ నాయబ్‌రసూల్, నాయకులు ఎస్డీ రఫీ, కొండయ్య, పఠాన్ హిదయతుల్లా, ఖాదర్‌బాషా, టంకం హజరత్తయ్య పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పొంగళ్లు



గ్రామ దేవతలకు చీర,సారె తీసుకెళుతున్న మహిళలు

ఉలవపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రామం పచ్చని పంటపొలాలు, పశుపక్షాదులతో చల్లగా ఉండాలని, గ్రామస్థులు సత్సంబంధాలు కలిగి అన్యోన్యంగా ఉండాలనే తలంపుతో మంగళవారం కరేడు ఆడపడుచులు గ్రామదేవతలకు పొంగళ్లు పెట్టుకొని చీర సారెలను సమర్పించారు. గ్రామంలోని ఓరుగంటరెడ్లు కులదేవత ఓరుగంటమ్మకు పొంగళ్లు నిర్వహించి నైవేద్యం, పసుపుకుంకుమ్మ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించారు. అనంతరం తప్పెట్లు, మేళతాళాలతో ఆడపడుచులు గ్రామంలోని 11 మంది గ్రామదేవతలకు నైవేద్యం, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భూసేకరణ ప్రక్రియకు అడుగులు

(5వ పేజీ తరువాయి)

ఈ పనిలో ఉన్న ఇండోసోల్ సిబ్బంది వ్యూహాత్మకంగా ఇప్పటికే 600 ఎకరాల వరకు రైతుల సమ్మతి పత్రాలు పొందగలిగామని మీడియాకు లీకుల సమాచారం ఇస్తుండటం విశేషం. కలెక్టరేట్‌లోను కొందరు సిబ్బంది పనిలో పనిగా వెయ్యి ఎకరాల వరకు రైతుల సమ్మతి వచ్చినందున త్వరలోనే భూసేకరణ ప్రక్రియలో మలిదశ చర్య లు ప్రారంభిస్తామని, అంగీకారం తెలిపిన రైతుల ఖాతాలకు సొమ్ము జమచేయటం ద్వారా మరికొందరు రైతులు ముందుకొచ్చేలా చూస్తామని చెబుతున్నట్లు సమాచారం.

● **పునరావాస కాలనీల కోసం...**

ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం కరేడులో భూములు సేకరించటంతోపాటు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, పొట్టేనిగుంట సంఘాలను ఖాళీ చేయించాలని నిర్ణయించిన విష యం తెలిసిందే. అయితే ఆ కాలనీల ప్రజలు విముఖత చూపుతుండటంతో సోమవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామాలలో ప్రజలతో సమావేశాలు ఏర్పాటుచేసి మెరుగైన సౌకర్యాలతో పునరావాసం కల్పిస్తామని నామాట నమ్మి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, గ్రామస్థులమంతా సమావేశమై అందరి అభిప్రాయాలతో నిర్ణయం తీసుకున్నాక మీకు చెబుతామని బదులిచ్చారు. మరోవైపు ఖాళీచేయాల్సిన మూడు గ్రామాలకు పునరావాస కాలనీల కోసం అనువైన స్థలాన్ని సేకరించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. జాతీయ రహదారి పక్కనే పునరావాస కాలనీలు ఏర్పాటుచేస్తే వారు అంగీకరిస్తారన్న ఆలోచనతో అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా మూడురోజుల క్రితం వేరువెంకటేశ్వరస్వామి ఆలయానికి, మన్నేరుకు మధ్యలో జాతీయ రహదారికి పడమరవైపు ఉన్న భూములను మూడురోజులక్రితం కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ పరిశీలించారు. ఆ భూముల యజమానులతో సంప్రదింపులు జరుపుతూనే ఇతర ప్రాంతాలలో కూడా భూములను పరిశీలన చేస్తున్నారు.



ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

● జీ.సురేష్, ఎంఈవో, కలిగిరి

కలిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకొంటున్నాం. దీంతోపాటు, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడునందిస్తోంది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలిగిరి ఎంఈవో జీ.సురేష్ తెలిపారు.

? మండలంలో ఎన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి

! మండలంలో 69 ప్రభుత్వ, 10 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.

? ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తస్థాయిలో యూనిఫాం, పుస్తకాలు అందాయా.

! ప్రభుత్వ పాఠశాలల్లో 95 శాతం మంది విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశాం.

? విద్యార్థులందరికీ తల్లికి వందనం అందిందా.

! తల్లికి వందనం 85 శాతం మేర విద్యార్థులకు జమ అయింది. 10 శాతం అధికంగా పొలాలు, ఉద్యోగులు, ఐటీ రిటర్న్స్ ఉన్నవారు, 5శాతం అర్హులైనప్పటికీ వారి ఆధార్ నెంబరు బ్యాంకు ఖాతాకు, మొబైల్ నెంబర్లు లింక్ కాని కారణాలతో జమ కాలేదు.

? మధ్యాహ్న భోజనం అమలు ఎలా జరుగుతుంది.

! మండలంలో మొత్తం 4,780 మంది విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఆహారం అందుతుంది.

? పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.

! మండలంలో 35 పాఠశాలలకు మౌలిక వసతులు, ప్రహరీ నిర్మాణాలకు తీర్మానాలు పంపి ఉన్నాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో అంకమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కావలి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోటలో అంకమ్మ తిరునాళ్లలో భాగంగా మంగళవారం మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేశారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. కాగా ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి గ్రామస్థుల ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురి ఇళ్లకు వెళ్లిన వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి యువత సహకరించాలి

అల్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత సహకరించాలని ఎస్ఐ పీ.శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని నార్తుమోపూరులోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో ఏర్పడే దుష్పలితాలు, చట్టపరమైన చర్యలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, విద్యాసంస్థల కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారంతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు పంట నమోదు ప్రామాణికం

వలేటివారిపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వ రాయితీ పథకాలు అందుతాయని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెం, వలేటివారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంటలు సాగుకు ముందు విత్తనశుద్ధి చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంట మార్పిడితో భూములు సారవంతం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీఆర్పీ ఎస్ఐ వెంకట్రావు బాధ్యతల స్వీకరణ



కావలి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కావలి జీఆర్పీ ఎస్ఐగా కె.వెంకట్రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులో పనిచేస్తున్న ఆయన బదిలీపై కావలి రాగా కావలి జీఆర్పీ ఎస్ఐగా పనిచేసిన రమాదేవి గుంటూరు రేంజ్‌కు బదిలీపై వెళ్లారు.

అన్నదాత సుఖీభవ నమోదుకు నేటితో ఆఖరు

వలేటివారిపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన రైతులు తమ పేర్లు నమోదుకు బుధవారంతో గడువు ముగుస్తోంది. ఇప్పటి వరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 6,261 మంది రైతులను అధికారులు గుర్తించారు. ఈ మేరకు సచివాలయాల వారీగా రైతుల జాబితాను అధికారులు రూపొందించారు. అయితే గత వైసీపీలో జరిగిన రీసర్వేలో తప్పులు జరగడంతో చాలా మంది అర్హులు పేర్లు ఈ జాబితాలో కనిపించలేదు. దీంతో కొంతమేర ఆందోళన నెలకొంది. అలాంటి వారు ఎవరైనా ఉంటే ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని అధికారులు అంటున్నారు.

4వ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ మంగళవారం ప్రకటించిన నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో శ్రీగాయత్రీ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల డైరెక్టర్ సీహెచ్ భరద్వాజ, ప్రిన్సిపాల్ పి.గీతా శ్రీనివాస్‌లు అభినందించారు.



15 రోజులుగా మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్



నిరుపయోగంగా మారిన వాటర్ కూలరు

వైద్యశాలలో తాగునీటి కష్టాలు

ఉదయగిరి వైద్యశాలలో రోగులను, సిబ్బందిని తాగునీటి నష్టాలు వెంటాడుతున్నాయి. ఇక్కడ రెండు విద్యుత్ మోటార్లు ఉన్నాయి. 15 రోజుల క్రితం ఓ మోటార్ మరమ్మతులకు గురైంది. మరో మోటార్‌లో నీరు అడుగంటింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి గదుల్లోని బేసిన్‌లు, వార్డులు, మరుగుదొడ్లలో నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అలాగే తాగునీరు అందించే వాటర్‌కూలర్లు సైతం నిరుపయోగంగా మారాయి. దీంతో రోగులు బయట నగదు వెచ్చించి తాగునీరు కొనుగోలు చే స్తున్నారు. నీరు లేకపోతే ఇబ్బందులు ఎలా ఉంటాయో అధికారులకు తెలియదా ? అంటూ పలువురు రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఈవో ప్రశాంత్‌ను వివరణ కోరగా మోటార్ బాగు చేయించేందుకు నిదుల్లేవన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మోటార్ల మరమ్మతులకు చర్యలు చేపడతామని తెలిపారన్నారు.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

పై అక్షరమాలగా విద్యార్థులు

అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో మంగళవారం గణితంలోని పై ఉజ్జాయింపు దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పై అక్షరమాలగా ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖ రెడ్డి మాట్లాడుతూ గణితంలో పై స్థిరాంకానికి ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యార్థి వికాసా నికి గణితం ఎంతో దోహదపడు తొందని పేర్కొన్నారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

-అనంతసాగరం, ఆంధ్రజ్యోతి



కార్మికుల హక్కులు కాలరాసేందుకే లేబర్ కోడ్‌లు

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా సుబ్రహ్మణ్యం



ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీతో కట్టా సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు

కావలి(టౌన్), జూలై 22(ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులు కాలరాసేందుకే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చిందని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టా సుబ్రహ్మణ్యం ఆరోపించారు. మంగళవారం రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ 15వ మహాసభ జరిగింది. ముందుగా డిపో ప్రాంగణంలో సీనియర్ నాయకులు డీఆర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగుల హక్కులను కాలరాసి కార్పొరేట్ శక్తులకు ఎర్ర తివాచీలు పరుస్తున్నాయని ఆరోపించారు. 8గంటల పని దినాన్ని తుంగలో తొక్కి 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టి కార్మికుల శ్రమ దోపిడీకి పూనుకున్నారన్నారు. కార్మికులకు పోరాడే హక్కు లేదంటూ స్వేచ్ఛా స్వాతంత్రాలు హరిస్తున్నారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, పేదలకు ప్రభుత్వ విద్య, వైద్యం అందించకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు మత విద్వేషాలు రెచ్చగొడుతూ లౌకిక వాదాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. దేశంలో జరుగుతున్న కార్మిక వ్యతిరేక విధానాన్ని కార్మికులు పసిగట్టి ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రీజినల్ నాయకుడు నాగేంద్రప్రసాద్, సీనియర్ నాయకుడు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

● నూతన కమిటీ ఏకగ్రీవం

నూతన కమిటీని ఏకగ్రావంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా ఎం వెంకయ్య, అధ్యక్షుడుగా వీవీ రెడ్డి, కార్యదర్శిగా సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా అల్లాబక్షు, కోశాధికారిగా యు మధు, తదితరులు ఎన్నికయ్యారు.

క్రిటికల్ కేర్... సిద్ధం

- ఆగస్టు 15కల్లా జీజీహెచ్‌కు అప్పగింత
- మొత్తం నిర్మాణానికి రూ.23.75 కోట్లు
- రెండు అధునాతన ఆపరేషన్ థియేటర్లు
- ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు
- ఇప్పటికే 80 శాతం పరికరాల రాక

నెల్లూరు (వైద్యం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ విభాగం పూర్తి కావస్తోంది. ఆయుస్మాన్ భారత్ కార్యక్రమం కింద చేపడుతున్న ఈ నిర్మాణంతోపాటు ఆధునిక వైద్య పరికరాల కోసం రూ.23.75 కోట్లు విడుదల చేశారు. 51 వేల చదరపు అడుగుల స్థలంలో మూడు అంతస్తులుగా దీనిని నిర్మించారు. భవన నిర్మాణం పూర్తి కాగా లిఫ్ట్ నిర్మాణం జరుగుతోంది. ఆగస్టు 15వ తేదీ కల్లా ఈ అధునతన భవనాన్ని జీజీహెచ్‌కు అప్పగించనున్నారు. ఇందులో క్రిటికల్ కేర్ విభాగంతోపాటు అదనంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే, రెండు పడకల తల్లీబిడ్డల గది, ఐదు పడకల ఎమర్జెన్సీ విభాగం, రెండు పడకల చిన్నపిల్లల విభాగాలు ఏర్పాటు చేస్తారు. అలాగే 30 పడకల సాధారణ రోగుల వార్డు, 10 పడకల ఐసీయూను ఏర్పాటు చేయనున్నారు. రెండవ అంతస్తులో స్టెరిలైజేషన్‌తో పాటు రెండు ఆధునాతన ఆపరేషన్ థియేటర్లు నిర్మించారు.



క్రిటికల్ కేర్ భవనం

● వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కేంద్రం 60 శాతం నిధులు విడుదల చేయగా మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ నిర్మాణంపై నిర్లక్ష్యం ప్రదర్శించింది. తన వాటా నిధుల విడుదలలో జాప్యం చేయడంతో మొదట్లో నిర్మాణం ఆగి పోయింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు వెనక్కు పోతాయ న్న ఆలోచనతో 2023 మార్చి నెలలో కేంద్రం నిధులతో పనులు ప్రారంభించింది. అయితే చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయక పోవటంతో నిర్మాణంలో జాప్యం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక నిధులను విడుదల చేయటంతో నిర్మాణం పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ ఐడీసీ) నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తోంది. జీజీహెచ్‌లో గతంలో రహదారులు నిర్మించిన కాంట్రాక్టు సంస్థే క్రిటికల్ కేర్ భవన నిర్మాణ టెండర్లు దక్కించుకుంది.

● ఆధునిక పరికరాలు

నూతన క్రిటికల్ కేర్ విభాగానికి కావాల్సిన ఆధునిక పరికరాలలో 80 శాతం ఇప్పటికే చేరుకున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. వచ్చే నెలలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి క్రిటికల్ కేర్ భవనం అప్పగిస్తే వెంటనే దానిని అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా మంత్రులతోగానీ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగాగానీ ప్రారంభింపజేయాలని యోచిస్తున్నారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందుతాయి. ఇప్పటికే జీజీహెచ్‌లో 750 పడకలుఉండగా మరో 50 పడకలు కొత్తగా రానున్నాయి.

నిర్మాణం పూర్తి కావస్తోంది



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవనం పూర్తి కావస్తోంది. ప్రస్తుతం లిఫ్ట్ మాత్రమే పెండింగ్‌లో ఉండటంతో ఆగస్టు 15కల్లా ఈ నిర్మాణన్ని అందుబాటులోకి తీసుకు వస్తాము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిధుల భాగస్వామ్యంతో నిర్మాణం చేపడుతున్నాం. ఇందులో ఆధునిక ఆపరేషన్ థియేటర్‌తోపాటు అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులోకి వస్తాయి.

- నిర్మల్ కుమార్, ఏపీఎంఎస్ఐడీపీ ఈఈ

ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నతి

ఏపీ సాంఘిక సంక్షేమశాఖ సొసైటీ డీపీసీ ప్రభావతి



ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమీక్షిస్తున్న డీపీసీ ప్రభావతి

లింగసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : బాలికలు ఇష్టంగా కష్టపడి చదివితేనే ఉన్నతస్థితికి చేరుకోగలరని ఏపీ సాంఘిక సంక్షేమశాఖ సొసైటీ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ (డీపీసీ) సీ.ప్రభావతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డీ. వెంకట సుబ్బయ్య, ఇతర అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. మెస్‌ను తనిఖీ చేసి, బాలికలకు మెనూ ప్రకారం రుచి శుచిగా మంచి భోజనం అందించాలని ప్రిన్సిపాల్ పీ రుక్మిణీదేవికి సూచించారు. బాలికలు, అధ్యాపకులతో మాట్లాడారు. 10వ తరగతి, ఇంటర్మీడియేట్‌లో బాలికలు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు.

పీఎంశ్రీ పథకం పనులు పూర్తి చేయండి

గురుకుల పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద పాఠశాలకు ఎంపికైన ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబోరేటరీలు, కిచెన్ గార్డెన్, ప్లే గ్రౌండ్, బాతు రూం, నీటినిల్వ నిర్మాణాల పనులను త్వరగా పూర్తి చేయించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ డీ.వెంకట సుబ్బయ్య అన్నారు. అనంతరం ఆయన స్థానిక శ్రీ భోరావు ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించి కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుధీర్‌బాబు, ఏఈ వేణు, వైస్ ప్రిన్సిపాల్ స్నేహలత, ఏంఈవో-2 ఎంవీ శివకుమార్, సీఆర్ఎంటీలు పీ.పురుషోత్తం, బీ.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

లేటరల్ ఎంట్రీ అడ్మిషన్ల గడువు నెలాఖరు వరకు పొడిగింపు

వెంకటాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ వివిధ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ కోసం అడ్మిషన్ల గడువును జూలై 31 వరకు పొడిగిస్తున్నట్లు డీవోఏ డైరెక్టర్ డాక్టర్ ఎం హనుమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ నాలుగేళ్ల హానర్స్, హానర్స్ విత్ రీసెర్చ్ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు ఈ లేటరల్ ఎంట్రీకి అర్హులన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం వీఎస్‌యూ అధికారిక వెబ్‌సైట్‌నుగానీ, లేదా వీఎస్‌యూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు.

108 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 541 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10కంపెనీల ప్రతినిధులు పాల్గొని 433 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-88, ఆర్ఆర్-5, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 108 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160గా ఉంది.

ఇంటింటికి వెళ్లి తల్లీబిడ్డ ఆరోగ్యాన్ని పరిశీలించాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలు ప్రతీ ఇంటికి తిరిగి తల్లీ, బిడ్డ ఆరోగ్య స్థితిని పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో సమీక్ష జరిపారు. 3 నుంచి 15 నెలల బిడ్డలను సందర్శించి విరేచనాలు, శ్వాసకోశ సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలు ఉంటే గుర్తించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలు రక్తహీనతతో బాధపడకుండా ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ గర్భిణులను గుర్తించి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు తక్షణం చికిత్స అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీవేశంలో డీపీఎంవో డాక్టర్ రమేష్, నరసింహారావు, బ్రిజిత మార్గరేట్, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు మూడు బస్తాల యూరియానే వాడండి

● డీఏవో సత్యవాణి



రాయితీపై జీలుగలను రైతులకు అందిస్తున్న సత్యవాణి

నెల్లూరు రూరల్, జూలై 22,(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఎడగారు వ్యవసాయ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు ఎకరాకు మూడు బస్తాల యూరియాను మాత్రమే వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి సూచించారు. మంగళవారం రూరల్ మండలంలోని కొండ్లపూడి, దేవరపాళెం గ్రామాల్లో ఆమె రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రాయితీపై జీలుగలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మితిమీరిన యూరియా వాడకం అనర్థమన్నారు. దీని వల్ల భూమి సహజత్వాన్ని కోల్పోతుందని తెలిపారు. ఒక దఫా యూరియాను తగ్గించుకుని ఆ స్థానంలో నానో యూరియాను పిచికారీ చేస్తే మేలు జరుగుతుందని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో ఎవరైనా రైతుల పేర్లు లేకపోతే వెంటనే వ్యవసాయ శాఖను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీ, శ్రీదేవి, ఏవో నాగమోహన్, ఇన్ఫో మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలపై దృష్టి పెట్టండి

విద్యుత్ శాఖ అధికారులతో ఎస్ఈ విజయన్



ప్రసంగిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ కార్యక్రమం కింద ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. నెల్లూరులోని ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నెల్లూరు టౌన్ ఈఈ ఎం శ్రీధర్ అధ్యక్షతన డివిజన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ వినియోగదారుల నుంచి వచ్చిన ప్రతికూల ఫీడ్‌బ్యాక్‌పై దృష్టి సారించాలన్నారు. మూడు అంశాల్లో లోపాలుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకో వాల్సి వస్తుందని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల వ్యవహారంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలని సూచించారు. వీటి బిగింపు వల్ల వినియోగదారులకు ఎటువంటి అదనపు భారం ఉండదని స్పష్టం చేశారు. కరెంటు పోయిందని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యుత్ లైన్లలో లోపాలుంటే ముందస్తుగానే గుర్తించాలన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబరు 1912, 1800425155333లకు ఫోన్ చేయాలని, అలాగే 9133331912 నెంబర్‌కు వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన సమస్యను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, డీఈలు అశోక్, సునీల్, కిరణ్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు బొబ్బిలి సురేఖ, ఆశాలత పాల్గొన్నారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

● జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా సెప్టెంబరు 13వ తారీఖున జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకుని సుహృద్భావ వాతావరణంలో కేసులు రాజీ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా జడ్జి యల్ తేజోవతి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే వాణి, మునిసిపల్ కమిషనర్ నందన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, న్యాయవాది వీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులే మోసం చేశారు!

రూ.2కోట్లు తీసుకున్నారు!

తల్లి, చెల్లి, మరిదిపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులే తన ను నమ్మించి మోసం చేశారని ఓ మహిళ వేదాయపాలెం పోలీ సులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... పొదలకూరు రోడ్డు నేతాజీ నగర్‌లో పందిపాటి శ్రీవాణి నివసిస్తున్నారు. 2009లో ఆమెకు జనార్దన్‌తో వివాహమైంది. ఆయనకు 2014లో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. 2015లో శ్రీవాణికి కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో అమెరికాకు వెళ్లింది. ఈ క్ర మంలో ఆమె అమ్మ మంజులమ్మ, చెల్లెలు సుధా రాణి, చెల్లెలి భర్త రామరాఘవరెడ్డి శ్రీవాణితో నమ్మకంగా ప్రవర్తించారు. సంపాదనను వారికి ఇస్తే జాగ్రత్తగా దాచుతామని చెప్పడంతో తన భర్తకు తెలియకుండా కుటుంబ సభ్యులకు రూ.2 కోట్ల నగదు పంపింది. గతేడాది శ్రీవాణి తండ్రి అనారోగ్యంతో మరణించడంతో ఆమె నెల్లూరుకు వచ్చారు. మరణానంతర కార్యక్రమాలు పూర్తయిన తర్వా త తాను పంపిన రూ.2 కోట్ల నగదు గురించి కుటుంబ సభ్యుల వద్ద ప్రస్తావించింది. తండ్రే నగదు లావాదేవీలు చూస్తుండే వా డని, తమకు సంబంధం లేదని బుకాయించారు. ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించగా మరోసారి డబ్బులు అడిగితే నీ సంగతి తేలు స్తామని బెదిరించారు. అప్పటి నుంచి బంధువుల ద్వారా చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో మంగళవారం వేదాయపాళెం పోలీసులకు శ్రీవాణి ఫిర్యాదు చేసింది.

రూ.3 కోట్లతో హాస్టల్ భవన నిర్మాణం

● హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలి : సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి




మనుబోలు ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీడీ శోభారాణి

మనుబోలు, జూలై 22(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం స్థానంలో నూతన హాస్టల్ భవనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజూరు చేసిందని సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి తెలిపారు. స్థానిక ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? రుచికరంగా ఉందా? అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి ఆమె అల్పాహారం తీసుకున్నారు. అనంతరం పిల్లలు తయారుచేసిన క్రాఫ్టులను పరిశీలించి అభినందించారు. బాలుర హాస్టల్‌లో మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే బాలికల హాస్టల్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ హాస్టళ్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో సుహాసిని, మ్యాట్రిన్‌లు మహేశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

‘యాక్సిస్’ కుంభకోణంపై విచారణ జరపండి

● ఏఎస్పీకి యానాదుల సంక్షేమ సంఘం ఫిర్యాదు



ఏఎస్పీ సౌజన్యకు వినతి పత్రం ఇస్తున్న యానాదుల సంఘం నాయకులు

నెల్లూరు(క్రైం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఫేక్ కంపెనీలను సృష్టించి ఎస్సీ, ఎస్టీలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి మోసం చేసిన యాక్సిస్ బ్యాంకు కుంభకోణంపై విచారణ జరపాలని యానాదుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సౌజన్యకు వినతి పత్రం ఇచ్చారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ ఈ కుంభకోణంపై కేసు నమోదు చేసి ఎనిమిది నెలలైనా ఎలాంటి చర్యలు లేవని, దీని వెనుక కొంత మంది బ్యాంకు సిబ్బంది పాత్ర ఉందన్నారు. నిందితులు జాలే వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రెండు రోజుల్లో డీజీపీని కలుస్తామని, బాధితు లకు న్యాయం చేయకపోతే ఆగస్టు 1వ తేదీ నుంచి పోరాటానికి దిగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ రాపూరు కృష్ణయ్య, అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష నాగరాజు, కొప్పుల రఘు, బాధితులు చలంచర్ల లక్ష్మీనారాయణ, మేకా తనూజ, వాసు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత.. నిజాయితీ...సేవా తత్పరతతో

విధులు నిర్వహించండి : రేంజ్ ఐజీ త్రిపాఠి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధత.. నిజాయితీ... అంకితభావం సేవా తత్పరతతో విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. ఈ మేరకు మంగళవారం తనను మర్యాదపూర్వకంగా కలిసిన శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ ఎస్ఐలకు దిశా నిర్దేశం చేశారు. గుంటూరు రేంజి పరిధిలో మొత్తం 53 మంది ఎస్ఐలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో గుంటూరు జిల్లా నుంచి 23 మంది, పల్నాడు నుంచి 13, బాపట్ల నుంచి 10, ప్రకాశం నుంచి ఒకరు, నెల్లూరు, తిరుపతి నుంచి ముగ్గురు చొప్పున ఎంపికైన ఎస్ఐలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఐజి త్రిపాఠి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లలో నిర్వహించే విధానాలు, రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు కలిగి ఉన్నప్పుడే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవు తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో వారు అభ్యసించిన అంశాలపై ప్రశ్నలు అడిగి, వారి సేవా దృక్పథాన్ని గమనించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏఆర్ డిఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.